PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 229 | విజయవాడ, బుధవారం 22 మార్చి 2023 | 8 + 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Wednesday 22 March 2023 | Rs

రోడ్డెక్కిన ఆశాలు

- సమస్యలు పరిష్కరించాలని డిఎంఅండ్‌హెచ్‌ఓ వద్ద ఆందోళనలు

● లోపలి పేజీలో.. ●

ప్రజాశక్తి పాఠకులకు, ఏజెంట్లకు, ప్రకటనకర్తలకు, శ్రేయోభిలాషులకు



పండుగ సందర్భంగా నేడు మా కార్యాలయానికి సెలవు. గురువారం పత్రిక వెలువడదు. పునర్దర్శనం శుక్రవారం.

- చీఫ్ జనరల్ మేనేజర్

ఏది నిజం?

ఉపాధ్యాయుల ఖాళీలపై గందరగోళం

రాష్ట్రానిది ఒక లెక్క... కేంద్రానిది మరో లెక్క

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్రంలో ఉన్న ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలపై రాష్ట్రం ఒక మాట, కేంద్రం మరో మాట చెబుతున్నాయి. ఈ గణాంకాల్లో అంతరం ఏకంగా వేలల్లో ఉండడమే ఆశ్చర్యం కలిగిస్తోంది. ఈ విధానంపై పిడిఎఫ్ శాసనసభ్యులు కూడా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తుండడం గమనార్హం. శాసనమండలిలో పిడిఎఫ్ పక్షనేత విఠపు బాలసుబ్రమణ్యం అడిగిన ఒక ప్రశ్నకు సమాధానంగా రాష్ట్రంలో 717 ఖాళీలు మాత్రమే ఉన్నట్లు మంత్రి బొత్స పేర్కొన్నారు. దీంతో ఆశ్చర్యపోయిన బాలసుబ్రమణ్యం మంత్రికి రెండు మార్కులే వేస్తున్నట్లు సభలోనే ప్రకటించి తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. అయితే గత డిసెంబర్ 14వ తేదీన రాజ్యసభలో ఒక సభ్యుడు అడిగిన ప్రశ్నకు కేంద్ర



మంత్రి ధర్మేంద్ర రాతపూర్వకంగా సమాధానమిస్తూ రాష్ట్రంలో 2020-21 నాటికి ఏకంగా 50,677 ఖాళీలు ఉన్నట్లు ప్రకటించారు. అన్ని రాష్ట్రాల వివరాలతోపాటు ఆంధ్రప్రదేశ్ వివరాలు కూడా ఆయన ఇవ్వడం గమనార్హం. మొత్తం ఉపాధ్యాయ పోస్టుల్లో 19.64 శాతం ఖాళీలు ఉన్నట్లు కూడా ఆయన వెల్లడించారు. 2021-22 సంవత్సరంలో 14.01 శాతంతో 35,358 ఖాళీలు ఉండగా, అది తరువాత సంవత్సరానికి మరింతగా పెరిగినట్లు తన నివేదికలో పేర్కొన్నారు. వాస్తవానికి గత కొన్నేళ్లుగా రాష్ట్రంలో ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేయలేదు. మరి కేవలం 717 ఖాళీలే ఉండడం ఎలా సాధ్యమన్నది ప్రశ్నార్థకంగా మారింది. అది కూడా ఇంత తక్కువగా చూపించడం అన్నది ఖాళీ పోస్టుల విషయాన్ని దాచడమేనన్న భావన కూడా వ్యక్తమవుతోంది. దాదాపు 31 వేల పోస్టులను భర్తీ చేయాల్సిన అవసరం లేదని కూడా ప్రభుత్వం భావిస్తోంది.

ప్రపంచ బ్యాంకు సూచనలతోనే

ప్రపంచబ్యాంకు మార్గదర్శకాలతోనే ఉపాధ్యాయ పోస్టులను తగ్గించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శలు ఉన్నాయి. జూన్ 2021 నాటికి రాష్ట్రంలో 1,86,475 మంది మిగతా 6లో

ప్రగతిశీల సిఎంల వేదిక

- గ్రూప్ 8 ఏర్పాటుకు కేజ్రీవాల్ ప్రతిపాదన
- బిజెపియేతర, కాంగ్రెసేతర సిఎంలకు లేఖ

న్యూఢిల్లీ : ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్), తృణమూల్ కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) కలిసి బిజెపియేతర, కాంగ్రెస్సేతర కూటమిని ఏర్పాటు చేసే దిశగా ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నాయి. విశ్వసనీయ సమాచా రం ప్రకారం.. బిజెపియేతర, కాంగ్రెస్సేతర పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల సిఎంలతో భారత ప్రగతిశీల ముఖ్యమంత్రుల వేదిక (గ్రూప్ 8) ఏర్పాటుకు ఢిల్లీ సిఎం కేజ్రీవాల్ ప్రయత్నిస్తున్నారు. ఈ మేరకు పశ్చిమ బెంగాల్ సిఎం మమతా బెనర్జీ, తెలంగాణ (కె చంద్రశేఖర రావు), తమిళనాడు (ఎంకె స్టాలిన్), కేరళ (పినరయి విజయన్), జార్ఖండ్ (హేమంత్ సోరేన్), పంజాబ్ (భగవంత్ సింగ్ మన్) తదితరులకు ఆయన ఇటీవల ఒక లేఖ రాసినట్లు తెలిసింది. 'మనమంతా కలిసి ప్రగతిశీల ముఖ్యమంత్రుల వేదిక (గ్రూప్ 8)గా కూటమి కడదాం' అని ఆయన లేఖలో ప్రతిపాదించినట్లు సమాచారం. అయితే ఇదే అంశంపై చర్చలు జరిపేందుకు ఢిల్లీలో విందుకు రావాల్సిందిగా ఇదివరకే కేజ్రీవాల్ పలువురు సిఎంలను ఆహ్వానించారు. ఆ కార్యక్రమం కార్యరూపం దాల్చలేదు. ఇప్పుడు మళ్లీ గ్రూప్ 8 వేదికను ఆయన తెరపైకి తీసుకురావడం విశేషం. కాగా సిబిఐ, ఇడి వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను కేంద్ర ప్రభుత్వం దుర్వినియోగం చేస్తున్న తీరుపై గ్రూప్ 8 తొలి చర్యగా ఒక ఉమ్మడి పిటిషన్ దాఖలు చేయాలని కూడా కేజ్రీవాల్ తాజా లేఖలో ప్రతిపాదించినట్లు సమాచారం. అయితే కేజ్రీవాల్ తాజా ప్రతిపాదనలకు సంబంధిత పక్షాలన్నీ అంగీకరించాయా లేదా అన్నది స్పష్టత లేదు. కేంద్ర దర్యాప్తు సంస్థల దుర్వినియోగంపై ఉమ్మడి ఫిర్యాదు ఇవ్వడానికి టిఎంసి, బిఆర్ఎస్, ఆప్ ఇప్పటికే నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. సుప్రీంకోర్టు లేదా ఢిల్లీ హైకోర్టులో ఈ ఉమ్మడి పిటిషన్ దాఖలు చేసే వీలుందని ఆప్ సీనియర్ నేత ఒకరు తెలిపారు.

పది గంటలకు పైగా..

- కవితను విచారించిన ఇడి

లోపలి పేజీలో...

అసెంబ్లీ ప్రతిష్టను దిగజార్చారు

- జిఒ నం.1 రద్దు చేయాల్సిందే..
- అంగన్‌వాడీలపై నిర్బంధం తగదు : వి శ్రీనివాసరావు

కార్మికులు, కార్మిక సంఘాల నోరు నొక్కాలని చూస్తే ప్రభుత్వాన్ని నొక్కేస్తారు

- సిఐటియు ప్రధాన కార్యదర్శి నర్సింగరావు
- సమస్యలు పరిష్కరించకపోతే నిరవధిక ఆందోళన : సుబ్బరావమ్మ

● లోపలి పేజీలో.. ●

ఉరి శిక్ష అమానుషం !

- ప్రత్యామ్నాయాలపై సుప్రీం మల్లాగుల్లాలు
- కమిటీ ఏర్పాటుకు సుముఖత

● లోపలి పేజీలో.. ●

బడిపిల్లలకు పోషకాహారం

- రాగి జావ పంపిణీ ప్రారంభంలో సిఎం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

బడిపిల్లల్లో పోషకాహార లోపాన్ని తగ్గించేందుకు జగనన్న గోరుముద్దలో రాగిజావను పంపిణీ చేస్తున్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. 44,392 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లోని 37,63,698 మంది విద్యార్థులకు లబ్ధి కలిగిస్తూ రాగిజావ అందించే కార్యక్రమాన్ని సిఎం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. ప్రభుత్వ బడుల్లో చదువుకునే పిల్లలు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో గోరుముద్ద కార్యక్రమాన్ని పటిష్టంగా అమలుచేసేలా అడుగులు వేస్తున్నామన్నారు. ఇప్పటికే రోజుకొక మెనూ అమలు చేస్తున్నామని, ఇక నుంచి రాగిజావను కూడా కలుపుతున్నామని వివరించారు. పిల్లల్లో ఐరన్, కాల్షియం కంటెంట్ పెంచడానికి ఉపయోగపడుతుందన్నారు. వారంలో ఆరురోజులూ వేర్వేరు రకాల వంటకాలను ఏర్పాటుచేశామని, రాగిజావ కార్యక్రమంలో సత్యసాయి ట్రస్ట్ భాగస్వాములు కావడం మంచి పరిణామమని పేర్కొన్నారు. ఏడాదికి రూ.86 కోట్లు ఖర్చయ్యే కార్యక్రమంలో ట్రస్టు రూ.43 కోట్లు



రాగి జావ పంపిణీని ప్రారంభిస్తున్న సిఎం జగన్

ఇస్తుందని, మిగిలిన రూ.44 కోట్లు ప్రభుత్వం అందిస్తుందని వివరించారు. గత ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టి ఏడాదికి రూ.490 కోట్లు కూడా ఖర్చు చేయలేదన్నారు. వండిపెట్టే ఆయాలకు రూ.1000 ఇచ్చారని, అది కూడా ఎనిమిది నుంచి పది నెలలు బకాయిపెట్టి ఇచ్చేవారని తెలిపారు. సరుకులు కూడా ఆరు నుంచి ఎనిమిది నెలలు బకాయిలు పెట్టే పరిస్థితి ఉండేదని, అలా కాకుండా వైసిపి ప్రభుత్వం ముందుకు వెళుతోందని తెలిపారు. ఉన్నత విద్యలోనూ సమూల మార్పులు చేస్తున్నామని చెప్పారు. జాబ్ ఓరియంటెడ్ విద్యా విధానాన్ని ఏర్పాటు చేశామన్నారు. విద్యా దీవెన, వసతి దీవెనలను అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రతి అడుగులోనూ పిల్లలందరూ భావి ప్రపంచంతో పోటీపడేలా, అక్కడ నెగ్గేలా ప్రతి అడుగూ వేస్తున్నామని తెలిపారు. టెన్త్ పరీక్షలకు హాజరవనున్న పిల్లలకు శుభాకాంక్షలు తెలియజేశారు.



దెబ్బతిన్న అరటి పంటను పరిశీలిస్తున్న రాఘవులు

అన్నదాతను ఆదుకోండి

- అకాల వర్షంతో పంట నష్టం
- బాధితులందరికీ పరిహారం : రాఘవులు డిమాండ్

ప్రజాశక్తి - కదిరి టౌన్, నార్పల

ఇటీవల కురిసిన అకాల వర్షానికి ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా వందలాది ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని, తక్షణమే రైతులందరికీ నష్టపరిహారం అందజేయాలని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు డిమాండ్ చేశారు. అనంతపురం, సత్యసాయి జిల్లాల్లో దెబ్బతిన్న పంటలను మంగళవారం ఆయన పరిశీలించారు. సత్యసాయి జిల్లా కదిరి మండల పరిధిలోని మూర్తిపల్లి, వరిగిరెడ్డిపల్లి, బత్తలపల్లి, అనంతపురం జిల్లా నార్పల మండల పరిధిలోని కేశేపల్లి, వెంకటాంపల్లి, నాయనపల్లి గ్రామాల్లో పర్యటించి దెబ్బతిన్న మొక్కజొన్న, అరటి, చీనీ, కూరగాయల పంటలను పరిశీలించారు. ఆయా గ్రామాల్లో బాధిత రైతులతో మాట్లాడి పంట నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాఘవులు మీడియాతో మాట్లాడుతూ.. ఇంత పెద్ద ఎత్తున పంట నష్టం వాటిల్లినా అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటి వరకు స్పందించిన దాఖలాలు లేవని విమర్శించారు. ఒక ఎకరా మొక్కజొన్న పంట సాగు చేయాలంటే రూ.30 వేలు, టమోటాకు రూ.లక్ష పెట్టుబడులు అవుతుందని పేర్కొన్నారు. ప్రతి పంటకూ వేలాది రూపాయలను అన్నదాతలు ఖర్చు పెట్టారని, అకాల వర్షంతో పెట్టుబడులన్నింటిని నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులు స్వయంగా వచ్చి ప్రకృతి ప్రళయాన్ని కళ్లారా చూసి రైతులను ఆదుకునే చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తనకు అవకాశం ఇస్తే పంట నష్టాన్ని ఆయనకు వివరిస్తానని చెప్పారు. ఇ-క్రాప్ బుకింగ్ జరగలేదని చెప్పి రైతులకు పరిహారం ఇవ్వకుండా తప్పించుకునే ప్రయత్నం జరుగుతోందని, ఇది సరైన పద్ధతి కాదన్నారు. ఇ-క్రాప్‌తో సంబంధం లేకుండా బాధిత రైతులందరికీ పరిహారం ఇవ్వాలని కోరారు. తక్షణమే వ్యవసాయ అధికారులు ఆయా గ్రామాల్లో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేయాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వం స్పందించకుంటే రైతులకు అండగా సిపిఎం పోరాటం చేస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.రాంభూపాల్, కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప, సిపిఎం సత్యసాయి జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్, రైతు సంఘం సత్యసాయి జిల్లా కార్యదర్శి బడా సుబ్బిరెడ్డి పాల్గొన్నారు.

అదానీ అక్రమాలపై జెపిసి వేయాల్సిందే

- ప్రతిపక్షాల డిమాండ్
- పార్లమెంటు ఆవరణలో ఆందోళన

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సన్నిహితుడైన అదానీ గ్రూపు సంస్థల అధినేత గౌతమ్ అదానీ అక్రమాలపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జెపిసి) నియమించాల్సిందేనని ప్రతిపక్షాలకు చెందిన పలువురు ఎంపీలు మరోమారు పునరుద్ఘాటించారు. అదానీ అక్రమాలకు పాల్పడిన వైనాన్ని హిండెన్‌బర్గ్ సంస్థ బట్టబయలు చేయడం, అనంతరం రూ.లక్షల కోట్ల మదుపర్ల సొమ్ము ఆవిరైపోయినా ప్రధాని మోడీ నోరు మెదపడం లేదని విమర్శించారు. బిజెపి ప్రభుత్వానికి, అదానీకి వ్యతిరేకంగా పార్లమెంటులోనూ, వెలుపలా ప్రతిపక్ష సభ్యుల నినాదాలు మార్మోగాయి. పార్లమెంటులో మొదటి అంతస్థులో ఉన్న ఎస్‌బిఐ బ్రాంచ్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టిన ప్రతిపక్షాల ఎంపిలు ఒక్క అదానీకే రూ.వేలాది కోట్ల మొత్తాన్ని రుణాలుగా ఎలా ఇచ్చారంటూ నిలదీశారు. హిండెన్‌బర్గ్ నివేదిక తర్వాత తీవ్ర ప్రభావానికి గురైన విత్త సంస్థల్లో ఎస్‌బిఐ ఒక్కటి. బిజెపి ప్రభుత్వ ఒత్తిళ్లతోనే విత్త సంస్థలు నుంచి అధిక మొత్తంలో అదానీకి రుణాలు మంజూరయ్యాయని విమర్శించారు.



అదానీ అక్రమాలపై కేంద్ర ప్రభుత్వ దాటవేత వైఖరిని నిరసిస్తూ పార్లమెంటు కారిడార్లలో ఆందోళన చేస్తున్న ప్రతిపక్షాల ఎంపీలు

అడుగడుగునా అక్రమాలు చోటుచేసుకున్న ఈ వ్యవహారంలో నిజానిజాలు తేల్చడానికి 'జెపిసి వేయాల్సిందే'నని నినాదాలతో హోరెత్తించారు. ప్రధానంగా అదానీ గ్రూప్ స్టాక్ మేనిప్యులేషన్, ఆర్థిక మోసాలు వంటి అక్రమాలకు పాల్పడినట్లు వచ్చిన ఆరోపణలపైనా సమగ్ర దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. అదానీ ప్రస్తావన రాగానే ప్రధాని మోడీ చర్చ నుంచి పారిపోతున్నారని ప్రతిపక్షనేత మల్లికార్జున ఖర్గే విమర్శించారు. 'అదానీ బాగోతంపై పార్లమెంటులో చర్చ జరగనీయకుండా ప్రభుత్వం అడ్డుకుంటోంది. దేశ ప్రయోజనాలకు సంబంధించిన అంశాలను మిగతా 2లో

రిషికొండ తవ్వకాలపై సర్వే పూర్తి

- హైకోర్టుకు తెలిపిన కేంద్రం

ప్రజాశక్తి-అమరావతి

రిషికొండ తవ్వకాలపై కేంద్ర ప్రభుత్వ అధికారుల కమిటీ ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు క్షేత్రస్థాయిలో సర్వే చేసిందని హైకోర్టుకు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఈ విషయాన్ని కేంద్రం తరఫున డిప్యూటీ సొలిసిటర్ జనరల్ ఎన్ హరినాథ్ మంగళవారం హైకోర్టుకు చెప్పారు. కమిటీ నివేదిక తయారీలో ఉందన్నారు. నివేదిక సమర్పణకు కొంత గడువు కావాలని కోరారు. అందుకు అనుమతించిన హైకోర్టు తదుపరి విచారణ ఏప్రిల్ 12వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. విశాఖపట్నం జిల్లా, యండాడ గ్రామంలోని సర్వే నెంబర్ 19 పరిధిలోని కోస్టల్ రెగ్యులేషన్ జోన్లో చెట్ల నరికివేత, భూమి తవ్వకాలకు అధికారులు అనుమతులు ఇవ్వడాన్ని జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్, విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ పిల్స్ దాఖలు చేశారు. కేంద్ర ప్రభుత్వ అధికారులతో హైకోర్టు కమిటీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

దేశ ఐక్యత, సమగ్రతకు రాజ్యాంగమే రక్షణ కవచం

- గవర్నరు జస్టిస్ అబ్దుల్ నజీర్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశ ఐక్యత, సమగ్రతకు రాజ్యాంగమే రక్షణ కవచమని రాష్ట్ర గవర్నరు ఎస్ అబ్దుల్ నజీర్ అన్నారు. మంగళవారం అంబేద్కర్ ఇంటర్నేషనల్ సెంటర్లో జరిగిన ఇండియన్ మైనారిటీస్ ఫౌండేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భిన్నత్వంలో ఏకత్వమే భారత సమాజ తత్వమని అన్నారు. వివిధ కులాలు, మతాలు, సంస్కృతులతో ఏర్పడిన హరివిల్లే భారత దేశమని వివరించారు. సామరస్యత సాధనమైన రాజ్యాంగం జాతి, కుల, మత ఆధారిత వివక్ష లేకుండా ప్రాథమిక హక్కులు అందరికీ సమానంగా అందించిందన్నారు. న్యాయ వ్యవస్థ అమలులో రాజ్యాంగస్ఫూర్తి పరిరక్షణ అత్యంత కీలకమని వ్యాఖ్యానించారు. సమసమాజ స్ఫూర్తితో అన్నివర్గాలను అక్కున చేర్చుకుని కలుపుకుపోతేనే అభివృద్ధి సాధ్యమని, ఇందుకు అందరి సమ్మిళిత కృషి అవసరమని తెలిపారు. అల్పసంఖ్యాకులు వివిధ రంగాల్లో అత్యున్నత స్థానాలను అధిరోహించారని గుర్తుచేశారు. మైనారిటీలు తమ వెనుకబాటుతనానికి కారణాలను, అంతర్గత లోపాల గూర్చి ఆత్మావలోకనం చేసుకోవాల్సిన అవసరముందన్నారు. వెనుకబాటుతనానికి ఉగ్రవాదం, అభద్రత, అశాంతి కారణ కారకాలని, అవి ఉన్నచోట అభివృద్ధి అసాధ్యమని అన్నారు. వలసవాద భావజాలం, ఆలోచనా విధానం విడనాడాలని, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం ఆధారంగా ఐకమత్యంతో, అందరి భాగస్వామ్యంతోనే భారతదేశ మనుగడ, అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చండీగఢ్ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ సత్నామ్ సింగ్ సంధు, వైస్ ప్రెసిడెంట్ హిమాని సూద్ తదితరులు పాల్గొన్నారు.

వారంలో 'స్కిల్' అవినీతి నిరూపించాలి

- మాజీ మంత్రి నక్కా ఆనంద్ బాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

స్కిల్ డెవలప్మెంట్ ప్రాజెక్టుపై జగన్ చేస్తున్న ఆరోపణలను కట్టుకథలే అని మాజీమంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు నక్కా ఆనంద్ బాబు విమర్శించారు. అసత్య ఆరోపణలతో కాలయాపన చేయకుండా ఏ షెల్ కంపెనీల నుంచి ఏ టిడిపి నేతల ఖాతాలకు డబ్బులు వచ్చాయో వారంలో జగన్ బయటపెట్టాలని డిమాండ్ చేశారు. టిడిపి కార్యాలయం ఎన్టీఆర్ భవన్లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పుతో జగన్ మతిభ్రమించిందని, అందుకే పసలేని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. నాలుగేళ్లుగా విచారణల పేరుతో కాలయాపన తప్ప, ప్రభుత్వం అవినీతిపై ఏం తేల్చిందని ప్రశ్నించారు. ఎక్కడా, ఎలాంటి అవినీతిలేని స్కిల్ డెవలప్మెంట్ ప్రాజెక్టుపై జగన్ అసెంబ్లీలో రెండు గంటల పాటు అసంబద్ధ ఆరోపణలు చేశారని తెలిపారు. దొంగే దొంగ అన్నట్టుగా సిఎం వ్యవహారశైలి ఉందని విమర్శించారు. రూ.371 కోట్ల సొమ్ము ఎక్కడి నుంచి ఎవరికి వచ్చిందో చెప్పకుండా ఊరికే నిందారోపణలు చేయడం సిగ్గుచేటమని తెలిపారు. ప్రజల సొమ్ము కొట్టేయడం, షెల్ కంపెనీలతో దాన్ని మాయం చేసి తిరిగి తన కంపెనీల్లోకి రాబట్టుకోవడం జగన్కు మాత్రమే అబ్బిన అవినీతి విద్య అని విమర్శించారు. స్కిల్ డెవలప్మెంట్లో షెల్ కంపెనీల ద్వారా అవినీతి సొమ్ము విదేశాలకు వెళ్లి తిరిగి హైదరాబాద్కు వచ్చిందని జగన్ ఆరోపిస్తున్నారని తెలిపారు. అతని వద్ద ఆధారాలు ఉంటే ఎందుకు బయటపెట్టడం లేదని ప్రశ్నించారు.

ఎస్సి, ఎస్టి సబ్ప్లాన్ చట్టాన్ని పునరుద్ధరించాలి

- ధర్నాలో కెవిపిఎస్, డిహెచ్పిఎస్ నేతలు



ధర్నాలోపాల్గొన్న దళిత, కార్మిక సంఘల నాయకులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎస్సి, ఎస్టి సబ్ప్లాన్ చట్టాన్ని పునరుద్ధరించి రాజ్యాంగ స్ఫూర్తితో అమలు చేయాలని, ఉపాధి హామీ చట్టానికి కేంద్రం రూ.2 లక్షల కోట్లు కేటాయించాలని, కుటుంబానికి 200 రోజులు పనిదినాలు కల్పించడంతో పాటు రూ.600 వేతనం ఇవ్వాలని కెవిపిఎస్, డిహెచ్పిఎస్ నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దళితులపై మనువాద మతోన్మాద బిజెపి దాడులను అరికట్టాలని, రాజ్యాంగం కల్పించిన హక్కుల అమలు కోసం మంగళవారం విజయవాడ ధర్నాచౌక్లో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సీలింగ్ చట్టాన్ని తిరిగి వర్గీకరించి భూమి లేని పేదలందరికీ పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కోనేరు రంగారావు సిఫార్సులతోపాటు అసైన్డ్ చట్టం, అటవీ హక్కుల చట్టాలను సమర్ధవంతంగా అమలు చేయాలన్నారు. దేశవ్యాప్తంగా చేపట్టే జనాభా లెక్కలతో పాటు కుల ప్రాతిపదికపై విడిగా జనాభా లెక్కలు సేకరించాలని మాల్యాద్రి పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, మానిటైజేషన్ పైపులైన్ ఆపాలని, కాంట్రాక్టు, అవుట్సోర్సింగ్ కార్మికులందరినీ క్రమబద్ధీకరించాలని అన్నారు. ప్రైవేటు రంగంలో ఉద్యోగాల కల్పన కోసం నిర్బంధంగా రిజర్వేషన్లు ప్రవేశపెట్టాలని, సార్వత్రిక ఉచిత విద్యను ప్రభుత్వ ఆరోగ్య సేవలను విస్తరించి అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షులు శివనాగరాణి మాట్లాడుతూ దళితులు, మహిళలు, మైనార్టీలపై ఉద్దేశపూర్వకంగా జరుగుతున్న దాడులు, హత్యలకు వ్యతిరేకంగా ప్రత్యేక చట్టాన్ని రూపొందించాలని, రాజాంగ బద్ధంగా సాధించుకున్న హక్కులను కూడా కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కాలరాస్తోందని అన్నారు. దళిత హక్కుల పోరాటసమితి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జెవి ప్రభాకరరావు, కరవది సుబ్బారావు, బుట్టి రాయప్ప, పేరయ్య మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఎస్సి, ఎస్టి సబ్ప్లాన్ చట్టాన్ని నీరుగారుస్తూ దళితులు, మహిళలు, మనువాద, మతోన్మాద దాడులకు పాల్పడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.నటరాజ్, డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.క్రాంతికుమార్, నాయకులు సిహెచ్ శ్రీనివాసరావు, మోజెస్, దళిత ప్రజాసంఘాల నాయకులు సర్వేపల్లి సుదర్శనరావు, కొరివి వినయ్కుమార్, సిహెచ్ నాగేంద్ర, రమేష్, అప్పలస్వామి, కోటేశ్వరమ్మ, నరసింహారావు పాల్గొన్నారు.

విజయవాడలోనే కెఆర్ఎంబి..

- పోలవరం ప్రాజెక్టు పూర్తిస్థాయిలో 150 అడుగులు నిర్మించాలి
- కేంద్ర జలశక్తి కార్యదర్శికి రైతు నేతలు వినతి



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కృష్ణా నదీ జలాల యాజమాన్య బోర్డు (కెఆర్ఎంబి)ను విజయవాడలోనే ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు డిమాండ్ చేశారు. కేంద్ర జలశక్తిశాఖ కార్యదర్శి పంకజ్ కుమార్కు మూడు అంశాలపై రైతు సంఘం నేతలు మంగళవారం వినతి అందజేశారు. ఈ మూడు వినతి పత్రాలపై పంకజ్ కుమార్ పరిశీలించి న్యాయం చేస్తానని రైతు ప్రతినిధులకు హామీ ఇచ్చారు. అనంతరం శోభనాద్రీశ్వరరావు మీడియాతో మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 2014, ప్రాణ్యన్ కమిటీ నివేదిక ప్రకారం పోలవరం ప్రాజెక్టును పూర్తిస్థాయిలో 150 అడుగులు ఎఫ్ఆర్ఎల్లో నిర్మించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నట్లు 41.15 (140 అడుగులు) మీటర్ల ఎత్తులో పోలవరం నిర్మాణం చేపడితే ఆమోదయోగ్యం కాదని అన్నారు. ప్రముఖ ఇరిగేషన్ ఇంజినీరు, కేంద్ర మాజీ మంత్రి కెఎల్ రావు పేరు మీద విజయవాడలోని ప్రకాశం బ్యారేజ్ పక్కన ఉన్న ఆయన సమాధి పక్కనే మెమోరియల్, మ్యూజియం ఏర్పాటు చేయాలని కోరారు. దీనివల్ల రైతులకు, జలవనరులశాఖ అధికారులకు ఎంతో ఉపయోగకరమని తెలియజేశారు. సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం కెఆర్ఎంబిని విజయవాడలోనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలోనూ, ప్రస్తుత వైసిపి ప్రభుత్వం హయాంలోనూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు కేంద్ర జలశక్తి శాఖకు అనేకసార్లు విజ్ఞప్తి చేశారని, దానికి విరుద్ధంగా ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం కృష్ణానది బేసిన్కు అవతల గోదావరి బేసిన్ దాటి 400 కిలోమీటర్ల దూరంలో ఉన్న విశాఖపట్నంలో ఈ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించటం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో నల్లమడ రైతు సంఘం అధ్యక్షులు కొల్లా రాజమోహన్, రైతు నాయకులు కుర్రా నరేంద్ర, గుండపనేని ఉమా వరప్రసాద్, వేములపల్లి శ్రీనివాసరావు, చుండూరు రంగారావు తదితరులు పాల్గొన్నారు.

పిఎసిలో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి

- శాసనసభ స్పీకరుకు పిఎసి ఛైర్మన్ పయ్యావుల లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



ఎపి శాసనసభ ప్రజాపద్దుల కమిటీ (పిఎసి)లో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని కమిటీ ఛైర్మన్ పయ్యావుల కేశవ్ కోరారు. ఈ మేరకు శాసనసభ స్పీకరుకు మంగళవారం లేఖ రాశారు. 12 మంది సభ్యులు ఉండాల్సిన కమిటీలో ప్రస్తుతం ఐదుగురే ఉన్నారని తెలిపారు. తనతోపాటు సభ్యులుగా ఎమ్మెల్యేలు కె సంజీవయ్య, భూమన కరుణాకర్ రెడ్డి, కాటసాని రామ్భూపాల్ రెడ్డి, శాసనమండలి నుంచి వి బాలసుబ్రమణ్యం మాత్రమే ఉన్నారని పేర్కొన్నారు. గతంలో సభ్యులుగా ఉన్న కోలగట్ల వీరభద్ర స్వామి డిప్యూటీ స్పీకర్గా, మేరుగ నాగార్జున, జోగి రమేష్, కెవి ఉషశ్రీ చరణ్ మంత్రులుగా, కరణం ధర్మశ్రీ ప్రభుత్వ విప్గా కొనసాగుతున్నారని తెలిపారు. వీరి స్థానంలో మరొకరిని నియమించలేదని తెలిపారు. వీటితోపాటు ఖాళీగా ఉన్న మరో రెండుస్థానాలనూ నియమిస్తే కమిటీ పనిచేయడం ప్రారంభమవుతుందన్నారు. ఈ అంశంపై ఇప్పటికే అసెంబ్లీ కార్యదర్శికి అక్టోబరు 21న లేఖ రాశానని, అయినా ఇప్పటికీ భర్తీ చేయలేదని పేర్కొన్నారు.

కార్మికులు, కార్మిక సంఘాల
నోరు నొక్కాలని చూస్తే ప్రభుత్వాన్ని నొక్కేస్తారు

- సిఐటియు ప్రధాన కార్యదర్శి నర్సింగరావు
- సమస్యలు పరిష్కరించకపోతే నిరవధిక ఆందోళన : సుబ్బరావమ్మ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అంగన్వాడీ కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని, కార్మికులు, కార్మిక సంఘాల నోరు నొక్కే ప్రయత్నం చేస్తే ప్రభుత్వాన్ని నొక్కేస్తారని, సమస్యను పరిష్కరించపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు రాష్ట్రప్రభుత్వాన్ని హెచ్చరించారు. మంగళవారం విజయవాడ ఎంబివికెలో జరిగిన విలేకరుల సమావేశంలో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు, ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె సుబ్బరావమ్మ, బేబీరాణితో కలిసి ఆయన మాట్లాడారు. అంగన్వాడీ కార్యకర్తల ధర్నాకు అనుమతి ఇవ్వకుండా ప్రభుత్వం పోలీసులతో అణచాలని చూడటం దుర్మార్గమని, ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. సంక్షేమ రంగంలో పనిచేస్తున్న 1.20 లక్షల మంది అంగన్వాడీలను రాష్ట్రప్రభుత్వం ఏమాత్రమూ పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. తెలంగాణ కంటే ఎక్కువ జీతం ఇస్తానని పాదయాత్రలో సిఎం జగన్ చెప్పిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఇప్పుడు తెలంగాణ కంటే జీతం తక్కువగా ఉందని అన్నారు. నాలుగేళ్ల నుంచి మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని, ఇచ్చిన హామీ ప్రకారం వేతనాలను ఎందుకు ఇవ్వరని ప్రశ్నిస్తే పోలీసులతో అణచివేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ నాయకులు అంగన్వాడీ పోస్టులను అమ్ముకుంటూ డబ్బులు సంపాదిస్తున్నారని విమర్శించారు. మినీవర్కర్లకు ప్రమోషన్లు ఇచ్చే అవకాశం ఉన్నా వాటిని భర్తీ చేయడం లేదన్నారు. 350 మంది కంటే ఎక్కువగా ఉన్న కేంద్రాన్ని ప్రధాన కేంద్రంగా చేయాల్సి ఉన్నా చేయడం లేదన్నారు. సమస్యను సామరస్యంగా పరిష్కరిస్తుందో జటిలం చేస్తుందో ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలన్నారు. అంగన్వాడీ కార్యకర్తలకు మేలు చేయకపోగా ఉన్న రేషన్కార్డులను తొలగించారని పేర్కొన్నారు. కార్మికుల్లో ఉన్న అసంతృప్తిని గుర్తించి సమస్యను తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జివో 1ను అడ్డం పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం నియంతృత్వ పోకడలకు అమలు చేస్తోందన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, జిఓ 1ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు, కార్మిక సంఘాల నోరు నొక్కే ప్రయత్నం చేస్తే ప్రభుత్వాన్ని నొక్కేస్తారని హెచ్చరించారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె సుబ్బరావమ్మ మాట్లాడుతూ అంగన్వాడీలపై నిర్బంధం ప్రయోగించాల్సిన అవసరం ఏముందని, వారు పేదలు కాదా అని ప్రశ్నించారు. తీవ్రమైన నిర్బంధం మోపితే అంగన్వాడీలు భయపడతారని అనుకోవద్దన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే నిరవధిక ఆందోళనకూ సిద్ధమవుతామని హెచ్చరించారు. రాష్ట్ర బడ్జెట్లో అంగన్వాడీలకు కేటాయింపులు చేయలేదన్నారు. వర్కర్ చనిపోతే కనీసం మట్టి ఖర్చులు ఇచ్చే దిక్కు లేదన్నారు. వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ పేరుతో పెద్దరాగం తీస్తున్న ప్రభుత్వం అందుకు తగ్గట్టుగా నిధులు కేటాయించడం లేదని విమర్శించారు. మెనూ ఛార్జీలను పెంచాలని కోరడం నేరమా అని ప్రశ్నించారు. 2017 నుంచి టిఎ బిల్లులు ఇవ్వడం లేదన్నారు. పండుగ రోజుల్లో కూడా జీతాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. యూనియన్ అధ్యక్షులు బేబీరాణి మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం గ్రాట్యూటీ ఇవ్వాలని కోరుతున్నామన్నారు. రిటైర్డ్మెంట్ తరువాత పెన్షన్ ఇవ్వాలని అడుతున్నామని, రూ.7వేలు అందుకుంటున్న వర్కర్లకు సంక్షేమ పథకాలు అమలు చేయడం లేదని అన్నారు. కాంట్రాక్టర్లతో కుమ్మక్కై నాసిరకం సరుకును అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం అణచి వేయాలనుకున్నా తమ పోరాటం విజయవంతమయిందన్నారు. గత ప్రభుత్వంలో పోరాటాలు బాగా చేశారని పొగిడి ఇప్పుడు అరెస్టులు చేస్తారా అని నిలదీశారు. సమస్యల పరిష్కారం కోసం వెంటనే చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. సమాధానం చెప్పకపోతే ఈ నెల 23న ఆందోళనలు కొనసాగిస్తామన్నారు. పెట్టిన కేసులను వెనక్కు తీసుకోవాలని, స్టేషన్లో ఉన్న వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎన్సిహెచ్ సుప్రజ పాల్గొన్నారు.

చంద్రబాబు, లోకేష్ జైలుకు వెళ్లడం ఖాయం

- షెల్ కంపెనీలకు 'స్కిల్' స్కామ్ నిధులు : మంత్రి అమర్నాథ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ, విశాఖ

యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పించే ముసుగులో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూ.371 కోట్ల కుంభకోణానికి పాల్పడ్డారని, ఈ కేసులో చంద్రబాబు, లోకేష్ జైలుకు వెళ్లడం ఖాయమని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ తెలిపారు. ఈ కేసులో ఇప్పటికే 10 మందిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారని చెప్పారు. విశాఖలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. యువతకు నైపుణ్యాభివృద్ధిని కల్పిస్తామని చెప్పి సీమెన్స్ సంస్థతో చంద్రబాబు ఒప్పందం కుదుర్చుకున్నారని తెలిపారు. ఇందుకోసం ఆరు క్లస్టర్లను ఏర్పాటు చేస్తున్నట్లు, ఒక్కో క్లస్టర్కు రూ.560 కోట్ల చొప్పున సుమారు రూ.3,360 కోట్లు ఖర్చు చేయనున్నామని ప్రకటించారని చెప్పారు. ఇందులో 10 శాతం రాష్ట్ర ప్రభుత్వం, 90 శాతం సీమెన్స్ సంస్థ భరిస్తుందని తెలిపారన్నారు. సింగపూర్కు చెందిన స్కిల్లర్, ఇన్ వెబ్ సొల్యూషన్స్ వంటి ఆరు షెల్ కంపెనీలను చూపించి రూ.371.25 కోట్లను ఆయా కంపెనీలకు చంద్రబాబు అండ్కో తరలించారని ఆరోపించారు. ఇందులో స్కిల్లర్ కంపెనీ పేర రూ.185 కోట్లు బదలాయించారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ ఖజానా నుంచి డబ్బులు నేరుగా ఆయా కంపెనీలకు తరలించిన చంద్రబాబు దీనికి సంబంధించిన కీలక పత్రాలను మాయం చేశారని ఆరోపించారు. ఈ లావాదేవీల వ్యవహారం చంద్రబాబు సృష్టించిన ఒక సెల్ కంపెనీ చేసిన మెసేజ్ ద్వారా వెలుగు చూసిందన్నారు.

కర్ణాటకలో 80 స్థానాల్లో ఆప్ పోటీ

మైసూరు : కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో 80 స్థానాల్లో ఆమాద్మీ పార్టీ పోటీ చేయనుంది. ఈ మేరకు తొలి జాబితాను ఆప్ రాష్ట్ర అధ్యక్షులు పృధ్వీరెడ్డి మంగళవారం విడుదల చేశారు. మైసూరు జిల్లాలోని 8 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. చామరాజ నగర్ నుంచి మాళవిక గుబ్బివని, పెరియపట్నం నుంచి రాజశేఖర్ దొడ్డన్న, నరిసింహరాజ నుంచి ధర్మశ్రీ, టి నర్సిపుర్ నుంచి సొసలే సిద్ధరాజ పోటీ చేయనున్నట్లు తెలిపారు.

ఒక్క స్థానం నుంచే పోటీ : కుమారస్వామి

అసెంబ్లీ ఎన్నికల్లో తాను ఒక స్థానం నుంచే పోటీ చేస్తానని, అది కూడా చన్నపట్నం నియోజకవర్గం నుంచి బరిలో ఉంటానని జెడిఎస్ నేత, మాజీ ముఖ్యమంత్రి హెచ్డి కుమారస్వామి మంగళవారం వెల్లడించారు. తనకు రెండు నియోజకవర్గాల నుంచి పోటీ చేసే ఆలోచన లేదన్నారు. ఈ విషయంలో కాంగ్రెస్, బిజెపి ప్రజల్ని తప్పుదోవ పటిస్తున్నాయని ఆరోపించారు.

విఆర్ఓ అనిల్పై కేసు పెట్టడం తగదు

- గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం
- న్యాయం చేయకపోతే పోలీసులకు సహాయ నిరాకరణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గుడివాడ రైల్వేస్టేషన్ వద్ద జరిగిన సంఘటనలో ఎటువంటి విచారణ చేయకుండా విఆర్ఓ అనిల్పై ఏకపక్షంగా కేసు నమోదుచేయడాన్ని గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం ఖండించింది. ఈ మేరకు మంగళవారం విఆర్ఓల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భూపతిరాజు రవీంద్రరాజు, ఎం.అప్పలనాయుడు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఘటనకు సంబంధించి విఆర్ఓ అనిల్ భార్య అంగన్వాడీ వర్కరని, తనను రైల్వేస్టేషన్ దగ్గర దించేందుకు తీసుకెళ్లాడని తెలిపారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుల్ అంగన్వాడీ వాళ్లు ధర్నా చేయడానికి విజయవాడ వెళ్తున్నారంటూ ఆమెను ఆపారని పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న వెంటనే ఆమెను ఇంటికి తీసుకుని వెళ్లేందుకు విఆర్ఓ బైక్ తీసుకుంటుండగా, మహిళా కానిస్టేబుల్ తాళం తీయాలని ప్రయత్నించగా అతను తాళం మీద చేయివేశాడని పేర్కొన్నారు. మహిళా కానిస్టేబుల్, విఆర్ఓ చేయిని కొరకడంతో ఇద్దరి మధ్య వాగ్వివాదం జరిగిందన్నారు. విఆర్ఓ అనిల్ మహిళా కానిస్టేబుల్పై చేయిచేసుకున్నారంటూ మహిళా కానిస్టేబుల్ ఫిర్యాదు చేసిందన్నారు.

వాస్తవాలు తెలుసుకోకుండా ఇలా విఆర్ఓపై కేసు పెట్టడం అన్యాయమని పేర్కొన్నారు. విఆర్ఓ చేయి కొరికిన మహిళా కానిస్టేబుల్పై కూడా విఆర్ఓ ఫిర్యాదు చేస్తే ఆ ఫిర్యాదును పట్టించుకోలేదని భూపతిరాజు రవీంద్రరాజు, అప్పలనాయుడు తెలిపారు. ఈ ఘటనపై కృష్ణా జిల్లా కలెక్టర్, ఎస్పిలు అధికారులతో మాట్లాడి సమన్వయం చేసి ఇద్దరు ఉద్యోగుల మధ్య ఘర్షణ జరిగినప్పుడు పరిష్కరించాల్సిన బాధ్యత ఉన్నతాధికారులపై ఉందన్నారు. సమస్యను పరిష్కరించి న్యాయం చేయకపోతే విఆర్ఓలందరూ పోలీసులకు సహాయక నిరాకరణ చేస్తారని హెచ్చరించారు.

ఉజ్వల భవిష్యత్ను ఇచ్చేదే ఉగాది

- గవర్నర్ అబ్దుల్ నజీర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తెలుగు ప్రజలు ఆనందంగా జరుపుకునే నూతన సంవత్సరం ఉగాది అందరికీ ఉత్తేజం, ఉల్లాసం, ఉజ్వల భవిష్యత్ను తెస్తుందని ఆశిస్తున్నట్లు రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా నివసిస్తున్న తెలుగు ప్రజలందరికీ శోభకృతనామ సంవత్సరం ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు శాంతి, శ్రేయస్సు, సామరస్యం, సంతోషాన్ని కలిగిస్తుందని మనస్ఫూర్తిగా ఆశిస్తున్నట్లు గవర్నర్ పేర్కొన్నారు.

తెలుగు లోగిళ్లలో నూతన సంవత్సర శోభ వెల్లివిరియాలి : సిఎం జగన్

షడ్రుచుల సమ్మేళనంతో ప్రారంభమయ్యే ఉగాది తెలుగు లోగిళ్లలో నూతన సంవత్సర శోభను తెస్తూ కొత్త లక్ష్యాలకు, కొత్త ఆలోచనలకు, ప్రతి ఒక్కరి ఉజ్వల భవిష్యత్కు, తద్వారా రాష్ట్ర సమగ్రాభివృద్ధికి దోహదపడాలని సిఎం వైఎస్ జగన్ మోహన్రెడ్డి ఆకాంక్షించారు. శోభకృత్ నామ సంవత్సర సందర్భంగా తెలుగు ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

తెలుగు రాష్ట్రాలకు ప్రగతి శోభ రావాలి : చంద్రబాబు

తెలుగు రాష్ట్రాలకు ప్రగతి శోభ రావాలని, చీకట్లు తొలగిపోయి అన్నివర్గాల ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే నవోదయం రావాలని టిడిపి అధినేత చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. ప్రకృతిలో కలిగే మార్పుకు సంకేతంగా ఉగాదిని జరుపుకుంటామని, అలాగే జీవితంలో కొత్త ఏడాది శుభప్రదమైన మార్పును తేవాలని ఆకాంక్షిద్దామని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలందరికీ శోభకృత్ నామ సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

తెలుగు కుటుంబాలు శోభాయమానం కావాలి : పవన్కళ్యాణ్

తెలుగు వారికి ప్రీతిపాత్రమైన పండగ ఉగాది అని, వసంతం అడుగుపెడుతూనే ఉగాదిని మోసుకురావడం విశిష్ట దాయకమని జనసేన అధ్యక్షులు పవన్కళ్యాణ్ పేర్కొన్నారు. శోభకృత్ నామ ఉగాది సందర్భంగా రైతులు, కార్మికులు, వ్యాపార, వాణిజ్యవేత్తలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, తెలుగు ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.


దీక్షలో కూర్చున్న స్టీల్ప్లాంట్ సిఐసిసిపి విభాగ కార్మికులు

విశాఖ ఉక్కును రక్షించుకుంటాం

ప్రజాశక్తి-ఉక్కునగరం, విశాఖ

విశాఖ స్టీల్ప్లాంట్ ప్రయివేటీకరణపై కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గేవరకు పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు తెలిపారు. విశాఖ స్టీల్ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలోని స్టీల్ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 768వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో స్టీల్ప్లాంట్ సిఐసిసిపి విభాగ కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ, స్టీల్ప్లాంట్ పరిరక్షణ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తున్నామని, దీనికోసం ప్రత్యేకంగా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ పోరాటాలకు కార్మికులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐసిసిపి విభాగ ఉద్యోగులు మొహిద్దీన్, వరసాల శ్రీనివాసరావు, విల్లా రామ్మోహనరావు, టివికె.రాజు, పి.శ్రీను, రామ్శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఎపిలో ప్రజాస్వామ్యం పాతర

- ఐక్యపోరాటాలే శరణ్యం
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



రాష్ట్రంలో ప్రజాస్వామ్య సూత్రాలను కాలరాస్తూ పోలీసు రాజ్యాన్ని నడుపుతున్న సిఎం వైఎస్ జగన్ ప్రభుత్వ విధానాలపై వామపక్ష, ప్రతిపక్ష పార్టీలు, ప్రజాతంత్ర, లౌకికవాదులు ఉద్యమించాల్సిన అవసరముందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ వ్యాఖ్యానించారు. విజయవాడ దాసరిభవన్లో మంగళవారం సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి ఓబులేసుతో కలిసి విలేకరుల సమావేశంలో రామకృష్ణ మాట్లాడారు. జగన్ ప్రభుత్వ ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలను ప్రతిపక్ష పార్టీలు, ప్రజాతంత్ర, లౌకికవాదులంతా ఖండించాలని, అంతా కలిసికట్టుగా ముందుకు రావాల్సిన అవసరముందని అన్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై సుదీర్ఘ ఐక్య పోరాట కార్యాచరణను ఈ నెల 24, 25 తేదీల్లో విజయవాడలో జరగనున్న సిపిఐ రాష్ట్ర సమితి సమావేశాల్లో చర్చిస్తామని రామకృష్ణ పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు ఆందోళనకు దిగితే పోలీసులతో దౌర్జన్యాలు, బెదిరింపులు, అక్రమ నిర్బంధాలకు జగన్ ప్రభుత్వం పాల్పడుతోందని ధ్వజమెత్తారు. సమస్యల పరిష్కారం కోసం విజయవాడ ధర్నాకు రాష్ట్ర వ్యాప్తంగా తరలివచ్చిన అంగన్వాడీలను పోలీస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లలో నిర్బంధించారన్నారు. అనారోగ్యానికి గురైన అంగన్వాడీలకూ అనుమతి ఇవ్వకుండా వారిపట్ల పోలీసులు దుర్మార్గంగా వ్యవహరించారని అన్నారు. విజయవాడ ధర్నాచౌక్లో వారికి అనుమతిచ్చి ఉంటే, వాళ్లంతా శాంతియుతంగా నిరసన తెలిపేవారని అన్నారు. జిఓ నెంబర్ 1 రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ చలో అసెంబ్లీకి పిలుపునిస్తే అన్ని జిల్లాల్లోని వామపక్ష, ప్రజాసంఘాల నేతలను ఎక్కడికక్కడే అక్రమ అరెస్టులు చేశారని విమర్శించారు. అసెంబ్లీలో టిడిపి ఎమ్మెల్యేలే స్పీకర్పై దాడి చేశారంటూ అసత్యప్రచారం చేయడం తగదన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీల్లో ఒక్కో నియోజకవర్గంలో 4 నుంచి 5 వేలఓట్లు దొంగ ఓట్లను వైసిపి నమోదు చేయించి, అక్రమంగా గెలుపొందిందన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు జగన్ ప్రభుత్వ పతనానికి నాంది అని స్పష్టం చేశారు.

ధర్మపరిరక్షణ కోసం ప్రచారం

- దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రవ్యాప్తంగా సింహాచలం, అన్నవరం, ద్వారకా తిరుమల, విజయవాడ కనకదుర్గమ్మ, శ్రీశైలం, శ్రీకాళహస్తి, కాణిపాకం ఆలయాల ప్రచార రథాల ద్వారా హిందూ ధర్మప్రచార కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. సచివాలయంలో రాష్ట్ర ధార్మిక పరిషత్ కమిటీ మూడవ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి కోసం విజయవాడలో లక్ష్మీ సుదర్శన రాజశ్యామల సుదర్శనసహిత మహాలక్ష్మీ యజ్ఞాన్ని నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు.

అదానీ అక్రమాలపై జెపిసి వేయాల్సిందే

మొదటిపేజీ తరువాయి

పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా' అని ఆయన ప్రశ్నించారు.

కొనసాగిన ప్రతిష్టంభన

అదానీ వివాదంపై జెపిసి దర్యాప్తు జరిపించాలని ప్రతిపక్షాలు, లండన్లో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై క్షమాపణలు చెప్పాలని బిజెపి సభ్యులు పరస్పర ఆందోళనలతో పార్లమెంట్ మంగళవారం కూడా స్థంభించిపోయింది. లోక్సభ ప్రారంభం కాగానే అధికార, ప్రతిపక్ష సభ్యుల ఆందోళనతో మధ్యాహ్నం రెండు గంటల వరకు సభ వాయిదా పడింది. తిరిగి ప్రారంభమైన సభలోనూ ఆందోళన కొనసాగింది. గందరగోళం మధ్యే ఒకే ఒక్క నిమిషంలో మూజువాణి ఓటుతో జమ్మూకాశ్మీర్ బడ్జెట్ను ఆమోదించారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.1.118 లక్షల కోట్లతో ఇందుకు సంబంధించిన బిల్లు ప్రతిపాదించారు. ఆ వెంటనే సభ గురువారానికి వాయిదా పడింది. రాజ్యసభలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. అదానీ-హిండెన్బర్గ్ సమస్యపై చర్చను రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్ఖర్ తిరస్కరించారు. దీంతో సభలో గందరగోళం ఏర్పడింది. ఫలితంగా మధ్యాహ్నం రెండు గంటల వరకు రాజ్యసభ వాయిదా పడింది. తిరిగి ప్రారంభమైన సభలోనూ అదే పరిస్థితి కొనసాగడంతో సభ గురువారానికి వాయిదా పడింది.

అంతర్జాతీయ ఖోఖో పోటీల పర్యవేక్షణ అధికారిగా సీతారామిరెడ్డి



ప్రజాశక్తి- పంగులూరు (బాపట్ల జిల్లా)

అస్సాం రాష్ట్రంలోని గౌహతి పట్టణంలో ఈ నెల 20 నుంచి 24 వరకు జరగనున్న 4వ ఏషియన్ అంతర్జాతీయ ఖోఖో టోర్నమెంటుకు ఆంధ్రప్రదేశ్‌లోని ఉమ్మడి ప్రకాశం జిల్లా జె.పంగులూరు మండలం, పంగులూరు గ్రామంలోని మాగుంట సుబ్బరామిరెడ్డి బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్, రాష్ట్ర ఖోఖో కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి పర్యవేక్షణాధికారిగా నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన రాష్ట్ర ఖోఖో కార్యదర్శిగా, జాతీయస్థాయిలో ఖోఖో ఫెడరేషన్ ఉపాధ్యక్షులుగా, సౌత్ ఇండియా ఖోఖో చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. పది సార్లు రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు, మూడుసార్లు ఆల్ ఇండియా జాతీయస్థాయి సీనియర్, జూనియర్ ఖోఖో పోటీలు నిర్వహించిన అనుభవం ఉంది. పంగులూరులో ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీని స్థాపించి, గత 30 సంవత్సరాల నుంచి 197 రాష్ట్ర, జాతీయ స్థాయి ఖోఖో క్యాంపులు నిర్వహించారు. సుమారు 500 మంది క్రీడాకారులను తయారు చేశారు.

ఆప్కాస్‌కు అధిపతి కావలెను!

- ఇడి పోస్టుకు ప్రభుత్వం వింత ఆహ్వానం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను నియమించుకునేందుకు నేరుగా రాష్ట్ర ప్రభుత్వం చట్టబద్ధంగా ఏర్పాటుచేసిన సంస్థ ఆప్కాస్ (కార్పొరేషన్ ఫర్ అవుట్‌సోర్సింగ్ సర్వీసెస్). దీనికి గతంలో అనేక మంది అధికారులు కూడా కీలక పోస్టుల్లో పనిచేశారు. తాజాగా ఈ సంస్థలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పోస్టును భర్తీ చేసేందుకు ప్రభుత్వం అనుసరిస్తున్న విధానమే ఆశ్చర్యం కలిగిస్తోంది. సాధారణంగా ప్రభుత్వ రంగ సంస్థలో ఖాళీని భర్తీ చేసేందుకు బదిలీపైనో, డిప్యూటేషన్‌పైనో ఉన్నతాధికారులను నియమించడం ఆనవాయితీగా వస్తోంది. దీనికోసం ప్రభుత్వ అధికారిగా పనిచేసిన స్థానంలో వచ్చే జీతాన్నే కొత్త సంస్థలో కూడా చెల్లిస్తారు. ఇతర అలవెన్సుల కింద కొంత మొత్తం అదనంగా లభించే అవకాశం ఉంటుంది. కానీ ఆప్కాస్‌లో ఇడి పోస్టు కోసం అధికారుల నుంచే దరఖాస్తులు ఆహ్వానించడం విడ్డూరంగా ఉంది. ప్రభుత్వ శాఖల్లో పనిచేసే వారిలో ఆసక్తి ఉన్నవారు ఇడి పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని తాజాగా విడుదల చేసిన ఒక సర్క్యులర్‌లో పేర్కొన్నారు. ఈ పోస్టుకు జీతం కూడా రూ.8,0910 - 1,66,680గా నిర్ణయించారు. అంటే మొత్తమ్మీద నెలకు రూ.రెండు లక్షల వరకు ఆ అధికారి చేతికి వస్తుంది. ఇది కొన్ని శాఖల్లో శాఖాధిపతులకు వచ్చే మొత్తం కన్నా కూడా ఎక్కువేనని తెలుస్తోంది. కొన్ని శాఖల్లో ఉన్న డైరెక్టర్ పదవి కన్నా ఎక్కువస్థాయి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని తన సర్క్యులర్‌లో ప్రభుత్వం కోరడం, ఈ నియామకాన్ని కూడా ఫారిన్ సర్వీస్ నిబంధనల మేరకు చేపడతామని చెప్పడం కొసమెరుపు.

ఎదురు కాల్పుల్లో మహిళా మావోయిస్టు మృతి

ప్రజాశక్తి -చింతూరు, అల్లూరి సీతారామరాజు జిల్లా

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా గంగలూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోర్చోలి అటవీ ప్రాంతంలో పోలీసులకు మావోయిస్టులకు మధ్య మంగళవారం ఎదురు కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో ఒక మహిళ మావోయిస్టు మృతి చెందారు. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గంగులూరు అటవీ ప్రాంతంలో ఎస్‌టిఎఫ్‌డిఆర్‌జి పోలీసు బలగాలు కూంబింగ్ నిర్వహించాయి. ఈ క్రమంలో పోలీసులు, మావోయిస్టుల మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో పిఎల్‌జిఎకు చెందిన మహిళా మావోయిస్టు మృతి చెందారు. ఘటనా స్థలంలో భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతి చెందిన మహిళను మావోయిస్టు అగ్ర నేతగా పోలీసులు భావిస్తున్నారు.

వైసిపి ప్రభుత్వంపై చార్జిషీట్ : సోము

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అవినీతి రాజకీయాలకు కేంద్రంగా రాష్ట్రం మారిందని, ఇసుక, మైనింగ్, మద్యం అన్నింటిలోనూ అవినీతేనని, సహజ వనరులను దోచుకుని దాచుకుంటున్నారని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు పేర్కొన్నారు. వైసిపి ప్రభుత్వంపై త్వరలో చార్జిషీట్ వేస్తున్నట్లు చెప్పారు. విజయవాడలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం జరిగిన పదాధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ వైఫల్యాలను, మోడీ అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు. మాధవ్ మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో జనసేన బిజెపికి సహకరించలేదని అన్నారు.

రోడ్డెక్కిన ఆశాలు

సమస్యలు పరిష్కరించాలని డిఎంఅండ్‌హెచ్‌ఓ వద్ద ఆందోళనలు

ప్రజాశక్తి-యంత్రాంగం

కనీస వేతనం చెల్లించాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అందజేయాలని, బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన ఆశా వర్కర్లు ఆందోళన బాటపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం డిఎంఅండ్‌హెచ్ఒ, కలెక్టరేట్ల వద్ద ధర్నాలు, ఆందోళనలు చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమ సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం వైద్యాధికారులకు వినతి పత్రాలు అందజేశారు.

విజయవాడ అలంకార్ సెంటర్ ధర్నాచౌక్ వద్ద ధర్నాలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి పాల్గొని ప్రసంగించారు. ఆశ వర్కర్ల న్యాయమైన సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం దగా చేసిందన్నారు. సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నాకు సిఐటియు రాష్ట్ర నాయకులు సిహెచ్.బాబూరావు, డివి కృష్ణ మద్దతు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోని కలెక్టరేట్ వద్ద ధర్నాలో ఆశాలు భారీగా పాల్గొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు, తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున నినదించారు. అధికారులు స్పందించకపోవడంతో ఆశాలు, సిఐటియు నేతలు కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఆశా కార్యకర్తలంతా అక్కడే బైఠాయించారు. దీంతో జిల్లా అదనపు వైద్యఆరోగ్యశాఖాధికారి భానునాయక్ ధర్నా వద్దకు చేరుకుని ఆశాలతో మాట్లాడారు. వారం రోజుల్లో జాయింట్ యాక్షన్ కమిటీ వేసి అన్ని సమస్యలకు పరిష్కారం చూపుతామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ సదర్భంగా ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షులు కె.పోశమ్మ మాట్లాడుతూ.. హామీలు అమలు చేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి లారెన్స్‌కుమారి స్పృహ కోల్పోయారు. దీంతో యూనియన్ నేతలు చికిత్స నిమిత్తం ఆమెను భీమవరంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తిరుపతి డిఎంహెచ్ఒ కార్యాలయం వద్ద ధర్నాలో సిఐటియు రాష్ట్ర నాయకురాలు ఆర్.లక్ష్మి మాట్లాడారు. అనంతరం డిఎంహెచ్ఒ శ్రీహరికి వినతిపత్రం సమర్పించారు. నంద్యాల సిఐటియు కార్యాలయం నుంచి డిఎంఅండ్‌హెచ్ఒ కార్యాలయం వరకూ ర్యాలీగా వెళ్లి అక్కడ ధర్నా నిర్వహించారు. అనంతరం డిఎంఅండ్‌హెచ్ఒ వెంకటరమణకు వినతిపత్రం అందజేశారు. కర్నూలులో డిఎంఅండ్‌హెచ్ఒ కార్యాలయం వద్ద ధర్నా అనంతరం డిఎంఅండ్‌హెచ్ఒ రామగిడ్డయ్యకు వినతి పత్రం సమర్పించారు. నెల్లూరు నగరంలోని ములుమూడు బస్టాండ్ సెంటర్ నుంచి డిఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన చేపట్టారు. అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం ఐటిడిఎ కార్యాలయం ఎదుట, చింతూరులో డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్ఒ కార్యాలయం వద్ద ఆందోళనలు చేశారు. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో కలెక్టరేట్ల వద్ద, కృష్ణా, విజయనగరం; శ్రీకాకుళం జిల్లాల్లో డిఎంహెచ్ఒ కార్యాలయాల వద్ద ధర్నాలు చేశారు. అనంతరం వైద్యాధికారులకు వినతి పత్రాలు అందజేశారు.



విజయవాడ ధర్నా చౌక్ వద్ద ధర్నాలో మాట్లాడుతున్న ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ధనలక్ష్మి

ప్రజాశక్తి ఎస్‌కోట డిఇ వెంకటరావుకు మాతృవియోగం



ప్రజాశక్తి-మెంటాడ (విజయనగరం జిల్లా)

ప్రజాశక్తి విజయనగరం జిల్లా శృంగవరపుకోట డివిజన్ ఎగ్జిక్యూటివ్ కోడూరు వెంకటరావు తల్లి కోడూరు రామయ్యమ్మ (70) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. నెల రోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె విశాఖలోని కెజిహెచ్‌లో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. స్వగ్రామం విజయనగరం జిల్లా మెంటాడ మండలం ఆగూరులో అంత్యక్రియలు నిర్వహించారు. రామయ్యమ్మ భౌతికకాయాన్ని ప్రజాశక్తి చీఫ్ జనరల్ మేనేజర్ వై.అచ్యుతరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, మఫిషియల్ స్టేట్ ఇన్‌ఛార్జి ఎస్.శ్రీనివాసరావు, శ్రీకాకుళం ఎడిషన్ మేనేజర్ పి.కామినాయుడు, సమన్వయ కమిటీ కన్వీనర్, సభ్యులు, సిబ్బంది నివాళులర్పించారు. వెంకటరావు కుటుంబానికి ప్రజాశక్తి ఎడిటర్ బి.తులసీదాస్ సానుభూతి తెలిపారు.

గిరిజన 'ఉపాధ్యాయులకు' ఎమ్మెల్సీ పర్వతరెడ్డి ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి

- ఎపి గిరిజన సంఘం


ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలల ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీని నిలబెట్టు కోవాలని తూర్పు రాయలసీమ నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపొందిన పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డిని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డి ప్రభాకర్, శ్రీరామ శ్రీనివాసరావు మంగళ వారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల్లో గెలిపిస్తే ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రత, టైం స్కేల్ అమలు చేస్తామని, ఔట్‌సోర్సింగ్ విధానం రద్దు చేస్తామని, ప్రభుత్వ టీచర్లుగా గుర్తింపు కల్పిస్తామని పర్వతరెడ్డి హామీ ఇచ్చారని వారు గుర్తు చేశారు. నిర్దిష్టమైన మేనిఫెస్టోను చంద్రశేఖర్‌రెడ్డి ప్రకటించారని దాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించాలని అన్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై ప్రత్యేక జిఒ తీసుకొచ్చి హామీలను నిలబెట్టుకోవాలని కోరారు.

అదానీ మోసంపై చర్యలు శూన్యం

- ప్రశ్నించే వారిపై సిబిఐ, ఇడి దాడులు : బివి రాఘవులు విమర్శ

ప్రజాశక్తి - కదిరి టౌన్



బిజెపి ప్రభుత్వ నిర్ణయాలతో రోజురోజుకూ ఆర్థికమాద్యం పెరుగుతోందని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బివి.రాఘవులు అన్నారు. సత్యసాయి జిల్లా కదిరి పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రోజురోజుకూ నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు. పార్లమెంట్ సమావేశాల్లో ప్రజా సమస్యలను చర్చించకుండా సభను బిజెపి తప్పుదోవ పట్టిస్తోందని తెలిపారు. దీనికి ప్రధానమంత్రి మోడీ బాధ్యత వహించాలన్నారు. అదానీ కుంభకోణంపై సమగ్ర దర్యాప్తుకు ప్రతిపక్షాలు ఆదేశించమంటున్నా.. ప్రధాని మౌనంగా ఉండడం వెనుక ఆంతర్యం ఏమిటో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ఎల్‌ఐసి, స్టేట్ బ్యాంకులను దివాలా తీయించేలా అదానీ మోసం చేశాడని విమర్శించారు. ప్రజల సొమ్ముకు రక్షణ కల్పించాల్సిన కేంద్రం అదానీ మోసానికి వత్తాసు పలికేలా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. అవినీతి, ప్రజా సమస్యలపై ప్రతిపక్షాలు ప్రశ్నిస్తే వారిని ఇబ్బంది పెట్టందుకు సిబిఐ, ఇడిలను కేంద్రం ఉసిగొల్పుతోందన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఇలా ప్రతిపక్షాలపై దాడులు చేయించడం సరికాదన్నారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే విధంగా వ్యవహరిస్తోందన్నారు. జిఒ నం.1 తీసుకొచ్చి ప్రతిపక్షాల గొంతునొక్కే కుట్ర చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి బడా సుబ్బిరెడ్డి, సిపిఎం కదిరి పట్టణ కార్యదర్శి జిఎల్.నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించండి : చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అంగన్‌వాడీ వర్కర్లతో రాష్ట్రప్రభుత్వం చర్చలు జరిపి వారి సమస్యలు పరిష్కరించాలని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ వర్కర్లకు జీతాల పెంపుపై ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయలేదని మంగళవారం ట్వీట్ చేశారు. హక్కుల కోసం గళమెత్తిన అంగన్‌వాడీలను పోలీసులతో అణచివేసి, అరెస్టులకు పాల్పడటం దారుణమని పేర్కొన్నారు.

జాతీయ వృద్ధి కుదేలు!

- అంతర్జాతీయ పరిణామాలే కారణం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

జాతీయ వృద్ధి రేటు వచ్చే ఏడాది గణనీయంగా క్షీణించనుంది. 2023లో ఏడు శాతంగా భావిస్తున్న ఈ వృద్ధి 2024లో ఏకంగా ఒక శాతం తగ్గిపోనుంది. ద్రవ్యోల్బణం మాత్రం ఊరటనిచ్చేదిగానే అధికారులు భావిస్తున్నారు. తాజాగా వృద్ధి, ఇతర అంశాలపై ప్రముఖ విశ్లేషణ సంస్థ క్రిసిల్ విడుదల చేసిన గణాంకాలు కొంత ఆందోళనకరంగానే ఉన్నట్లు నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా మారుతున్న రాజకీయ పరిస్థితులే దీనికి కారణంగా క్రిసిల్ అభిప్రాయపడింది. ఇటీవలే దేశ వృద్ధి రేటు ఏడు శాతంగా ఉంటుందని పలు ఆర్థిక సంస్థలు అంచనా వేశాయి. ఇది కొంత ఊరట కలిగించేదే అయినప్పటికీ వచ్చే ఏడాది మాత్రం ఆరు శాతానికి వృద్ధి తగ్గిపోతుందని క్రిసిల్ నిపుణులు చెబుతుండడం ఆందోళన కలిగిస్తోంది. దేశం నుంచి ఇతర ప్రాంతాలకు ఎగుమతులు తగ్గడం వల్ల వ్యతిరేక ప్రభావం ఉంటుందన్న భావాన్ని క్రిసిల్ వ్యక్తం చేసింది. ప్రధానంగా రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, అమెరికా వంటి దేశాల్లో ఆర్థిక పరిస్థితి క్షీణించడం కూడా ఇందుకు కారణంగా అభివర్ణిస్తున్నారు. 2023లో 6.8 శాతం ద్రవ్యోల్బణం అంచనా వేయగా, 2024లో ఇది ఐదు శాతానికి తగ్గుతుందని అంచనా వేస్తున్నారు. వినియోగదారులు కొనుగోలు చేసే సరుకుల ధరలు తగ్గడం ద్వారా ఇది సాధ్యమవుతుందని నిపుణులు చెబుతున్నారు.

చికెన్ ధరలు డమాల్

- కేజీ లైవ్ ధర రూ.44, రిటైల్ ధర రూ.90
- నష్టాల బాటలో పౌల్ట్రీ రైతులు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

చికెన్ ధరలు నేలను తాకాయి. కోడి గుడ్డు ధరలూ క్రమంగా పతనమవుతున్నాయి. దీంతో, పౌల్ట్రీ రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. రెండ్రోజులుగా కేజీ చికెన్ లైవ్ ధర రూ.80 నుంచి రూ.44కు పడిపోయింది. రిటైల్ మార్కెట్లో రూ.90 చొప్పున విక్రయాలు జరుగుతున్నాయి. కోడి గుడ్డు పేపరు ధర రూ.4.13 ఉండగా తొమ్మిది పైసలు కమీషన్‌పోను రైతుకు రూ.4.04 మాత్రమే దక్కుతోంది. చికెన్ లైవ్ ధర కనీసం రూ.80, కోడి గుడ్డు ధర రూ.5.50 లేనిదే గిట్టుబాటు కాదని రైతులు వాపోతున్నారు.

'తూర్పు' నుంచే 30 శాతం పెంపకం

ఉమ్మడి జిల్లాలో వ్యవసాయం తరువాత పెద్ద పరిశ్రమగా పౌల్ట్రీ ఉంది. సుమారు 300 పౌల్ట్రీ ఫారాలు ఉన్నాయి. దాదాపు 1.40 కోట్ల కోళ్ల పెంపకం అవుతోంది. రాష్ట్రంలో ఐదు కోట్ల వరకూ కోళ్ల ఉత్పత్తి జరుగుతోంది. దీనిలో 30 శాతం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచే ఉంది. ఈ రంగంలో ప్రత్యక్షంగా 20 వేలమంది, పరోక్షంగా మరో 20 వేల మంది మొత్తం 40 వేల మంది ఉపాధి పొందుతున్నారు. ఈ పరిశ్రమకు లారీ పరిశ్రమ అనుబంధంగా ఉపాధి పొందుతోంది. రైతుల వద్ద కోళ్లను కొనుగోలు చేసిన వారు లారీల్లో ఒడిశా, బీహార్, బెంగాల్ రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుంటాయి. ఈ రాష్ట్రాలకే ఆంధ్ర నుంచి అత్యధికంగా కోళ్లు ఎగమతి అవుతుంటాయి. ప్రస్తుతం ఆయా రాష్ట్రాల్లో పౌల్ట్రీకి ప్రభుత్వాలు ప్రోత్సాహం ఇస్తున్నాయి. ఫలితంగా ఒడిశా, బీహార్, బెంగాల్ రాష్ట్రాల్లో పౌల్ట్రీ ఉత్పత్తి ఘననీయంగా పెరిగింది. ఈ ప్రభావం జిల్లాలోని పౌల్ట్రీ పరిశ్రమపై పడింది. ఇక్కడి నుంచి ఎగుమతులు తగ్గిపోయాయి. ఉత్పత్తికి తగినట్లుగా ఎగుమతులు లేకపోవడంతో ధరల పతనమయ్యాయి. వారం రోజుల వరకూ కేజీ చికెన్ ధర (స్కిన్ లెస్) రూ.220 ఉండేది. ప్రస్తుతం రూ.140 ఉంది.

పెరిగిన పెట్టుబడి ఖర్చులు

కోళ్ల పెంపకానికి మొక్కజొన్న, సోయా దాణాను అధికంగా వాడుతుంటారు. మొక్కజొన్న దాణా టన్నుకు ఏడాదిలో రూ.18 వేల నుంచి రూ.25 వేలు, సోయా రూ.50వేల నుంచి రూ.80 వేలకు పెరిగింది. లేబర్ ఛార్జీ, మెడిసిన్ ఖర్చు, కరెంట్ ఛార్జీలు అదనం. కిలో లైవ్‌కు రూ.80 లేనిదే కనీసం గిట్టుబాటు కాదని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం లైవ్ కిలో రూ.44 మించకపోవటంతో పెట్టుబడి ఖర్చులు కూడా రావట్లేదని వాపోతున్నారు. ఫారంలో పది వేల కోళ్లను పెంచడానికి రూ.15.50 లక్షల వరకూ ఖర్చు పెట్టాల్సి వస్తోందని, ప్రస్తుతం ధర ప్రకారం రూ.4 నుంచి రూ.6 లక్షలు కూడా రాని పరిస్థితి నెలకొందని రైతులు చెప్తున్నారు. పది వేళ్ల కోళ్లను పెంచే ఫారం యజమానికి రూ.5 లక్షలకు పైబడి నష్టం వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలి

పౌల్ట్రీ రైతులకు కోళ్ల పెంపకానికి అవసరమైన దాణా, మొక్కజొన్న, జొన్నలు, సోయా దాణాలను సబ్సిడీపై అందించాలి. విద్యుత్తు బిల్లులో రాయితీ ఇవ్వాలి. బ్యాంకుల నుంచి సబ్సిడీపై రుణాలు ఇస్తేనే తప్ప, పౌల్ట్రీ మనుగడ సాధ్యం కాదు. గతంలో ఇచ్చిన రుణాలకు వడ్డీ మాఫీ చేయాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సానుకూలంగా స్పందిస్తే పౌల్ట్రీ పరిశ్రమతోపాటు అనుబంధ రంగమైన లారీ పరిశ్రమకు ఊరట కలుగుతుంది. లేనిపక్షంలో దీనిపై ఆధారపడిన వేలాది మంది భవిష్యత్తు ప్రశ్నార్థకమే.

- పదాల సుబ్బారెడ్డి, అధ్యక్షులు, అనపర్తి ప్రాంతీయ కోళ్ల రైతుల సమన్వయ సంఘం

భారత ఐటి పరిశ్రమపై విదేశీ బ్యాంక్‌ల ప్రభావం



ముంబయి : విదేశీ బ్యాంక్‌లు ఒక్కొక్కటిగా దివాళా తీయడం లేదా వాటి ఆర్థిక పరిస్థితి తీవ్ర ఒత్తిడిలోకి జారుకోవడంతో ఆ ప్రభావం భారత ఐటి పరిశ్రమపై పడొచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. నాస్కామ్ గణంకాల ప్రకారం.. భారత ఐటి పరిశ్రమకు బ్యాంకింగ్ ఫైనాన్సియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్ (బిఎఫ్ఎస్ఐ) రంగం అతిపెద్ద ఖాతాదారుగా ఉంది. 2022-23లో ఈ విభాగం నుంచే 41 శాతం రెవెన్యూ సమకూరింది. ప్రస్తుత పరిణామాలు ఐటి పరిశ్రమ ఆదాయాన్ని దెబ్బతీయడంతో పాటుగా.. ఆయా కంపెనీలు విదేశీ బ్యాంక్‌ల్లో పెట్టిన పెట్టుబడులు ఐటి పరిశ్రమను ఇప్పుడు ఆందోళన కలిగిస్తున్నాయి. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్), ఇన్ఫోసిస్, విప్రో, హెచ్‌సిఎల్ టెక్నలాజీస్, ఎంఫాసిస్, ఎల్‌టిఐమైండ్‌ట్రీ తదితర భారత ఐటి కంపెనీలు కొన్ని అనిశ్చితిలోని గ్లోబల్ బ్యాంక్‌లకు నిధులను అందించాయి. సిలికాన్ వ్యాలీ బ్యాంక్, క్రెడిట్ సుస్సె, యుబిఎస్‌ల్లో టిసిఎస్ నగదు ఉంది. ఎస్‌విబి ఇప్పటికే దివాళా తీసినట్లు నోటీసులు ఇచ్చింది. దీంతో టిసిఎస్, ఇన్ఫోసిస్ కంపెనీల తమ మార్చి త్రైమాసికం ఫలితాల్లో ప్రొవిజన్స్ చేయాల్సి రావొచ్చని నిపుణులు భావిస్తున్నారు. ఐటి పరిశ్రమ మధ్య, స్వల్ప కాలానికి పెను సవాలేనని పేర్కొంటున్నారు. వచ్చే త్రైమాసికంలో ఐటి కంపెనీలపై మరింత ఒత్తిడి ఉండొచ్చని ఎఐఇఆర్ సిఇఒ పరీక్ జైన్ పేర్కొన్నారు. అమెరికాలో ఇటీవల చోటు చేసుకున్న సిలికాన్ వ్యాలీ బ్యాంక్ (ఎస్‌విబి) సంక్షోభం ప్రపంచ వ్యాప్తంగా దిగ్గజ బ్యాంక్‌లను, ఐటి కంపెనీలను కలవరానికి గురి చేస్తున్న విషయం తెలిసిందే.

20 ఏళ్లలో 31వేల పైలెట్లు అవసరం

న్యూఢిల్లీ: వచ్చే 20 ఏళ్లలో భారత్‌కు 31,000 మంది పైలెట్లు అవసరం అవుతారని అమెరికా విమానయాన తయారీ కంపెనీ బోయింగ్ అంచనా వేసింది. ఎయిర్‌క్రాఫ్టలకు భారీగా ఆర్డర్లు పెరుగుతున్నాయని బోయింగ్ ఇండియా ప్రెసిడెంట్ సలీల్ గుప్తే పేర్కొన్నారు. మంగళవారం ఆయన సిఐఐ కార్యక్రమంలో మాట్లాడుతూ..భారత విమానయాన రంగం వేగంగా పెరుగుతుందన్నారు. 20 ఏళ్లలో ఈ పరిశ్రమకు 26వేల మెకానిక్‌లు అవసరం కావొచ్చన్నారు. గత నెలలో ఎయిరిండియా పలు కంపెనీలకు 470 విమానాలకు ఆర్డర్ ఇచ్చింది.

మాంద్యంలోనూ ప్రీమియం ఫోన్లకు డిమాండ్

సామ్‌సంగ్ హెడ్ వెల్లడి



గుర్గావ్ : ఆర్థిక మాంద్యంలోనూ ప్రీమియం ఫోన్లకు డిమాండ్ పెరుగుతోందని సామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్ మొబైల్ ఎక్స్‌పీరియన్స్ బిజినెస్ హెడ్ టిఎం రోహ్ పేర్కొన్నారు. మందగమనంలోనూ భారత్‌లో ప్రీమియం స్మార్ట్‌ఫోన్ మార్కెట్ వృద్ధి చెందుతుందన్నారు. 5జి స్మార్ట్‌ఫోన్లకు పెరుగుతున్న ఆదరణ వృద్ధికి దారితీస్తుందన్నారు. 2023లో 5జి స్మార్ట్‌ఫోన్ మార్కెట్ 60 శాతానికి పైగా, ప్రీమియం స్మార్ట్‌ఫోన్ మార్కెట్ 30 శాతం పైనా వృద్ధిని చవి చూడనుందని అంచనా వేశారు. దేశంలో 24 గంటల్లోనే ప్రీమియం గెలాక్సీ ఎస్23 సిరీస్ కోసం 1.40 లక్షల బుకింగ్స్ వచ్చాయన్నారు. ఇది గతేడాది గెలాక్సీ ఎస్22 సిరీస్ కొరకు అందిపుచ్చుకున్న ప్రీ బుకింగ్స్ కన్నా రెండింతలు ఎక్కువన్నారు. 2026 నాటికి దేశంలో స్మార్ట్‌ఫోన్ వినియోగదారులు 100 కోట్లకు చేరుకోవచ్చన్నారు.

కియా నుంచి కొత్తతరం వాహనాలు

హైదరాబాద్: కియా ఇండియా కొత్తగా బిఎస్6 ఫేస్2 నిబంధనలతో నూతన వాహనాలను ఆవిష్కరించినట్లు ప్రకటించింది. సెల్టోస్, సోనెట్, కరెన్స్ వాహనాల్లో అదనపు ఫీచర్లతో పాటుగా బిఎస్6 ఫేస్2 సాంకేతికను అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొంది. నూతన ఆర్‌డిఇ అనుకూల వాహనాల ధరలను రూ.7.79 లక్షల నుంచి రూ.10.89 లక్షలుగా నిర్ణయించింది. 2025 నాటికి భారత్‌లో విద్యుత్ వాహనాలకు ప్రధాన కేంద్రంగా మారనుందని.. తాము కూడా ఇవి6 కార్లను తీసుకురానున్నామని కియా ఇండియా ఎండి, సిఇఒ టయి జిన్ పార్క్ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ప్రస్తుతం ఆర్‌డిఇ నిబంధనలతో వాహనాలను అందుబాటులోకి తెస్తున్నామన్నారు.

దుర్వాసనరహిత మార్టిన్ స్మార్ట్ ఆవిష్కరణ

హైదరాబాద్ : నివాసాల్లో ఉపయోగించే కీటకనాశిని ఉత్పత్తుల సంస్థ రెకిట్ తన బ్రాండ్ మార్టిన్‌లో కొత్తగా దుర్వాసనరహిత మార్టిన్ స్మార్ట్‌ను ఆవిష్కరించినట్లు ప్రకటించింది. దోమల వల్ల ఏటా మలేరియా, డెంగీ వంటి వ్యా ధుల కేసుల సంఖ్య పెరుగుతోందని రెకిట్ హైజి న్ దక్షిణాసియా రీజినల్ మార్కెటింగ్ డైరెక్టర్ సౌరభ్ జైన్ తెలిపారు. దోమల నివారణకు మార్టిన్ స్మార్ట్ మెరుగ్గా పని చేస్తుందన్నారు. దీన్ని గురుగావ్‌లోని మార్టిన్ అడ్వాన్స్ డ్ రీసెర్చ్ ల్యాబ్‌లో పరీక్షించామన్నారు. శాస్త్రీయంగా నిరూపించబడిందన్నారు. 2030 నాటికి దేశాన్ని మలేరియారహితంగా చేయాలనే తమ లక్ష్యానికి మరో అడుగు దగ్గర పడిందన్నారు.



టిడ్కో గృహాలను పూర్తి చేయని అసమర్థ ప్రభుత్వం

- యువగళం పాదయాత్రలో లోకేష్

ప్రజాశక్తి - కదిరి టౌన్

గత ప్రభుత్వ హయాంలో పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు చేపట్టిన టిడ్కో గృహాల ను సైతం పూర్తి చేయలేని అసమర్థ ప్రభుత్వం రాష్ట్రంలో ఉందని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ విమర్శించారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర మంగళవారం 49వ రోజుకు చేరుకుంది. కదిరి పట్టణం నుంచి ప్రారంభమైన యాత్ర ఆలీపూర్ తండా, ముత్యాలచెరువు, పుట్టపర్తి నియోజకవర్గం నల్లమడ మండలం మిట్టపల్లి మీదుగా గొనుకువారిపల్లి క్రాస్ విడిది కేంద్రానికి చేరుకుంది. యాత్ర మధ్యలో కదిరిలో టిడ్కో గృహాల పరిశీలన అనంతరం లోకేష్ మాట్లాడుతూ.. టిడిపి హయాంలో 90 శాతం పూర్తయిన ఇళ్లను వైసిపి ప్రభుత్వం పూర్తి చేయలేకపోతోందని విమర్శిం చారు. టిడిపి హయాంలో ఉన్న లబ్ధిదారులను తొలగించి వైసిపి నాయకులు, కార్యకర్తలకు ఇళ్ల కేటాయిస్తున్నారని ఆరోపించారు. అప్పట్లో పేదలు కట్టిన డిడి డబ్బులు కూడా వెనక్కి ఇవ్వకుండా ప్రభుత్వం వేధిస్తోంది అంటే వైసిపి పాలన ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. తక్షణమే టిడ్కో గృహాలను పూర్తి చేసి పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. టిడిపి అధికారంలోకి రాగానే ఇళ్లను లబ్ధిదారులకు అందజేస్తామని హామీ నిచ్చారు.



అసంపూర్తిగా ఉన్న టిడ్కో గృహాల వద్ద సెల్ఫీ తీసుకుంటున్న లోకేష్

లోకేష్‌ను కలిసిన నూతన ఎమ్మెల్సీలు

ఇటీవల పట్టభద్రుల నియోజకవర్గం నుంచి గెలుపొందిన ముగ్గురు ఎమ్మెల్సీలు కదిరిలో లోకేష్‌ను కలిశారు. ఎమ్మెల్సీలు చిరంజీవిరావు, భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, శ్రీకాంత్ కలిసి యాత్రకు సంఘీభావం తెలిపారు. కదిరి మండలం ముత్యాల చెరువు వద్ద విశాఖ ఉత్తర ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు యాత్రలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్, మాజీ ఎమ్మెల్యే అత్తర్ చాంద్‌బాషా, పరిటాల శ్రీరామ్, తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధితో ఒకరు మృతి

ప్రజాశక్తి -కొండూరు (ఎన్‌టిఆర్ జిల్లా)

కిడ్నీ వ్యాధితో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఎన్‌టిఆర్ జిల్లా ఎ.కొండూరులో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎ.కొండూరుకు చెందిన వేల్పుల ఏసు (56) రెండు సంవత్సరాలుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. ఏసుకు క్రియాటిన్ శాతం పెరగడంతో వైద్యుల సలహా మేరకు డయాలసిస్ చేయించుకుంటున్నారు. వ్యాధి తీవ్రమవ్వడంతో విజయవాడలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. మతునికి భార్య, ముగ్గురు సంతానం ఉన్నారు.

ఏసు మతదేహాన్ని సిపిఎం నాయకులు జెట్టి వెంకటేశ్వరరావు, పానెం ఆనందరావు సందర్శించి నివాళులర్పిం చారు. కిడ్నీ వ్యాధితో మృతి చెందిన ప్రతి ఒక్కరికి మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు ఆర్థిక సాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సంపాదకీయం

ఉద్యమ బాట


మహారాష్ట్ర రైతుల లాంగ్‌మార్చ్ అన్నదాతల సంఘటిత శక్తికి ప్రతీకగా నిలిచింది. నాసిక్ నుంచి ముంబయి వరకూ పాదాలు బొబ్బలెక్కి రక్తమోడుతున్నా... లెక్కచేయక కదంతొక్కుతూ.. ఐదు రోజులపాటు 250 కిలోమీటర్ల మేర సాగిన ఈ యాత్ర విజయం సాధించడం అభినందనీయం. ఉల్లి, పత్తి, టమాటా తదితర పంటలకు కనీస మద్దతు ధర, అటవీ హక్కుల పరిరక్షణ తదితర 15 డిమాండ్లపై రైతులు పోరుబాట పట్టారు. వాటన్నింటినీ శాసన సభ సాక్షిగా ఆమోదిస్తున్నట్టు ఆ రాష్ట్ర సిఎం ఏక్‌నాథ్ షిండే ప్రకటించి, ఉత్తర్వులు జారీ చేసేవరకూ సడలని దీక్షతో రైతులు ఉద్యమించారు. రుణమాఫీ, యాజమాన్య హక్కుల కోసం 2018లో నాసిక్ నుంచి నిర్వహించిన లాంగ్ మార్చ్ మళ్లీ గుర్తుకొచ్చింది. అయితే, ఇప్పటికి అంగీకరించి, తరువాత మాటమరిచే ప్రభుత్వాలు ఎక్కువగా ఉన్నాయి కనుక తాజా ఉత్తర్వులు ఆచరణ రూపం దాల్చేంత వరకూ అప్రమత్తత ఎంతో అవసరం.

నేడు 'రైతులను రక్షించండి... దేశాన్ని కాపాడండి...కార్పొరేట్లను తరిమికొట్టండి' అన్న నినాదం మార్మోగుతోంది. కార్పొరేట్లు ముఖ్యంగా అంబానీ, అదానీలకు కొమ్ముకాస్తున్న మోడీ సర్కారు విధానాలు వ్యవసాయ రంగంలో సంక్షోభం తీసుకురావడంతోపాటు అన్నదాతల ఉసురు తీస్తున్నాయి. గత ఎనిమిదేళ్లలో దేశంలో సుమారు లక్ష మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. రెండున్నర లక్షల మంది రోజువారీ కూలీలు బలవన్మరణానికి పాల్పడ్డారు. 2022 లెక్కల ప్రకారం మహారాష్ట్రలో 1023 మంది, ఉత్తర ప్రదేశ్‌లో 887 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. దేశంలో రైతు మరణాల్లో 87 శాతం ఏడు రాష్ట్రాల్లో సంభవిస్తుండగా, వాటిలో ఆంధ్రప్రదేశ్ కూడా ఉంది. అన్నదాతల ఆత్మహత్యలను అరికట్టడం ప్రతి ప్రభుత్వం యొక్క బాధ్యత.

2020-21లో 400 రోజులపాటు దేశ రాజధాని ఢిల్లీలో చారిత్రాత్మక రైతు పోరాటం ఆమోదింపజేసుకున్న డిమాండ్లను అమలు చేసేందుకు కేంద్రప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. 700 మంది బలిదానాల తరువాత ఇచ్చిన హామీలను సైతం విస్మరించింది. రైతు ఉద్యమ స్ఫూర్తితో ఢిల్లీ రామ్‌లీలా మైదానంలో సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) తాజాగా నిర్వహించిన కిసాన్ మహా పంచాయత్‌కు దేశ నలుమూలల నుంచి వేలాదిమంది రైతులు హాజరయ్యారు. పది డిమాండ్లే ఎజెండాగా సభ నిర్వహించి, కేంద్ర మంత్రులకు వినతులను అందజేశారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ఆధారంగా సి2 ప్లస్ 50 శాతం ఫార్ములాకు అనుగుణంగా అన్ని పంటలకు కనీస మద్దతు ధర కల్పన, రైతులపై తీవ్ర ప్రభావం చూపే విద్యుత్ సవరణ బిల్లు-2022ను ఉపసంహరణ వంటి కీలక డిమాండ్లను ఎస్‌కెఎం మరోసారి ఎజెండాలోకి తీసుకొచ్చింది. రైతులపై కార్పొరేట్ దోపిడీ అంతానికి దేశవ్యాప్త పోరాటాలకు ఎస్‌కెఎం ఇచ్చిన పిలుపు విజయవంతమైతేనే సామాన్య ప్రజల ప్రయోజనాలు నెరవేరుతాయి.

ఉద్యమిస్తే సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని తాజా పరిణామాలు మరోసారి నిరూపించాయి. కిసాన్ లాంగ్ మార్చ్ విజయవంతమైన మహారాష్ట్ర లోనే ప్రభుత్వ ఉద్యోగులు ఒపిఎస్ కోసం ఉద్యమించారు. ఒపిఎస్‌తో సమానమైన ప్రయోజనాలు కల్పిస్తామని శివసేన (షిండే) - బిజెపి ప్రభుత్వం ఎట్టకేలకు అంగీకరించింది. ఉత్తర ప్రదేశ్‌లో విద్యుత్ ఉద్యోగులు మొక్కవోని దీక్షతో ఉద్యమించి, బిజెపి సర్కారు మెడలు వంచారు. విద్యుత్ సంస్కరణల వేగానికి తాత్కాలిక బ్రేక్ వేయగలిగారు. ప్రభుత్వాలు ఎస్మాతో సహా నిరంకుశ చట్టాలను ప్రయోగించినా, ఐక్యంగా పోరాడి విజయం సాధించారు. కర్ణాటకలో అంగన్‌వాడీ ఉద్యోగులు నిరవధిక సమ్మె చేసి తమ కోర్కెలు సాధించుకున్నారు. స్థానిక పోరాటాలు అసంఖ్యాకంగా సాగుతున్నాయి. రైతులతోపాటు సమస్త ప్రజలు భాగస్వాములైన ఢిల్లీలో చారిత్రాత్మక రైతు పోరాటాన్ని గుర్తు చేస్తూ... మరోసారి ఉద్యమపథం కొనసాగాలి. అదే సరైన మార్గం.

మహనీయుల మాట



నువ్వు ధైర్యంగా
ఒక అడుగు ముందుకేస్తే
విజయం పది అడుగులు
ముందుకొస్తుంది.

- రవీంద్రనాథ్ టాగూర్,
విశ్వకవి.



ప్రసార చార్జీలు-మోడీ ప్రభుత్వ మాయాజాలం

విశ్లేషణ



ఎం. వేణుగోపాలరావు

విద్యుత్ రంగంలో మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలను రాష్ట్రాలపై రుద్దేందుకు కేంద్ర విద్యుత్ నియంత్రణ కమిషన్ (సిఇఆర్‌సి) ఒక ఉపకరణంగా మారింది. కేంద్రం తీసుకుంటున్న నిర్ణయాలు, ఆదేశాలకు అనుగుణంగా సిఇఆర్‌సి ఉత్తర్వులు, రెగ్యులేషన్లు జారీ చేస్తుంది. వాటిని రాష్ట్రాల విద్యుత్ నియంత్రణ కమిషన్లు అనుసరిస్తున్నాయి. కేంద్ర విద్యుత్ సంస్థలు, అంతర్ రాష్ట్ర విక్రయాలు చేసే విద్యుత్ సంస్థలు సిఇఆర్‌సి నియంత్రణ పరిధిలో ఉండటం ఇందుకు మార్గాన్ని సుగమం చేస్తున్నది. ఒక రాష్ట్రానికి చెందిన డిస్కంలు కేంద్ర విద్యుత్ సంస్థల నుండి, రాష్ట్రం బయట నుండి మార్కెట్లో, విద్యుత్ ఎక్స్ఛేంజ్‌ల ద్వారా, ఇతర రాష్ట్రాల నుండి కొనుగోలు చేసే విద్యుత్‌ను సరఫరా చేసేందుకు కేంద్ర విద్యుత్ ప్రసార సంస్థ పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (పిజిసిఐఎల్) ప్రసార వ్యవస్థను వినియోగించుకోవాలి. ఇందుకు చెల్లించాల్సిన ప్రసార చార్జీలను సిఇఆర్‌సి నిర్ణయిస్తుంది. అంతర్ రాష్ట్ర విద్యుత్ ప్రసారానికి చెల్లించాల్సిన చార్జీలను (ఐఎస్‌టిఎస్) చాలా అన్యాయంగా సిఇఆర్‌సి పెంచుతున్నది.

గతంలో ఉన్న సిఇఆర్‌సి రెగ్యులేషన్ల ప్రకారం ఆంధ్రప్రదేశ్ డిస్కంలు కేంద్ర విద్యుత్ ఉత్పత్తి స్టేషన్ల నుంచి పిజిసిఐఎల్ ప్రసార వ్యవస్థను వాడుకుంటున్న సెంబ్ కార్ప్ వంటి ప్రైవేట్ విద్యుత్ ప్రాజెక్టుల నుండి సరఫరా జరుగుతున్న విద్యుత్‌కు వర్తించే ట్రాన్స్‌మిషన్ చార్జీలకు దీర్ఘకాలిక యాక్సెస్ (ఎల్‌టిఎ) సామర్థ్యం 1750 మెగావాట్లు (మె.వా) ఉండేది. 2022-23 ప్రథమార్థంలో ఈ సామర్థ్యానికి ఎ.పి డిస్కంలు నెలకు దాదాపు రూ. 87 కోట్ల చొప్పున ఐఎస్‌టిఎస్ చార్జీలను చెల్లిస్తూ వచ్చాయి.

పశ్చిమ ప్రాంతంలోని రాయ్‌గఢ్ నుండి దక్షిణ ప్రాంతంలోని పుగులూరు వరకు పిజిసిఐఎల్ కొత్తగా నెలకొల్పిన 800 కెవి హెచ్‌విడిసి లైన్ గత సెప్టెంబరు నుంచి వాణిజ్యపరంగా పని చేస్తున్నది. ఈ కొత్త హెచ్‌విడిసి లైన్ సామర్థ్యం వినియోగంతో నిమిత్తం లేకుండా చార్జీలను ఆ ప్రాంత రాష్ట్రాల డిస్కంలపై మోపుతూ సిఇఆర్‌సి ఇచ్చిన ఉత్తర్వులతో నెలకు రూ.15 కోట్ల అదనపు భారం ఎ.పి డిస్కంలపై పడింది.

గత అక్టోబరు 15 నుండి అమలులోకి వచ్చే విధంగా సిఇఆర్‌సి అంతర్ రాష్ట్ర ప్రసార వ్యవస్థకు కనెక్టివిటీ అండ్ జనరల్ నెట్‌వర్క్ యాక్సిస్ రెగ్యులేషన్లను జారీ చేసింది. దీని ప్రకారం ఐఎస్‌టిఎస్ చార్జీల వర్తింపు ఎల్‌టిఎ నుండి జనరల్ నెట్‌వర్క్ యాక్సెస్ (జిఎన్‌ఎ)కు మారింది. గత మూడేళ్లలో మార్కెట్లో స్వల్పకాలిక కొనుగోళ్లను కూడా చేర్చి పీక్ డిమాండ్ ఆధారంగా ఐఎస్‌టిఎస్ చార్జీలు వర్తించే సామర్థ్యాన్ని సిఇఆర్‌సి తాజా ఉత్తర్వు ప్రకారం లెక్కగడుతున్నారు. అంటే, వినియోగించని ప్రసార సామర్థ్యాన్ని కూడా వినియోగించినట్లుగా పరిగణించి డీమ్డ్ జిఎన్‌ఎ సామర్థ్యాన్ని లెక్కగడుతున్నారు. దీంతో ఎ.పి డిస్కంలకు 1750 మె.వా గా ఉన్న ఎల్‌టిఎ సామర్థ్యం 4516 మె.వా డీమ్డ్ జిఎన్‌ఎ సామర్థ్యంగా పిజిసిఐఎల్ లెక్కగట్టి అధిక చార్జీలను వసూలు చేస్తున్నది. ఎ.పి డిస్కంలు ఈ విధంగా చెల్లించాల్సిన ఐఎస్‌టిఎస్ చార్జీలు నెలకు రూ.130 కోట్లకు పెరిగాయి.



గత మూడేళ్లలో మార్కెట్లో స్వల్పకాలిక కొనుగోళ్లను కూడా చేర్చి పీక్ డిమాండ్ ఆధారంగా ఐఎస్‌టిఎస్ చార్జీలు వర్తించే సామర్థ్యాన్ని సిఇఆర్‌సి తాజా ఉత్తర్వు ప్రకారం లెక్కగడుతున్నారు. అంటే, వినియోగించని ప్రసార సామర్థ్యాన్ని కూడా వినియోగించినట్లుగా పరిగణించి డీమ్డ్ జిఎన్‌ఎ సామర్థ్యాన్ని లెక్కగడుతున్నారు. దీంతో ఎ.పి డిస్కంలకు 1750 మె.వా గా ఉన్న ఎల్‌టిఎ సామర్థ్యం 4516 మె.వా డీమ్డ్ జిఎన్‌ఎ సామర్థ్యాంగా పిజిసిఐఎల్ లెక్కగట్టి అధిక చార్జీలను వసూలు చేస్తున్నది. ఎ.పి డిస్కంలు ఈ విధంగా చెల్లించాల్సిన ఐఎస్‌టిఎస్ చార్జీలు నెలకు రూ.130 కోట్లకు పెరిగాయి.

మూడు ఎ.పి డిస్కంలు 2022-23లో రూ.1288.26 కోట్ల మేరకు ఐఎస్‌టిఎస్ చార్జీలను పిజిసిఐఎల్‌కు చెల్లిస్తుండగా, 2023-24లో ఇవి రూ.1698.54 కోట్లకు పెరగనున్నట్లు అంచనా చూపాయి. ఈ పెరుగుదల 31.84 శాతం. అయితే, జిఎన్‌ఎ రెగ్యులేషన్లు అమలు లోకి రాక ముందు ఎ.పి డిస్కంలు నెలకు చెల్లించిన రూ.87 కోట్లతో పోల్చితే, జిఎన్‌ఎ రెగ్యులేషన్ల కింద నెలకు చెల్లించాల్సిన మొత్తం రూ.130 కోట్లు. పెరుగుదల శాతం 49.42. అంటే, ఇష్టారాజ్యంగా చేస్తున్న మార్పుల వల్ల ఒక్క సంవత్సరంలోనే ఐఎస్‌టిఎస్ చార్జీల భారం ఇంత అధికంగా ఎ.పి డిస్కంలపై పెరిగింది. ఈ అదనపు భారాలు డిస్కంల వినియోగదారులపై చార్జీల రూపంలో పడుతున్నాయి.

వాస్తవానికి ప్రస్తుతమున్న కేంద్ర విద్యుత్ స్టేషన్ల నుండి ఆంధ్రప్రదేశ్‌కు కొత్తగా కేటాయించిన 6.4 మె.వా తప్ప, కొత్తగా ఐఎస్‌టిఎస్ సామర్థ్యం పెరగలేదు. సల్పకాలిక విద్యుత్ కొనుగోళ్లు వాటి స్వభావం రీత్యా తాత్కాలికమైనవి. ఆ మేరకు విద్యుత్ ప్రసారం చేయడానికి పిజిసిఐఎల్ ప్రసార సామర్థ్యాన్ని చేర్చలేదు. అందువల్ల గత మూడేళ్లలో డిస్కంలు చేసిన స్వల్పకాలిక కొనుగోళ్లను బట్టి ఐఎస్‌టిఎస్ చార్జీలు వర్తించే సామర్థ్యాన్ని లెక్కగట్టటం నిర్హేతుకం. ఎల్‌టిఎ విధానానికి విరుద్ధం. పైగా 2023-24 సంవత్సరానికి ఎ.పి డిస్కంలు మార్కెట్ కొనుగోళ్లు చేయాల్సిన అవసరం ఏమీ చూపలేదు. డిస్కంలు మార్కెట్‌లో విద్యుత్ కొనుగోలు చేయాల్సిన పరిస్థితికి కేటాయించిన మేరకు బొగ్గు, సహజ వాయువు వంటి ఇంధనాలను సరఫరా చేయడంలో కేంద్ర ప్రభుత్వ వైఫల్యమే ప్రధాన కారణం. డిస్కంలపై మోపుతున్న ఆర్‌పిపిఓ కొనుగోళ్లు మరో కారణం. అవసరంలేని ట్రాన్స్‌మిషన్ వ్యవస్థ సామర్థ్యాన్ని పెంచి అవసరం లేని రాష్ట్రాల డిస్కంలపై ఐఎస్‌టిఎస్ చార్జీలను మోపటం ప్రశ్నార్థకం. మార్కెట్‌లో డిస్కంలు కొనుగోలు చేసిన మేరకే ఐఎస్‌టిఎస్ చార్జీలను నిర్ణయించటం న్యాయం. అది కూడా, డిస్కంలు కాంట్రాక్టు చేసిన సామర్థ్యాన్ని సంబంధిత స్టేషన్ల నుండి విద్యుత్ ఉత్పత్తి, సరఫరా జరగక వాడుకోకపోతే, ఆ సామర్థ్యానికి చెల్లిస్తున్న చార్జీల నుంచి స్వల్పకాలిక కొనుగోళ్ల సామర్థ్యానికి చార్జీలను సర్దుబాటు చేయాలి. డీమ్డ్ జిఎన్‌ఎ రెగ్యులేషన్ల అన్యాయాన్ని ప్రశ్నిస్తూ దక్షిణాది రాష్ట్రాల డిస్కంల తరపున దాఖలు చేసిన పిటిషన్‌ను సిఇఆర్‌సి నిర్హేతుకంగా తోసిపుచ్చింది.

నియంత్రణ ప్రక్రియ అన్యాయంగా భారాలు మోపే మొక్కుబడి ప్రక్రియగా తయారయ్యింది. పిజిసిఐఎల్ ట్రాన్స్‌మిషన్ వ్యవస్థను దేశవ్యాప్తంగా వినియోగించుకోవచ్చు గనుక, అదనంగా చేర్చిన లైన్‌ను జాతీయ స్థాయిలో చార్జీలు వర్తించే విధంగా పరిగణించాలన్న దక్షిణాది రాష్ట్రాల అభ్యర్థనను కూడా సిఇఆర్‌సి పట్టించుకోలేదు. దానిపై అప్పిలేట్ ట్రిబ్యునల్ (ఎపిటిఇఎల్)లో దాఖలు చేసిన అప్పీల్ పెండింగ్‌లో ఉంది. అవసరంతో నిమిత్తం లేకుండా విచక్షణారహితంగా ట్రాన్స్‌మిషన్ సామర్థ్యాన్ని పిజిసిఐఎల్ పెంచకూడదు. రాష్ట్రాల డిస్కంలు కాంట్రాక్టు చేయని ట్రాన్స్‌మిషన్ సామర్థ్యానికి పిజిసిఐఎల్ చార్జీలను వసూలు చేయరాదు. అవసరంతో పొంతన లేకుండా ప్రసార సామర్థ్యాన్ని అధికంగా చేరిస్తే, అదనపు సామర్థ్యం నిరుపయోగంగా ఉండి, రాష్ట్రాలపై భారాలు పెరుగుతున్నాయని దేశంలో విద్యుత్ నియంత్రణ కమిషన్ల ప్రతినిధులతో ఏర్పాటైన ఫోరమ్ ఫర్ రెగ్యులేటర్స్ (ఎఫ్.ఒ.ఆర్) తన నివేదికలో తప్పుపట్టింది. ట్రాన్స్‌మిషన్ సామర్థ్యం ఏర్పాటు ప్రణాళికాబద్ధంగా ఉండాలని పేర్కొంది. ఎఫ్.ఒ.ఆర్ లో భాగస్వామి అయిన సిఇఆర్‌సి వీటిని పట్టించుకోలేదు. పిజిసిఐఎల్ అనవసర సామర్థ్యాన్ని చేర్చటాన్ని కూడా ప్రశ్నించలేదు. సెప్టెంబర్ 2025 వరకు నెలకొల్పే సౌర విద్యుత్ యూనిట్లకు కేంద్రం ఐఎస్‌టిఎస్ చార్జీల నుండి 25 ఏళ్లపాటు మినహాయింపు ఇచ్చింది. అయితే, ఆ చార్జీలను మోడీ ప్రభుత్వం పిజిసిఐఎల్‌కు చెల్లించటం లేదు. డీమ్డ్ జిఎన్‌ఎ సామర్థ్యం పేరుతో మినహాయింపు చార్జీలను కూడా రాష్ట్రాల డిస్కంలపై సిఇఆర్‌సి మోపింది. అదానీ, టాటా ఇతర పెట్టుబడిదారీ సంస్థలు ఇతర రాష్ట్రాలలో నెలకొల్పుతున్న సౌరవిద్యుత్ ప్రాజెక్టుల నుండి సెకీ, ఎన్‌వివిఎన్‌ఎల్ వంటి కేంద్ర వ్యాపార సంస్థలు ఇతర రాష్ట్రాల డిస్కంలకు సరఫరా చేసే విద్యుత్ ధరలు తక్కువగా ఉన్నట్లు చూపడానికి ఆయా గుత్త పెట్టుబడిదారీ సంస్థల ప్రాజెక్టుల నుండి విద్యుత్ కొనుగోలుకు వీలు కల్పించటానికి మోడీ ప్రభుత్వం ఈ మినహాయింపు ఇచ్చింది.

ఆశ్రిత పెట్టుబడిదారుల సౌర విద్యుత్ ప్రాజెక్టులను అమలు చేయటంలో ఆలస్యం జరుగుతున్న దృష్ట్యా ఐఎస్‌టిఎస్ చార్జీల మినహాయింపుకు వాటిని నెలకొల్పాల్సిన గడువును కూడా మోడీ ప్రభుత్వం పలుమార్లు పొడిగించింది. కానీ, ఆచరణలో ఆ మినహాయింపు మొత్తాన్ని కూడా జిఎన్‌ఎ సామర్థ్యం పేరుతో డిస్కంల వినియోగదారులపైనే మోపుతున్నది. సౌర విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించేందుకే ఈ మినహాయింపు ఇచ్చినట్లయితే, ఒక రాష్ట్రంలో నెలకొల్పి, ఆ రాష్ట్ర డిస్కంలకు వినియోగదారులకు సరఫరా చేసేందుకయ్యే ట్రాన్స్‌మిషన్ చార్జీలకు కూడా మోడీ ప్రభుత్వం మినహాయింపు ఇచ్చి ఉండాలి.

ఆ మినహాయింపు మొత్తాలను సంబంధిత రాష్ట్ర ట్రాన్స్‌మిషన్ సంస్థకు కేంద్రం చెల్లించాలి. కానీ, మోడీ ప్రభుత్వం అలా చేయడం లేదు. సిఇఆర్‌సి కూడా ఆ మినహాయింపు మొత్తాలను పిజిసిఐఎల్ కేంద్ర ప్రభుత్వం నుండి పొందాలని తన ఉత్తర్వులు రెగ్యులేషన్లలో నిర్దేశించకుండా దాటవేస్తున్నది. ఆ విధంగా మినహాయింపు ఇస్తున్నట్లు పైకి ప్రచారం చేసుకొంటూ, ఆచరణలో మినహాయింపు మొత్తాలను కూడా వినియోగదారులపై మోపే టక్కరి వ్యవహారం నడుస్తున్నది. వాస్తవానికి తనంతట తాను అలాంటి మినహాయింపు ఇచ్చే అధికారం సిఇఆర్‌సికి, రాష్ట్రాల ఇఆర్‌సిలకు చట్టప్రకారం లేదు.

ఆర్‌ఇ ఉత్పత్తి స్టేషన్లకు రెన్యువబుల్ హైబ్రిడ్ జనరేటింగ్ స్టేషన్లు (సౌర, పవన విద్యుత్‌ను మిశ్రమ ఉత్పత్తి చేసే స్టేషన్లు), పంప్డ్ జల విద్యుత్ స్టేషన్లు, వాటి విద్యుత్‌ను వినియోగించేందుకు బ్యాటరీ స్టోరేజ్ సిస్టమ్‌లను వినియోగించే స్టేషన్లకు ఐఎస్‌టిఎస్ చార్జీల నుండి మినహాయింపు ఇస్తూ కేంద్రం విధానాల ప్రకారం సిఇఆర్‌సి తాజాగా రెగ్యులేషన్‌ను జారీచేసింది. రెగ్యులేషన్‌లో పేర్కొన్న షరతులకు లోబడి 2025 జూన్ 30 లోగా నెలకొల్పే పైన పేర్కొన్న ప్రాజెక్టులకు 12 నుండి 25 ఏళ్లపాటు ఈ మినహాయింపు వర్తిస్తుందని పేర్కొంది.

ఇక్కడ కూడా ఆ మినహాయింపు చార్జీలను కేంద్రం సంబంధిత ట్రాన్స్‌మిషన్ సంస్థకు చెల్లించాలని పేర్కొనకుండా సిఇఆర్‌సి యథావిధిగా దాటవేసింది. అదానీ, ఇతర పెట్టుబడిదారీ సంస్థలు ఈ విధమైన ప్రాజెక్టులను నెలకొల్పుతున్న నేపథ్యంలో ఈ రెగ్యులేషన్లు జారీ అయ్యాయి. యూనిట్‌కు రూ.90 వరకు అమ్ముకునేందుకు అనుమతించాలని కోరుతూ ఇండియన్ ఎనర్జీ ఎక్స్ఛేంజ్ లిమిటెడ్ దాఖలు చేసిన పిటిషన్‌పై, యూనిట్‌కు రూ.50 వరకు ఎక్స్ఛేంజ్ ద్వారా విద్యుత్‌ను అమ్ముకునేందుకు అనుమతిస్తూ సిఇఆర్‌సి ఫిబ్రవరి 16న ఒక ఉత్తర్వు జారీ చేసింది. ఇంటిగ్రేటెడ్ డే అహెడ్ మార్కెట్ (ఐడిఎఎమ్), రియల్ టైమ్ మార్కెట్ (ఆర్‌టిఎం), టర్మ్ అహెడ్ మార్కెట్ (టిఎఎం), గ్రీన్ టర్మ్ అహెడ్ మార్కెట్ (జిటిఎఎం) వంటి విధానాలతో ఎక్స్ఛేంజ్‌ల ద్వారా విద్యుత్ విక్రయాలకు సిఇఆర్‌సి ఉత్తర్వులు వీలు కల్పించాయి. యూనిట్‌కు రూ.50 వరకు అమ్ముకునేందుకు హై ప్రైస్ డే అహెడ్ మార్కెట్ (ఎచ్‌పి-డిఎఎం) విధానాన్ని ప్రవేశపెట్టేందుకు కూడా సిఇఆర్‌సి తాజా ఉత్తర్వులో ఐఇఎక్స్‌కు అనుమతి ఇచ్చింది. ఇది విధానపరమైన రెగ్యులేటరీ అరాచకత్వానికి పరాకాష్ట. ఈ ఏర్పాటులో ఇమిడి ఉన్న అత్యంత ప్రమాదకరమైన అంశం యూనిట్‌కు రూ.50 వరకు చెల్లించి డిస్కంలు కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడవచ్చు అనేది. అలాంటి పరిస్థితిని మోడీ ప్రభుత్వం సృష్టించనున్నదా? లేక ఏదైనా డొంక తిరుగుడు పద్ధతిలో ఈ అధిక ధర విద్యుత్‌ను డిస్కంలపై రుద్దుతారా? ఆచరణలో ఏం జరుగుతుందనేది చూడాలి..!

(వ్యాసకర్త విద్యుత్ రంగ నిపుణులు,
సెల్ : 9441193749)

జలం... జీవనం...

సందర్భం



కె.వి.వి. సత్యనారాయణ

మా నవ మనుగడకు నీరు ముఖ్యమైన ఆధారం. నీరు లేనిదే మానవ మనుగడే కాదు...భూమిపై జీవరాశుల మనుగడే దుర్లభం. అందుకే నీరు ప్రాణాధారం అని చెప్పుకోవచ్చు. దేశంలో అనేక రాష్ట్రాలు తీవ్రమైన నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నాయి. నీటి కోసం రాష్ట్రాల మధ్య తీవ్ర విభేదాలు ఏర్పడటం కూడా చూస్తున్నాం. భూమిపై లభించే నీటిలో 97 శాతం ఉప్పు నీరే. 3 శాతం మాత్రమే మంచి నీరు. దీనిలో 2 శాతం మంచుగడ్డల రూపంలో వుంటే మిగతా 1 శాతం నీరు మాత్రమే మానవులు, జీవకోటి ఉపయోగించు కోవడానికి అనువుగా వుంది. దీనిలో భారతదేశానికి లభించే నీరు 0.04 శాతం మాత్రమే. ప్రపంచ జనాభాలో 17.4 శాతంగా నున్న మన దేశ జనాభాకు ఈ నీరు చాలా తక్కువనే చెప్పాలి.

అత్యధిక జనాభా పెరుగుదల, పారిశ్రామికీకరణ, పట్టణ నగరాల పెరుగుదల, అడవుల నరికివేత, చిత్తడి నేలల నదుల విధ్వంసం, వాతావరణ మార్పులు, సక్రమ నీటి యాజమాన్యం లేకపోవటం తీవ్ర నీటి ఎద్దడికి ముఖ్య కారణాలు. దీనికి తోడు ఉన్న నీటి వనరుల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణను ప్రభుత్వాలు గాలికి వదిలేస్తున్నాయి. కేవలం లాభాపేక్షతో ప్రజా ప్రయోజనం లేని, విదేశీ శీతల పానీయాల కంపెనీలను దేశానికి రప్పించడంలో కేంద్రంలోని ప్రభుత్వాలు పోటీ పడ్డాయి. ఫలితంగా నీటి వనరుల విచ్చలవిడి వాడకం పెరిగింది. అంతటితో ఆగక నీటి వ్యాపారం ఆరంభమయ్యింది. ఒకప్పుడు సురక్షిత తాగునీటిని స్థానిక సంస్థలు బాధ్యతగా ప్రజలకు అందించేవి. కార్పొరేట్ల వ్యాపారానికి వీలుగా ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు సురక్షిత తాగునీటి సరఫరా నుండి వైదొలగేలా చేశాయి. దీనికి తోడు నీటి వనరులను కలుషితం చేసే, వ్యవసాయానికి, పర్యావరణానికి చేటు చేసే ఆక్వా సాగును మంచి నీటి ప్రాంతాలలో ప్రభుత్వాలు పోటీ పడి ప్రోత్సహిస్తున్నాయి.

భూగర్భ జలాల పెంపుదలకు ప్రయత్నాలు జరుగుతూనే వున్నాయి. అయినప్పటికీ భూగర్భ జలాలను విపరీతంగా వాడడం వలన నానాటికీ భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ రిజర్వాయర్లలో నీరు అడుగంటిపోతున్నాయి. ఈ విపరీతమైన భూగర్భ జలాల వాడకానికి విదేశీ శీతల పానీయాల తయారీ ఫ్యాక్టరీలు ఒక కారణంగా చెప్పొచ్చు. దీనితో స్థానికంగా భూగర్భ జలాలు తగ్గిపోవడం, నీటి ఎద్దడి ఏర్పడడం చూస్తున్నాం. కోటానుకోట్ల ప్రజలకు, లెక్కలేనన్ని పాఠశాలలు, ఆరోగ్య సంరక్షణ కేంద్రాలు, పొలాలు, కర్మాగారాలకు అవసరమైన సురక్షితమైన నీరు లేదు. వారికి అవసరమైన మరుగుదొడ్లు లేవు.

నీటి వనరులు తరగనివి కావు. విచ్చలవిడి వాడకంతో అవి అంతర్థానం అయ్యే ప్రమాదం వుంది. కాబట్టి నీటిని పొదుపుగా వాడి, సంరక్షించుకోవాలి. దీనిని రెండు రకాలుగా కాపాడుకోవచ్చు. మొదటిది నీటి పొదుపు, సంరక్షణ గురించి ప్రజలకు అవగాహన కల్పించటం ద్వారా. రెండవది ఆ రకమైన చర్యలు తీసుకొనేలా ప్రభుత్వాలకు నివేదించటం ద్వారా. అందుకుగాను ప్రజలు ప్రభుత్వాలకు తమ డిమాండ్లను తెలపాలి.



నీటి ప్రాముఖ్యతకు సంబంధించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రతి సంవత్సరం మార్చి 22న "ప్రపంచ జల దినోత్సవాన్ని (వరల్డ్ వాటర్ డే)" అంతర్జాతీయంగా పాటించాలని ఐక్యరాజ్యసమితి 1992లో నిర్దేశించింది. 1993 నుండి ఈ రోజును జరుపుకుంటున్నాం. ప్రతి సంవత్సరం ఐక్యరాజ్యసమితి దీనికి ఒక థీమ్‌ను నిర్దేశిస్తున్నది. మార్పును వేగవంతం చేయాలన్నది ఈ ఏటి థీమ్. నీటి సంరక్షణ, నీటి వనరుల నిర్వహణ విషయంలో మనం చేపట్టాల్సిన విధానాలలో తీసుకు రావాల్సిన మార్పును వేగవంతం చేయాలి. నీరు మనందరినీ ప్రభావితం చేస్తుంది కాబట్టి, ప్రతి ఒక్కరూ ఐక్య కార్యాచరణకు పూనుకోవాలి. మీరు, మీ కుటుంబం, పాఠశాల, సంఘం నీటిని ఉపయోగించే, వినియోగించే, నిర్వహించే విధానాన్ని మార్చడం ద్వారా నీటిని కాపాడుకోవచ్చు. మార్పును వేగవంతం చేయడానికి, మనకు మరింత కార్యాచరణ అవసరం. ఐక్యరాజ్యసమితి ప్రపంచ నీటి అభివృద్ధి నివేదిక, ఐక్యరాజ్యసమితి 2023 వాటర్ కాన్ఫరెన్స్, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పరిస్థితుల నుంచి కార్యాచరణను రూపొందించుకోవాలి.

తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు జన విజ్ఞాన వేదిక ఉభయ తెలుగు రాష్ట్రాలలో ప్రతి సంవత్సరం ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా ప్రజలలో, విద్యా సంస్థలలో అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నది. నీటి వనరులు తరగనివి కావు. విచ్చలవిడి వాడకంతో అవి అంతర్థానం అయ్యే ప్రమాదం వుంది. కాబట్టి నీటిని పొదుపుగా వాడి, సంరక్షించుకోవాలి. దీనిని రెండు రకాలుగా కాపాడుకోవచ్చు. మొదటిది నీటిపొదుపు, సంరక్షణ గురించి ప్రజలకు అవగాహన కల్పించటం ద్వారా. రెండవది ఆ రకమైన చర్యలు తీసుకొనేలా ప్రభుత్వాలకు నివేదించటం ద్వారా. అందుకుగాను ప్రజలు ప్రభుత్వాలకు తమ డిమాండ్లను తెలపాలి.

తీసుకోవాల్సిన చర్యలు

మురుగునీటిని శుద్ధి చేసి తిరిగి వాడుకోవడం. సముద్ర నీటిని డిసాలినేషన్ చేసి వాడుకోవటం. రిజర్వాయర్లలో పూడికలు తొలగించటం. అడవులు, నదులను సంరక్షించడం. కట్టడాలకు నది ఇసుకను నియంత్రించి రాతి ఇసుకను వాడటం. ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయడం. సెప్టిక్ ట్యాంకుల వ్యర్థాల శుద్ధి ప్లాంట్లను ఏర్పాటు చేయటం. మంచినీటి చేపల చెరువులను నిషేధించటం. చిరుధాన్యాల, మెట్ట పంటలను ప్రోత్సహించటం. వరి - చెరకు - అరటి - జనుము తదితర పంటలకు నీటి వాడకాన్ని తగ్గించే పద్ధతులను సత్వరమే పరిశోధించి అమలు పరచటం. నీటిని అత్యంత పొదుపుగా వాడటం. ఇళ్లు - ఆఫీసు ఆవరణాలలో పూల మొక్కలు, పచ్చిక పరిమితంగా పెంచటం. సముద్రతీర ప్రాంతమంతా వ్యాపించిన నీటితో సమృద్ధిగా వుండే ఇసుక, ఇసుక - మట్టితో కూడిన భూములను రక్షించటం. కొల్లేరు, ఇతర సరస్సులు, చిత్తడి నేలలను రక్షించటం. జనాభా పెరుగుదలను నియంత్రించటం. భవనాలు కొన్ని తరాల పాటు మన్నేట్లు నిర్మాణ నాణ్యతను పెంచటం. గ్రామాల అభివృద్ధిని ప్రోత్సహించటం వంటి చర్యలను ప్రభుత్వాలు చేపట్టాలి. అంతేగాక విద్యార్థులకు విద్యాసంస్థల దగ్గర, ప్రజలకు నీటి వనరుల దగ్గర అవగాహనా కార్యక్రమాలను రూపొందించాలి.

(వ్యాసకర్త రాష్ట్ర పర్యావరణ కమిటీ కన్వీనర్, జెవివి.
సెల్ : 8500004953)
(నేడు ప్రపంచ జల దినోత్సవం)

కవిత్వం

హలో నేస్తమా...

హలో నేస్తమా కుశలమా
అంతా పాత సీసాలో
కొత్త జ్ఞాపకం ఈ ఉగాది
తెలుగు ఉగాది అంటూనే
తెలుగుకు తెగులు
పట్టిస్తున్నారు
అమ్మా నాన్నను
మరిపించే మమ్మీ డాడీ
స్కూల్
సంస్కృతికి దాసోహం
తెలుగు కు విలువేది వెలుగు
కు చోటేది
ఏడాదికో మారు
కొత్త సంవత్సరం వస్తూనే
ఉంటుంది
ఎక్కడ చూసినా ఏమున్నది
గర్వకారణం పెరిగిన ధరలు
తరిగిన బతుకులు
రాజకీయం చూస్తే రచ్చ రచ్చ
శుభ కృత్ కు స్వాగతం
ఎలా చెప్పను ఏమని చెప్పను

- ఎల్. ప్రఫుల్లచంద్ర,
సెల్ : 6300546700

శుభకృతునకు స్వాగతం

మా కలలకు ఆకృతి నీయ,
మా వెతలకు పరిష్కృతి చూప,
మా ఆశల సఫలీకృతము
సేయ
మా భవితకు శోభాలంకృతిగా
సాక్షాత్కరించిన బహుమతిగా
అరుదెంచిన శుభకృతునకు
మనస్ఫూర్వక నమస్కృతులివే
మంగళకర జయధ్వానాలివే.
శుభకృతు వత్సరమంతా
వసంత ఋతువై సాగాలి
ప్రకృతి మాత కటాక్షంతో
సంక్షేమం విరబూయాలి
జనులంతా ఏకీకృతమై
మమతా శిఖరంగా ఎదగాలి
మానవతకు అనుకృతిగా
మన సంస్కృతి పరిమళించాలి
ఘన చరితను రచించాలి.

- డా.డి.వి.జి. శంకరరావు,
మాజీ ఎంపీ, పార్వతీపురం.

మీ రచనలను
పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com

అసెంబ్లీ ప్రతిష్టను దిగజార్చారు

- జిఒ నం.1 రద్దు చేయాల్సిందే..
- అంగన్‌వాడీలపై నిర్బంధం తగదు : వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - ఒంగోలు బ్యూరో



అసెంబ్లీలో సోమవారం నాడు జరిగిన సంఘటనలు.. దాని ప్రతిష్టను దిగజార్చాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు వ్యాఖ్యానించారు. ఒంగోలులోని సుందరయ్య భవన్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రతిపక్ష ఎమ్మెల్యే బాలవీరాంజనేయ స్వామిపై వైసిపి ఎమ్మెల్యేలు దాడి చేశారని, కొన్ని సందర్భాల్లో ప్రతిపక్షం తొందరపడినా అధికారపక్షం సంయమనంతో ఉండాలని సూచిం చారు. జిఒ నం.1 రద్దు చేయాలనే అంశంపై చర్చకు నోటీసు ఇవ్వగా.. చర్చకు అంగీకరించకపోవడం సరికాదన్నారు. అన్ని ప్రతిపక్ష పార్టీలు కూడా దీనిపై ఆందోళనకు మద్దతునివ్వగా ప్రభుత్వం ఎక్కడికక్కడ తీవ్ర నిర్బంధం ప్రయోగించిందన్నారు. వాయిదా తీర్మానంపై చర్చకు అవకాశం ఇవ్వాలా? లేదా? అన్నది స్పీకర్ పరిధిలో ఉందని తెలిపారు. స్పీకర్‌ను కాపాడాలని వెళ్లామని దాడిచేసిన వైసిపి ఎమ్మెల్యేలు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కాపాడాలని ఆయన కోరారా? అని ప్రశ్నించారు. అధికారపక్షం ఎమ్మెల్యేలు వచ్చి కొడితే అది బలప్రయోగమే అవుతుంది తప్ప సభ సాంప్రదాయాలకు దోహదపడదన్నారు. దీని వల్ల జిఒ నం.1 రద్దు చర్చ పక్కదారి పట్టిందని పేర్కొన్నారు. అంగన్‌వాడీల పైనా తీవ్ర నిర్బంధం తగదని హెచ్చరిం చారు. అసెంబ్లీ సందర్భంగా ధర్నాలు చేయడం సహజమని, విజయవాడలో ధర్నాచౌక్ మూసేశారని, ఇంతకన్నా అప్రజాస్వామ్యం ఇంకొకటి లేదని విమర్శించారు. ముఖ్య మంత్రి జగన్ తన ఎన్నికల ప్రచారంలో అంగన్‌వాడీ ఉద్యోగులకు తెలంగాణలో కంటే వెయ్యి రూపాయలు ఎక్కువ ఇస్తానని వాగ్దానం చేశావని, నాలుగేళ్లయినా వేతనం ఇప్పటికీ రెండువేలు తక్కువగా వుందని శ్రీనివాసరావు చెప్పారు. సిఎం ఇచ్చిన హామీ అమలు చేయాలనే అంగన్‌వాడీల ప్రధాన డిమాండ్ అన్నారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయద్దని పోరాటాలు చేస్తుంటే పట్టించుకునే పరిస్థితి లేదని చెప్పారు. వైవీసుబ్బారెడ్డి, విజయసాయిరెడ్డి ఢిల్లీకి డెలిగేషన్‌ను తీసుకుపోతామని చెప్పి దాటేశారన్నారు. ఇప్పుడు కుదరదని చెబుతున్నారని, ప్రైవేటీకరణను ఆపలేమంటూ దాటవేస్తున్నారని అన్నారు. కేంద్రం మొండిగా పోతుంటే ఎంపిలు ఏం చేస్తున్నారని ప్రశ్నిం చారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రభుత్వ వ్యతిరేకత బట్టబ యలైందన్నారు. టీచర్ల ఎమ్మెల్సీ విషయంలో వైసిపిని ఓడించాలనే వైఖరి టిడిపి తీసుకోలేదన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వేరే అభ్యర్థికి టిడిపి మద్దతు ఇవ్వడంతో వైసిపి గెలిచిందన్నారు. సమావేశంలో సిపిఎం రాష్ట్రకమిటీ సభ్యులు పూనాటి ఆంజనేయులు, జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ పాల్గొన్నారు.

పది గంటలకు పైగా..

- కవితను విచారించిన ఇడి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ మద్యం విధానానికి సంబంధించిన కేసులో బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను దాదాపు పది గంటలకు పైగా ఇడి అధికారులు విచారించారు. మంగళవారం ఉదయం తుగ్లక్ రోడ్డులోని సిఎం కెసిఆర్ నివాసం నుంచి కవిత బయలుదేరుతూ పది ఫోన్లను, వాటికి సంబంధించిన ఐఎంఈఐ నెంబర్లను మీడియాకు చూపించారు. అక్కడి నుంచి కవిత ఇడి కార్యాలయానికి చేరుకున్నారు. కార్యాలయంలోని మూడో అంతస్తులో ఆమెను ఐదుగురు ఇడి అధికారులు బందం విచారించింది. కవిత విచారణ నేపథ్యంలో ఇడి కార్యాలయం పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ విధించారు. పోలీస్ బలగాలు మోహరించాయి. ఉదయం 11.30 గంటల నుంచి రాత్రి 9.30 గంటల వరకు విచారణ సాగింది. కవితపై సోమవారం 20 ప్రశ్నలు సంధించగా.. మంగళవారం 15 ప్రశ్నలు అడిగినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఇడి అధికారుల ఆదేశాల మేరకు కవిత పది ఫోన్లను సమర్పించారు. మంగళవారం మొత్తం ఈ సెల్ ఫోన్ల గురించే విచారణ జరిగినట్లు సమాచారం. సెప్టెంబర్ 2021 నుంచి ఆగస్టు 2022 వరకు కవిత 10 ఫోన్లు వాడినట్లు, ధ్వంసం కూడా చేసినట్లు ఇడి ఇంతకు ముందు పేర్కొంది. దీంతో కవిత 10 ఫోన్లను అధికారులుకు ఇచ్చేశారు. రాత్రి 8 గంటల సమయంలో ఎమ్మెల్సీ కవిత విజ్ఞప్తితో బిఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి సోమా భరత్‌ను ఇడి కార్యాలయానికి అధికారాలు పిలిపించారు. ఆయన ఆథరైజేషన్ కోసం సంతకాలు తీసుకున్నారు. అనంతరం ఈడి కార్యాలయం నుంచి బయటకు వచ్చిన కవిత అందరికీ అభివాదం చేస్తూ నేరుగా సిఎం కెసిఆర్ నివాసానికి వెళ్లారు.



విచారణకు వెళ్తూ సెల్‌ఫోన్లు చూపుతున్న కవిత

స్వార్థపూరిత రాజకీయ ప్రయోజనాలకు ఇడి పావుగా మారడం దురదష్టకరమని బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఈ మేరకు ఇడి అసిస్టెంట్ డైరెక్టర్ జోగేంద్రకు కవిత లేఖ రాశారు. ఓ మహిళ ఫోను స్వాధీనం చేసుకోవడం గోప్యత హక్కుకు భంగం కలిగించినట్లు కాదా?. 2022 నవంబరులో పలువురు నిందితుల విచారణలో ఫోన్లు ధ్వంసం అయ్యాయని స్టేట్‌మెంట్ ఇచ్చారని, దీన్ని నాకు కూడా ఆపాదిస్తూ చేసిన అసంబద్ధ ఆరోపణలు చేశారని మండి పడ్డారు.


సలహాదారుల నియామకంపై విధాన రూపకల్పన

- హైకోర్టుకు తెలిపిన రాష్ట్ర ప్రభుత్వం

ప్రజాశక్తి-అమరావతి

సలహాదారుల నియామక అంశంపై విధానాన్ని రూపొందిస్తామని హైకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. మంత్రుల సలహాల మేరకే నియామకాలు ఉంటాయని, మంత్రి సిఫార్సు చేశాక సిఎం ఆమోదం విధిగా పొందేలా చేస్తామని తెలిపింది. సలహారుడు కావాలని మంత్రి భావిస్తే, రాతపూర్వకంగా సిఎంకు పంపాలని తెలిపింది. రెండేళ్ల కాలపరిమితికే నియామకం ఉంటుందని చెప్పింది. మరో రెండేళ్లు పొడిగించవచ్చునని తెలిపింది. మంత్రివర్గ ఆమోదంతోనే ఇది జరుగుతుందని వివరించింది. దేవాదాయ శాఖ సలహాదారుగా జ్వాలాపురపు శ్రీకాంత్, ఉద్యోగ వ్యవహారాల సలహాదారుగా చంద్రశేఖర్‌రెడ్డిల నియామకాలను సవాల్ చేసి పిల్స్‌ను చీఫ్ జస్టిస్ పికె మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం విచారిస్తోంది. ఈకేసులో ప్రభుత్వ విధానాన్ని వివరిస్తూ జిఎడి ముఖ్య కార్యదర్శి రేవు ముత్యాలరాజు అదనపు అఫిడవిట్ దాఖలు చేశారు.

సలహాదారు పదవిని, అవినీతి నిరోధక చట్టం కింద సలహాదారు పబ్లిక్ సర్వెంట్ నిర్వచనంలోకి రాబోరని వివరించారు. మంత్రులు తీసుకునే విధానపరమైన నిర్ణయాల వరకే సలహాదారు పాత్ర పరిమితమని చెప్పారు. నిర్ణయాల్లో జోక్యం చేసుకునే అధికారం వారికి లేదన్నారు. ఈ వ్యాజ్యాలను హైకోర్టు విచారణ చేయనుంది.



విచారణకు డిఆర్‌ఎం, మునిసిపల్ కమిషనర్ హాజరు

ప్రజాశకి-అమరావతి

విజయవాడ, మధురానగర్‌లోని అప్రోచ్‌రోడ్డు, రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ పనుల జాప్యంపై దాఖలైన కేసులో దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్, విజయవాడ డివిజినల్ రైల్వే మేనేజర్ (డిఆర్‌ఎం) షివేంద్ర మోహన్ మంగళవారం హైకోర్టుకు హాజరయ్యారు. విజయవాడ మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ కూడా కోర్టు ముందు హాజరయ్యారు. ప్రజల ఇబ్బందులను తొలగించేందుకు వీలైనంత త్వరగా నిర్మాణ పనులను పూర్తి చేస్తామని అధికారులు చెప్పారు. పనుల పురోగతిపై నివేదిక ఇవ్వాలని న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ ఆదేశించారు. విచారణను ఏప్రిల్ 4కి వాయిదా వేశారు.

నిరుద్యోగులను దగా చేసిన చంద్రబాబు

మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

స్కిల్ డెవలప్‌మెంట్ స్కాం నుంచి ప్రజల దృష్టి మళ్ళించేందుకే చంద్రబాబునాయుడు తన ఎమ్మెల్యేలతో స్పీకర్‌పై దాడికి కుట్ర పన్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగు నాగార్జున మండిపడ్డారు. గుంటూరులో ఎమ్మెల్సీ అప్పిరెడ్డి కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. టిడిపి వారి దాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన తమ వైసిపికి చెందిన దళిత ఎమ్మెల్యేలపై కూడా దాడి చేయించారని ఆయన ధ్వజమెత్తారు. నైపుణ్య శిక్షణ పేరుతో నిరుద్యోగులను నిలువునా దగాచేసిన నయవంచకుడు చంద్రబాబును తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలోనే మొదలైన విచారణ పూర్వాపరాలను ఏవిధంగా పరిశీలించినా ఈ స్కిల్ స్కాం సూత్రదారి చంద్రబాబు అన్న సంగతి అందరికీ ఇట్టే అర్ధమౌతుందని తెలిపారు.

జి-20 సదస్సుకు పక్కా ఏర్పాట్లు

విశాఖ జిల్లా కలెక్టర్ మల్లికార్జున

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ

విశాఖ వేదికగా ఈ నెల 28, 29, 30 తేదీలలో నిర్వహించనున్న జి-20 సదస్సుకు అవసరమైన ఏర్పాట్లు పక్కాగా చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అధికారులను ఆదేశించారు. సదస్సుకు వచ్చే అతిథులకు కూడా ఏర్పాట్లు పక్కాగా ఉండాలన్నారు. విఎంఆర్‌డిఎ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వివిధ దేశాలకు చెందిన అతిథులు రాక సందర్భంగా విమానాశ్రయంలో స్వాగతం పలికేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. రోజు వారి కార్యక్రమాలు, వారి పర్యటనకు సంబంధించి ఆయా ప్రాంతాల్లో అవసరమైన ఏర్పాట్లకు తగు చర్యలు చేపట్టాలన్నారు. వారు బస చేసే హోటల్ వద్ద 24/7 హెల్ప్‌డెస్క్ ఏర్పాటుచేయాలని, ఈ హెల్ప్ డెస్క్‌లో రెవెన్యూ, జివిఎంసి, మెడికల్, పర్యాటక శాఖలకు సంబంధించి సిబ్బంది 3 షిఫ్టులుగా పనిచేసేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. విమానాశ్రయంలోనూ హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసేలా తగు చర్యలు చేపట్టాలన్నారు. జివిఎంసిలో కంట్రోల్ రూం నిరంతరం పనిచేయాలన్నారు. నగర సుందరీకరణ పనులుపై జివిఎంసి కమిషనర్‌ను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక స్పెషల్ శానిటైజేషన్ డ్రైవ్ నిర్వహించాలని కమిషనర్‌కు సూచించారు.

900 ఎకరాలతో ఆర్-5 జోన్

గెజిట్ విడుదల చేసిన ప్రభుత్వం

గ్రామసభలు, అభ్యంతరాలు తీసుకున్నామన్న సిఆర్‌డిఎ • జిప్లస్-1, 3 పద్ధతిలో నిర్మాణాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని పరిధిలో పేదల ఇళ్ల కోసం మందడం, ఐనవోలు, కృష్ణాయపాలెం, కురగల్లు, నిడమర్రు గ్రామాల పరిధిలో 900.97 ఎకరాల్లో కొత్తగా ఆర్-5 జోన్ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం తరపున సిఆర్‌డిఎ కమిషనర్ గెజిట్ (రాజపత్రం) విడుదల చేశారు. ఆయా గ్రామాల పరిధిలో ఉన్న యు1 (రిజర్వు), సి4 (రీజనల్ సెంటర్), 13 నాన్‌పొల్యూటింగ్ ఇండ్రస్ట్రీ, సి4 (టౌన్‌సెంటర్), ఎస్2 (ఎడ్యుకేషన్), సి3 (నైబర్‌హుడ్ సెంటర్)జోన్లలో కొన్ని ప్రాంతాలను కలిపి కొత్తగా ఆర్-5 జోన్ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. దీనిలో జిప్లస్-1, జిప్లస్-3 పద్ధతిలో నిర్మాణాలు చేపట్టనున్నట్లు తెలిపారు. పేదలకు అవసరమైన ఇళ్ల నిర్మాణం కోసం 2016 ఫిబ్రవరి 23వ తేదీన ఇచ్చిన మాస్టర్‌ప్లానులో మార్పులు చేర్పులు చేశామని, 2014 ఎపిసిఆర్‌డిఎ చట్టంలోని సెక్షన్ 41 ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. 2022 అక్టోబరు 28న సిఆర్‌డిఎ పరిధిలో భూ వినియోగానికి సంబంధించి ప్రభుత్వం చేసిన మార్పులు, చేర్పులపై జారీచేసిన గెజిల్ 1410కు సంబంధించి బహిరంగ ప్రకటన కూడా పేపర్లో ఇచ్చామని తెలిపారు. సిఆర్‌డిఎ చట్టం సెక్షన్ 41(3) ప్రకారం వాటిపై అభ్యంతరాలుంటే చెప్పాలని కోరామని స్పష్టం చేశారు. 5,844 అభ్యంతరాలు, సూచనలు వచ్చాయని, వారందరినీ వ్యక్తిగతంగా వచ్చి అభిప్రాయాలు చెప్పాలని కోరామని, అయితే ఎవరూ హాజరు కాలేదని గెజిట్లో పొందుపరిచారు. సిఆర్‌డిఎ కూడా 2022 నవంబర్ 14, 23 తేదీల్లో రాతపూర్వక ఫిర్యాదుల కోసం బహిరంగ విచారణ చేపట్టిందని వివరించారు. దీనిపై హైకోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం మందడం, లింగాయపాలెం, రాయపూడి, ఉద్దండ్రాయునిపాలెం, నేలపాడు, తుళ్లూరు, దొండపాడు, అబ్బురాజుపాలెం, ఐనవోలు, వెంకటపాలెం, మల్కాపురం, వెలగపూడి, కురగల్లు, శాఖమూరు, అనంతవరం, బోరుపాలెం, నెక్కల్లు, నీరుకొండ పంచాయతీల పరిధిలో గ్రామసభలు నిర్వహించినట్లు తెలిపారు. వాటిల్లో వచ్చిన అభ్యంతరాలను, సూచనలను ఎపిసిఆర్‌డిఎ ఎగ్జిక్యూటివ్ కమిటీ పరిశీలించి 2023 మార్చి 17వ తేదీన సిఆర్‌డిఎలోని సెక్షన్ 41(4) అధారంగా మార్పులకు ఆమోదం తెలిపిందని వివరించారు. దీని ప్రకారం 2014 సిఆర్‌డిఎ మాస్టర్‌ప్లానులో మార్పులు చేర్పులు చేశామని స్పష్టం చేశారు. నూతన గెజిట్ ప్రకారం 2014 సిఆర్‌డిఎ చట్టంలో గతంలో పొందుపరిచిన జోనల్ మాస్టర్‌ప్లానులో మార్పులు చేసి 41(4), 17(2) ప్రకారం 900.97 ఎకరాల పరిధిలో అటాచ్డ్, సెమీ డిటాచ్డ్, డిటాచ్డ్, అపార్టుమెంట్లు, గ్రూప్ డెవలప్‌మెంట్ నిర్మాణాలు చేపట్టినట్లు వివరించారు. సర్వీసు అపార్టుమెంటు, పారిశ్రామిక అవసరాలు, ప్రింటింగ్ ప్రెస్‌లు, హైపర్‌మార్కెట్, షాపింగ్ మాల్స్ నిర్మాణాలకు ప్లాను ప్రకారం అవకాశం లేదని పొందుపరిచారు. అనుమతితో ఎటిఎంలు, చిన్న కార్యాలయాలు, పౌర సదుపాయాలు, మతపరమైన నిర్మాణాలు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

దుబాయ్‌లో పెన్నాడ వాసి మృతి

కుటుంబ సభ్యులతో వీడియో కాల్ మాట్లాడుతూ ఉరివేసుకుని ఆత్మహత్య

ప్రజాశక్తి - పాలకోడేరు(తూర్పుగోదావరి)

జీవనోపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లిన ఓ వ్యక్తి అక్కడ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులకు వీడియో కాల్ చేసి మాట్లాడుతుండగానే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా సఖినేటిపల్లి ప్రాంతానికి చెందిన గెద్దాడ జగదీష్ (27)కు పాలకోడేరు మండలం పెన్నాడ అగ్రహారం కొత్తపేటకు చెందిన గేద్దాడ మానసతో ఎనిమిదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఐదేళ్ల జాను, మూడేళ్ల అనూష కుమార్తెలు. అయితే కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగోకపోవడంతో 13 నెలల క్రితం జీవనోపాధి నిమిత్తం జగదీష్ దుబాయ్ వెళ్లాడు. అప్పటి నుంచి పిల్లలతో జగదీష్ భార్య పుట్టిల్లు అయిన పెన్నాడలో ఉంటోంది. అయితే సోమవారం రాత్రి నుంచి ఇద్దరు పిల్లలతో మానస కనిపించట్లేదని మానస కుటుంబ సభ్యులు మంగళవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా జగదీష్ దుబాయ్ నుంచి కుటుంబ సభ్యులకు వీడియో కాల్ చేసి భార్యను పిల్లలను చూపించాలని కోరాడు. అయితే వారు కనిపించకపోవడంతో మనస్తాపానికి గురైన జగదీష్ మాట్లాడుతుండగానే తనకు అన్యాయం జరిగిందని, మోసం చేశారని కన్నీరుపెట్టుకుంటూ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో జగదీష్ కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

క్వార్టర్స్‌లోకి నీతూ, మనీషా



న్యూఢిల్లీ: మహిళల ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్ల హవా కొనసాగుతోంది. 45-48 కేజీల విభాగంలో నీతూ ఘంగాస్ క్వార్టర్స్‌లోకి ప్రవేశించింది. ప్రి క్వార్టర్స్‌లో నీతూ కేవలం 128 సెకన్లలోనే తజకిస్తాన్ బాక్సర్ సుమయ్యు విజయం సాధించింది. ఇక 75కిలోల ప్రిక్వార్టర్స్ బౌట్‌లో లౌలీనా 5-0 పాయింట్ల తేడాతో మెక్సికో బాక్సర్ వెనెస్సా ఒర్టిజ్‌పై అలవోక విజయం సాధించింది. ఆది నుంచే తనదైన దూకుడు కనబరిచిన అస్సాం బాక్సర్ ప్రత్యర్థికి ఎక్కడా అవకాశమివ్వకుండా పవర్‌ఫుల్ పంచ్‌లతో విరుచుకుపడింది. ఇక 54 కిలోల విభాగంలో సాక్షి ..జజిరా ఉర్కబయేవా(కజకిస్థాన్)పై గెలిచి క్వార్టర్స్‌లోకి ప్రవేశించింది. అనూహ్య రీతిలో జట్టులో చోటు దక్కించుకున్న ప్రీతి(54కి) 3-4 తేడాతోజింట్‌పాంగ్ జుటామస్(థాయ్‌లాండ్) చేతిలో పోరాడి ఓడింది.

గంజాయితో కజికిస్థాన్ దేశీయుడి అరెస్ట్

ప్రజాశక్తి -కంచరపాలెం (విశాఖ)

ఐదు కేజీల గంజాయి, పావు లీటర్ ఆశిష్ ఆయిల్‌తో కజికిస్తాన్ దేశీయుడిని ఎయిర్‌పోర్టు పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలివి. పోలీసులు విస్తృతంగా చేపడుతున్న తనిఖీల్లో భాగంగా పక్కాగా అందిన సమాచారంతో ఎన్ఎడి కొత్త రోడ్డు జంక్షన్, ఓ ప్రైవేట్ ట్రావెల్ ఏజెన్సీ వద్ద గోవా వెళ్లేందుకు బస్సు కోసం నిరీక్షిస్తున్న కజకిస్తాన్ దేశీయుడిని తనిఖీ చేయగా అతడి నుంచి ఐదు కేజీల గంజాయి, పావు లీటర్ ఆశిష్ ఆయిల్‌ను పోలీసులు గుర్తించారు. గడిచిన 30 ఏళ్లుగా గోవాలోనే ఉంటున్న నిందితుడు, అతని, స్నేహితులకి గంజాయి విరివిగా తీసుకునే అలవాటు ఉంది. గోవాలో 10 గ్రాముల గంజాయి రూ.1500 అమ్ముతుండడంతో, తక్కువ ధరకు దొరుకుతుందని తెలుసుకుని విశాఖకు వచ్చి, గంజాయి కొనుగోలు చేసి తిరుగు ప్రయాణంలో పోలీసులకు పట్టుబడ్డాడు. నిందితుడికి గంజాయి అమ్మిన వ్యక్తి ఎవరు, అతడు ఎక్కడ నుంచి వచ్చాడు, ఎంతకు అమ్మాడు, వెనక గల ముఠా కదలికలు ఏమిటి, అన్న విషయాలపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ప్రస్తుతం నిందితుడి సెల్ ఫోన్ ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.. సౌత్ డిసిపి కె.ఆనంద్‌రెడ్డి పర్యవేక్షణలో వెస్ట్ ఎసిపి అన్నెపు నరసింహమూర్తి నేతృత్వంలో ఎయిర్‌పోర్టు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పేదలకు గృహాలు అప్పగింత ఎన్నడో?

ఉగాదికి గృహ ప్రవేశాలు గడువు అటకెక్కినట్లే

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రవ్యాప్తంగా ఉగాదికి ఐదులక్షల మందికి ఒకేరోజు గృహ ప్రవేశాలు చేయిస్తామని ప్రభుత్వం గొప్పలు చెబుతున్నా.. ఆచరణలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. ఇప్పటికే అనేకసార్లు గృహ ప్రవేశాల తేదీల్లో మార్పులు చేస్తూ వచ్చిన ప్రభుత్వం చివరికి ఉగాదికి గృహ ప్రవేశాలు చేయించాలని నిర్దేశించుకున్న లక్ష్యం కూడా నెరవేరలేదు. శాసనసభ బడ్జెట్ సమావేశాల సందర్భంగా గృహ నిర్మాణశాఖ 2023-24 ఫలితాల బడ్జెట్‌లో 4.40 లక్షల ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయని, మిగిలిన ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్నట్లు పేర్కొంది. నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకం కింద మహిళల పేరుతో రాష్ట్రవ్యాప్తంగా 30,65,315 లక్షల మందికి ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. 2023 డిసెంబరు నాటికి 21.25 లక్షల మంది లబ్ధిదారులకు అందులో తొలి విడతగా 15.36 లక్షల మందికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించినప్పటికీ ఆచరణలో అమలుకు నోచలేదు. ప్రభుత్వం ఆశించిన స్థాయిలో నిర్మాణాలు వేగం పుంజుకోవడం లేదు. ఈ నేపథ్యంలో కనీసం ఉగాదికి ఐదు లక్షల ఇళ్లను పూర్తిచేసి రికార్డును సొంతం చేసుకోవాలనే ప్రభుత్వ ఆశయం నెరవేరే అవకాశాలు కనబడలేదు. ప్రతి లబ్ధిదారునికీ పావలావడ్డీ (3శాతం)తో బ్యాంకులు రూ.35 వేల రుణాన్ని అందిస్తున్నాయి. ఇప్పటి వరకు 8.92 లక్షల మంది లబ్ధిదారులకు రూ.3,142.24 కోట్ల బ్యాంకు రుణాలు అందాయి. నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకం కింద గృహ నిర్మాణాలు, ఇంటి స్థలంతో కలిపి రూ.1,46,520 కోట్లు ఖర్చవుతుందని ప్రభుత్వం అంచనా వేసింది.

లబ్ధిదారులకు లభించిన ప్రయోజనం మొత్తం

భూమిస్థితి	విస్తీర్ణం (ఎకరాల్లో)	ఖర్చు(కోట్లలో)
ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వ భూమి	30189.208	8,556.39
ఇళ్ల స్థలాల కోసం సేకరించిన భూమి	25427.13	10,243.00
ఇళ్ల స్థలాల కోసం భూ సమీకరణ	4457.05	8,270.00
ఇళ్ల స్థలాల కోసం ఎఎంఆర్‌డిఎ భూమి	1074.18	537.09
టిడ్కో ఇళ్ల కోసం భూమి	2550.96	1,275.48
స్వాధీన ధ్రువపత్రాలు	9800	2940.00
మొత్తం	**73498.528**	**31,831.96**

మెయిన్ డ్రాకు మాళ్విక అర్హత

మిక్స్‌డ్ డబుల్స్‌లో సిక్కిరెడ్డి-రోహన్ జంట కూడా..

స్విస్ ఓపెన్ సూపర్-300



బస్సెల్: స్విస్ ఓపెన్ సూపర్-300 మెయిన్ డ్రాకు మాళ్విక బన్సోద్‌తోపాటు మిక్స్‌డ్ డబుల్స్‌లో సిక్కిరెడ్డి-రోహన్ కపూర్ జోడీ అర్హత సాధించింది. అలాగే సీడెడ్ ఆటగాళ్లు కొందరు ఈ టోర్నీకి దూరంగా ఉండడంతో ఆకర్షి కశ్యప్, కిరణ్ జార్జి, మిథున్ మంజునాథ్ అర్హత మ్యాచ్‌లు ఆడకుండా ప్రధాన టోర్నీకి అర్హత సాధించారు. మంగళవారం జరిగిన అర్హత పోటీల్లో 21ఏళ్ల మాళ్విక 21-17, 21-7తో వరుససెట్లలో అమెరికాకు చెందిన లారెన్ లామ్‌పై గెలిచింది. ఈ మ్యాచ్‌ను మాళ్విక కేవలం 31 నిమిషాల్లోనే ముగించింది. మరో మ్యాచ్‌లో ప్రియాంశురాజవత్ 7-21, 5-21తో చైనీస్ తైపీకి చెందిన ఛియా-హో-లీ చేతిలో ఓటమిపాలైంది. ఇక మిక్స్‌డ్ డబుల్స్‌లో రోహన్ కపూర్-సిక్కిరెడ్డి జోడీ 21-17, 15-21, 21-8తో సింగపూర్ జోడీపై గెలిచింది. మరో మిక్స్‌డ్ పోటీలో అశ్విని పొన్నప్ప-బి సుమిత్‌రెడ్డి జోడీ 20-22, 12-21తో చైనీస్ తైపీ జోడీ చేతిలో ఓడింది. ఇక పురుషుల డబుల్స్‌లో సుమిత్‌రెడ్డి-కపూర్ జోడీ 15-21, 20-22తో మలేషియా జోడీ చేతిలో, మహిళల డబుల్స్‌లో అశ్విని పొన్నప్ప-తనీషా జోడీ 19-21, 15-21తో చైనా జంట చేతిలో ఓడి ప్రధాన టోర్నీకి అర్హత సాధించలేకపోయారు. 23నుంచి మెయిన్ డ్రా పోటీలు జరగనున్నాయి.

ఏది నిజం?

(మొదటి పేజీ తరువాయి)

ఉపాధ్యాయులు ఉన్నట్లు ప్రభుత్వం గతంలో చెప్పగా, తాజాగా మండలిలో మంత్రి స్పందిస్తూ 1,50,641 మంది పనిచేస్తున్నారని వెల్లడించారు. అంటే ఇంకా 36 వేల ఖాళీలు ఉండాలని కదా అని పిడిఎఫ్ సభ్యుడు విఠపు బాలసుబ్రహ్మణ్యం ప్రశ్నించారు. అలాగే ఖాళీగా ఉన్న స్కూల్ అసిస్టెంట్లు, ప్రధానోపాధ్యాయులు, సెకండరీ గ్రేడ్ పోస్టులు కలిపి 14,061 ఖాళీలను త్వరలో డిఎస్‌సి ద్వారా భర్తీ చేస్తామని 2021లోనే ప్రభుత్వం చెప్పిందని, ఇప్పుడు ఆ పోస్టులు ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు.

సింగిల్ టీచర్ పోస్టులన్నీ..

సింగిల్ టీచర్ చాలన్న కారణంగా అనేక ఖాళీలను భర్తీ చేసేందుకు ప్రభుత్వం సుముఖత చూపించడం లేదు. రాష్ట్రంలో 20 మంది కన్నా తక్కువ పిల్లలున్న 6775 పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులకు ప్రభుత్వం కోతలు పెడుతున్నట్లు కూడా ఆరోపణలు వస్తున్నాయి. తెలుగు మీడియం రద్దు ఉత్తర్వుల పేరుతో మొత్తం పోస్టులను 1,55,892కు కుదించారు. మిగిలిన వాటిని కూడా ఖాళీలుగా చూపించడం లేదని విఠపు విమర్శించారు.

2026లోగా మరిన్ని రద్దు

ప్రపంచబ్యాంకు నిబంధనల కారణంగా త్వరలో మరిన్ని పోస్టులు రద్దవుతాయన్న ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. ఇప్పటికే 30 వేలకు పైగా టీచర్ పోస్టులు అనధికారికంగా రద్దు కాగా, మరో మూడేళ్లలో మరో 30 వేల వరకు పోస్టులు రద్దవుతాయన్న భావాన్ని మండలి సభ్యుడు బాలసుబ్రమణ్యం వ్యక్తం చేస్తున్నారు. వచ్చే రెండేళ్లలో వరుసగా తొమ్మిది, పదో తరగతిలో తెలుగు మీడియం రద్దవుతుందని, దీనివల్ల మరికొన్ని పోస్టులు పోతాయని ఆయన అభిప్రాయపడ్డారు.

మరమ్మతులు చేసేదెప్పుడు?


- నిధులు మంజూరైన ప్రారంభం కాని పనులు
- మద్దువలస ప్రాజెక్టు నిర్వహణపై స్పష్టత కరువు
- నీటి మట్టం తగ్గడంతో తాగునీటి పథకానికి ఆటంకం

ప్రజాశక్తి - వంగర (విజయనగరం)

దాదాపు 40 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాలనే ఉద్దేశంతో 20 ఏళ్ల క్రితం ప్రారంభించిన మడ్డువలస ప్రాజెక్టు ప్రధాన గేట్లు పూర్తిగా మరమ్మత్తులకు గురయ్యాయి. దీంతో ప్రభుత్వం ఆరు నెలల క్రితం రూ.1.60 కోట్ల నిధులను మంజూరు చేసింది. అయినప్పటికీ నేటికీ మరమ్మతు పనులు ప్రారంభం కాలేదు. కనీసం ఎప్పుడు ప్రారంభిస్తారు కూడా తెలియని పరిస్థితుల్లో యంత్రాంగం పనిచేస్తోంది. గేట్లు మరమ్మతుల కు గురికావడంతో నీరంతా లీకులు రూపంలో బయటకు వృధాగా పోతుంది. ఫలితంగా ప్రాజెక్టు నీటిమట్టం తగ్గింది. దీంతో ప్రాజెక్ట్‌ని ఆనుకొని మగ్గూరు వద్ద ఉన్న రక్షిత మంచినీటి పథకానికి నీరు అందకపోవడంతో వంగర మండలంతో పాటు రేగిడి మండలంలో గల కొన్ని గ్రామాల కు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. మరమ్మతు పనులు చేపడితే తప్ప లీకులు అరికట్టే పరిస్థితి ఉండదనీ, నిధులున్నా పనులు ఎందుకు చేయడంలేదని ఆయా గ్రామాల ప్రజలు అధికారుల నిర్వహణ తీరుపై మండిపడుతున్నారు.

ఇదీ పరిస్థితి

మండలంలోని గొర్లె శ్రీరాములు నాయుడు మడ్డువలస ప్రాజెక్టుకు 11 ప్రధాన గేట్లు ఉన్నాయి. ఇందులో సుమారు ఎనిమిది గేట్లు వరకు కూడా రోప్స్, సీల్స్, గేట్లు పెయింటింగ్‌లు పూర్తిగా పాడైపోవడంతో ప్రాజెక్టులో ఉన్న సాగునీరు అంతా కూడా దిగువకు వృధాగా పోతుంది. వరదల సమయంలో గేట్లు ఎత్తాలన్నా దించాలన్నా అధికారులకు ఇబ్బందిగా ఉంటుంది. గేట్లును బాగుచేయక పోవడంతో ప్రాజెక్టు తీర గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికీ అధికారులు మాత్రం పనులు ప్రారంభించక మీనమేషాలు లెక్కిస్తున్నారు.



40వేల ఎకరాలకు సాగునీరు

ఈ ప్రాజెక్టు నుంచి విజయనగరం జిల్లాలో గల వంగర, రేగిడి, సంతకవిటి మండలాలతో పాటు శ్రీకాకుళం జిల్లాలో గల పొందూరు, జి.సిగడాం, లావేరు, రణస్థలం మండలాల్లోని సుమారు 40వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు వెళ్తుంది. ఇంత పెద్ద ప్రాజెక్టుకు సంబంధించిన పనులు ఎప్పుడు ప్రారంభించి ఎప్పటికీ పూర్తి చేసి సాగునీరు అందిస్తారో ఎవరికి తెలియని పరిస్థితి.

45 రోజులు సమయం..

మరమ్మత్తు పనులు చేయాలంటే ప్రాజెక్టులో ఉన్న మొత్తం నీటినంతటిని ఖాళీ చేసి పనులు పూర్తి చేసేసరికి 45 రోజులు సమయం పడుతుందని అధికారులే చెబుతున్నారు. ప్రస్తుతం మర్చి నెల పూర్తి కావస్తుంది. పనులు ప్రారంభించినా మే నెల చివరి వరకు జరిగే అవకాశం ఉంది. ఏప్రిల్, మే నెలల్లో తుఫానులు వరదలు వచ్చే అవకాశం ఎక్కువ ఉన్నందున పనులు కూడా ఆటంకం కలిగే అవకాశం ఉంది. ఇవన్నీ దృష్టిలో పెట్టుకుని ఫిబ్రవరిలోనే పనులు ప్రారంభిస్తే ఏప్రిల్ నాటికి పూర్తయ్యే అవకాశం ఉండేది. ఆరు నెలల క్రితం నిధులు మంజూరైనప్పటికీ మరమ్మత్తు పనులు చేసేందుకు అధికారులు ఎందుకు ఇంత జాప్యం చేస్తున్నారని అధికారులు తీరుపై రైతులు సైతం మండిపడుతున్నారు. కాగా పనులు త్వరితగతన ప్రారంభించక పోతే నిధులు కూడా వెనక్కి వెళ్ళిపోతాయేమోనని రైతులు ఆందోళణ చెందుతున్నారు.

ప్రాజెక్టు ప్రస్తుతనీటి పరిస్థితి

65 మీటర్లు లెవెల్ నీటిమట్టనిగాను ప్రాజెక్టులో ప్రస్తుతం 60.68 మీటర్లు లెవెల్ నీటిమట్టం ఉందని, సువర్ణముకి, వేగావతి నదుల నుంచి 219 క్యూ సెక్కులు నీరు మాత్రమే వస్తుందని, కుడి ఎడమ కాలువలుతో పాటు ప్రధాన గేట్లు మూసివేసినట్లు ప్రాజెక్ట్ అధికారి తెలిపారు.

తాగునీటికి ఆటంకం

మడ్డువలస ప్రాజెక్టులో ఉన్న నీటిని ఎప్పుడూ లేనంతగా కుడి కాలువ ద్వారా ఈ ఏడాది కిందికి విడిచిపెట్టడం, అధిక లీకులు వల్ల ప్రాజెక్టులో ఉన్న నీరు భారీగా తగ్గిపోయింది. దీంతో ప్రాజెక్టుకి ఆనుకొని మగ్గూరులో ఉన్న రక్షిత మంచినీటి పథకానికి నీరు అందక వంగర మండలంతో పాటు రేగిడి మండలంలో గల కొన్ని గ్రామాలకు తాగునీరు రక్షిత మంచినీటి పథకం ద్వారా వెళ్లే తాగునీరు నిలిచిపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు మండిపడుతున్నారు.

పనులు ప్రారంభిస్తాం : నర్మదా పట్నాయక్, డిఇ

మడ్డవలస ప్రాజెక్టు గేట్లు మరమ్మతులకు సంబంధించి ఇప్పటికే టెండర్లు పూర్తి అయ్యాయి. ఏప్రిల్ నెలలో పనులు ప్రారంభిస్తాం, కాంట్రాక్టర్ కూడా ప్రాజెక్టు వద్దకు వచ్చి చూసి వెళ్లారు.

భారత్‌తో తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘనలు

అమెరికా ప్రభుత్వ నివేదిక

వాషింగ్టన్: భారత్‌లో తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘనలు జరుగుతున్నాయని అమెరికా ప్రభుత్వ నివేదిక ఒకటి పేర్కొంది. చట్ట విరుద్ధంగా, ఏకపక్షంగా కొందరిని లక్ష్యంగా చేసుకోవడం, పత్రికా స్వేచ్ఛపై ఆంక్షలు, మైనార్టీలపై హింస పరంగా 2022లో భారత్‌లో పెద్ద ఎత్తున మానవ హక్కుల ఉల్లంఘన చోటు చేసుకుందని నివేదిక వెల్లడించింది. 'వార్షిక మానవ హక్కుల నివేదిక'ను విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ సోమవారం విడుదల చేశారు. 'భారత్‌లో ఏ స్థాయిలోనూ అధికార దుర్వినియోగానికి జవాబుదారీతనం లేదు. అలసత్వం, సుశిక్షితులైన పోలీసు అధికారుల కొరత, తగినన్ని వనరులు లేక సతమతమవుతున్న న్యాయవ్యవస్థ వల్ల తక్కువమందికే శిక్షలు పడుతున్నాయి. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని పోలీసులు కొందరిని హతమారుస్తుండడం, జైళ్లలో చిత్రహింసలు పెట్టడం, అమానవీయంగా వ్యవహరించడం వంటివి చోటు చేసుకుంటున్నాయి. జైళ్లలో పరిస్థితులు దారుణంగా ఉంటున్నాయి. ఏకపక్షంగా కొందరిని నిర్బంధిస్తున్నారు. గోప్యతలో చొరబడుతున్నారు. పత్రికా స్వేచ్ఛకు ఆంక్షలు విధిస్తున్నారు. అన్యాయంగా అరెస్టులు చేస్తున్నారు. పాత్రికేయుల్ని ప్రాసిక్యూట్ చేస్తున్నారు. ఇంటర్నెట్ స్వేచ్ఛపైనా ఆంక్షలు విధిస్తున్నారు. ఇలాంటి ఎన్నో ఉల్లంఘనలు చోటు చేసుకుంటున్నాయి' అని నివేదిక పేర్కొంది. వివిధ దేశాల్లో హక్కుల ఉల్లంఘనల గురించి దీనిలో పొందుపరిచారు. రష్యా, చైనా, ఇరాన్, ఉత్తర కొరియా, మయన్మార్ వంటి ఇతర దేశాల్లోని పరిస్థితులనూ నివేదిక తెలిపింది.

ఆఫ్ఘన్‌లో భూకంపం

ఢిల్లీలోనూ ప్రకంపనలు

న్యూఢిల్లీ : ఆఫ్ఘనిస్థాన్‌లో మంగళవారం సాయంత్రం భూకంపం సంభవించింది. దేశంలోని ఫయజ్‌బాద్‌కు 133 కిలోమీటర్ల దూరంలో కేంద్రంగా రిక్టర్‌స్కేల్‌పై 6.8 తీవ్రతతో ఈ భూకంపం సంభవించింది. ఈ భూకంపం కారణంగా ఎలాంటి ప్రాణనష్టం జరిగినట్లు ఇంకా సమాచారం లేదు. అయితే ఈ భూకంపం ప్రభావంతో సమీప దేశాలు పాకిస్థాన్, భారత్‌లోనూ ప్రకంపనలు కలిగాయి. దేశంలోని ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, జమ్ముకాశ్మీర్, పంజాబ్, హర్యానా, రాజస్థాన్‌లో ప్రకంపనలు సంభవించాయి. ఢిల్లీలో సుమారు రెండు నిమిషాలు పాటు వరస ప్రకంపనలు రావడంతో ప్రజలు భయాందోళనతో ఇళ్లల్లో నుంచి రోడ్లపైకి పరుగులు తీశారు.

నిరంకుశ చట్టాలపై ఆస్ట్రేలియాలో ఆగ్రహజ్వాల

సిడ్నీ : ఆస్ట్రేలియాలో రోజురోజుకు పెరుగుతున్న నిరంకుశమైన చట్టాలపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి, వ్యతిరేకత పెరుగుతోంది. పౌర హక్కులు, ఇతర రాజకీయ స్వేచ్ఛలు ముప్పుకు గురవుతున్న అనేక దేశాల్లో ఆస్ట్రేలియా ఒకటి. కొత్త కొత్త రూపాల్లో నిరసనలను ఎదుర్కొంటున్న ప్రభుత్వాలు దారుణమైన, నిరంకుశమైన చట్టాలను తీసుకువస్తున్నాయి. ఎక్సింటక్షన్ రెబెలియన్ వంటి గ్రూపులతో మొదలుపెట్టి చిన్న చిన్నగ్రూపుల వరకు అందరూ తమ డిమాండ్లపై ప్రభుత్వ దృష్టిని సారించేలా చేసేందుకు వినూత్నమైన, రాడికల్ పద్ధతులను చేపడుతున్నారు. కొత్త కొత్త రూపాల్లో రహదారులను దిగ్బంధించడం నుండి ధర్నాలు, కళారూపాల ద్వారా నిరసన తెలియజేయడం వరకు అనేక పద్ధతులు అవలంబిస్తున్నారు. అనేక పశ్చిమ దేశాల్లో మాదిరిగానే ఆస్ట్రేలియాకు కూడా శాంతియుతంగా పౌర నిరసనలు జరిగిన చరిత్ర వుంది. 1800 చివరిలో ఓటు హక్కు కోసం మహిళలు నిరసనలకు దిగితే, 1960 చివరిలో వియత్నాం యుద్ధాన్ని నిరసిస్తూ వేలాదిమంది ప్రజలు బహిరంగ కార్యాచరణకు దిగారు. ప్రధాన రహదారులను ధ్వంసం చేసినా, లేదా వాటిపై రాకపోకలకు ఆటంకం కలిగించినా శిక్ష తప్పదని పేర్కొంటూ కొన్ని రోజుల క్రితమే ఆస్ట్రేలియా ప్రభుత్వం రోడ్స్ అండ్ క్రైమ్స్ అమెండ్‌మెంట్ యాక్ట్‌ను తీసుకు వచ్చింది. కొత్త రకాల నిరసనలు తలెత్తుతున్నపుడు నిరంకుశ చట్టాలు తీసుకురాక తప్పదని న్యూ సౌత్ వేల్స్ ప్రధాని డొమినిక్ పారెట్ సమర్ధించుకున్నారు. అటువంటి తరహా వ్యవహార శైలికి మన ప్రభుత్వంలో స్థానం లేదని వ్యాఖ్యానించారు. అయితే ఈ నిరసనల వల్ల ప్రజలకు కలిగే అసౌకర్యం నుండి రక్షించేలా ఈ చట్టాలు లేవని విమర్శకులు పేర్కొంటున్నారు.

'ఉపాధి' నిర్వీర్యానికి ఎన్‌డిఎ కుట్ర : రాహుల్

వాయనాడ్ : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎస్)ను నాశనం చేయడానికి కేంద్రంలోని బిజెపి నేతృత్వ ఎన్‌డిఎ ప్రభుత్వం కుట్ర చేస్తోందని కాంగ్రెస్ నాయులు, వాయనాడ్ ఎంపి రాహుల్ గాంధీ మంగళవారం విమర్శించారు. ఇక్కడ వాయనాడ్ జిల్లాలో యుడిఎఫ్‌కు చెందిన ఎన్నికైన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో జరిగిన సమావేశంలో రాహుల్ ప్రసంగించారు. గతంలో యుపిఎ ప్రభుత్వంలో పేదల సంక్షేమం కోసం ఈ పథకాన్ని తీసుకుని వచ్చామని, అయితే దీనిని ఎన్‌డిఎ ప్రభుత్వం పూర్తిగా నాశనం చేయడానిక ప్రయత్నం చేస్తోందని అన్నారు.



పేదల వాణి వినిపిస్తా

- తొలి ట్రాన్స్‌జెండర్ లాయర్

తిరువనంతపురం : ఫిజిక్స్ గ్రాడ్యుయేట్, ఇన్సూరెన్స్ ఏజెంట్, చివరగా, పూర్తి స్థాయి లాయర్ అయిన పద్మాలక్ష్మి ప్రయాణమేమీ అంత సులభంగా సాగలేదు. కేరళలోనే మొదటి ట్రాన్స్‌జెండర్ లాయర్ అయిన పద్మాలక్ష్మి పేదలు, నిర్లక్ష్యానికి గురైన వ్యక్తుల వాణిని వినిపించాలని భావిస్తున్నారు. ఈ క్రమంలో తనపై వచ్చిన విమర్శలను, వ్యాఖ్యలను, దూషణలను అన్నింటినీ పక్కకు నెట్టివేశానని ఆమె చెప్పారు. కేవలం సానుకూలత గల అంశాలపైనే తాను దృష్టి పెట్టానన్నారు. ప్రతికూలతలపై దృష్టి సారిస్తే కేవలం వాటికే తన సమయమంతా వెచ్చించాల్సివస్తుందని, అందుకే వాటిని పట్టించుకోకుండా తన లక్ష్య సాధన దిశగా ముందుకు సాగానని చెప్పారు. గతేడాది నవంబరు నుండి న్యాయవాది భద్రకుమారి వద్ద ఆమె ట్రెయినీగా పనిచేస్తున్నారు. రాజ్యాంగమనేది న్యాయవాదుల అతిపెద్ద ఆయుధమని ఆమె ప్రతిక్షణం గుర్తు చేసుకుంటారు. కేరళ బార్ కౌన్సిల్‌కు ఎన్‌రోల్ అవడంపై ఆమె హర్షం వ్యక్తం చేశారు. ప్రాథమిక హక్కుల ఉల్లంఘన జరిగే కేసులను చేపట్టాలని భావిస్తున్నట్లు చెప్పారు. పేదల, సమాజంలో వెనుకబాటుకు గురైన వారి తరపున పోరాటం చేయాలని భావిస్తున్నట్లు తెలిపారు.

ఇంగ్లీష్ టెస్టు కుంభకోణంపై చర్యలు తీసుకోండి

- రిషి సునాక్‌కు భారత విద్యార్థుల లేఖ

లండన్ : ఇంగ్లీష్ టెస్టు కుంభకోణంపై తగిన చర్యలు తీసుకోవాలని అనేక మంది అంతర్జాతీయ విద్యార్థులతో పాటు భారత్ విద్యార్థులు బ్రిటన్ ప్రధానమంత్రి రిషి సునాక్‌కు లేఖ రాసారు. ఈ కుంభకోణం వెల్లడైన తరువాత తమ వీసాలను అన్యాయంగా రద్దు చేశారని విద్యార్థులు లేఖలో విమర్శించారు. వీసాలు జారీ చేయడం కోసం తప్పనిసరిగా నిర్వహించే ఇంగ్లీష్ భాషా పరీక్షలో అక్రమాలు చోటుచేసుకున్నట్లు కథనాలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సుమారు 10 వేల మంది విద్యార్థుల వీసాలను బ్రిటన్ ప్రభుత్వం రద్దు చేసింది.

గడ్కరీకి బెదిరింపు కాల్స్

నాగ్‌పూర్ : కేంద్రమంత్రి, బిజెపి నాయకులు నితిన్ గడ్కరికీ మూడు బెదిరింపు కాల్స్ రావడంతో నాగర్‌పూర్‌లోని అతని నివాసం, కార్యాలయం వద్ద భద్రతను పోలీసులు పెంచారు. తమకు రూ. 10 కోట్లు చెల్లించకపోతే గడ్కరీకి హానీ చేస్తామని ఫోన్‌లో బెదిరించారు. జనవరిలో కూడా గడ్కరీకి ఇలాంటి బెదిరింపు కాల్స్ వచ్చినట్లు బిజెపి నేతలు పేర్కొన్నారు.

రాహుల్ ఆధునిక మీర్ జాఫర్ : బిజెపి


న్యూఢిల్లీ : కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ 'ఆధునిక మీర్ జాఫర్' అని బిజెపి అధికార ప్రతినిధి సంబిత్ పాత్ర అభివర్ణించారు. మంగళవారం ఇక్కడ మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ '1757లో మీర్ జాఫర్ ఏం చేసారో.. లండన్ పర్యటనలో రాహుల్‌గాంధీ కూడా అదే చేశారు' అని విమర్శించారు. విదేశీ బలగాలు భారత్‌కు రావాలని రాహుల్ ఆహ్వానించారని ఆరోపించారు. విదేశాల్లో భారత్‌కు వ్యతిరేకంగా రాహుల్‌కు మాట్లాడటం ఇదే తొలిసారి కాదని, పదేపదే భారత్ పరువు తీస్తున్నారని ఆరోపించారు. దీనికి ఆయన క్షమాపణలు చెప్పేలా తాము చర్యలు చేపడుతామని హెచ్చరించారు.

సిసోడియా బెయిల్ విచారణ 24కు వాయిదా

న్యూఢిల్లీ : ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా బెయిల్ పిటీషన్ విచారణను ఈ నెల 24కు ఢిల్లీ కోర్టు మంగళవారం వాయిదా వేసింది. ముందుగా సిసోడియా దాఖలు చేసిన బెయిల్ పిటీషన్‌ను కోర్టు విచారించింది. సిసోడియా లంచం తీసుకున్నట్లు ఎలాంటి ఆధారాలు లభించలేదు. సోదాల్లోనూ సిసోడియాకు వ్యతిరేకంగా ఏమీ లభించలేదు' అని అతని తరపున న్యాయవాది కోర్టుకు తెలిపారు. విచారణకు సిసోడియా సహకరిస్తున్నారని, బెయిల్ మంజూరు చేయాలని కోరారు. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఫిబ్రవరి 26న సిసోడియాను సిబిఐ అరెస్టు చేసిన సంగతి తెలిసిందే.

కనీస మద్దతు ధర లేకపోతే ఆహార భద్రతకే ప్రమాదం

- ప్రముఖ ఆర్థిక వేత్త ప్రభాత్ పట్నాయక్
- మజ్దూర్ కిసాన్ సంఘర్ష్ ర్యాలీ జయప్రదానికి పిలుపు



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం రైతులకు కనీస మద్దతు ధర ప్రకటించకుంటే దేశ ఆహార భద్రతే నాశనమవుతుందని ప్రముఖ ఆర్థికవేత్త ప్రొఫెసర్ ప్రభాత్ పట్నాయక్ హెచ్చరించారు. కనీస మద్దతు ధరకు చట్టపరమైన రక్షణ కల్పించడం రైతులకే కాకుండా దేశానికి కూడా మేలు చేస్తుందన్నారు. ఏప్రిల్ 5న ఢిల్లీలో జరగనున్న కార్మిక, కర్షక ఐక్య పోరాట కవాతు (మజ్దూర్ కిసాన్ సంఘర్ష్ ర్యాలీ)ని జయంప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ ర్యాలీకి ఆహ్వాన కమిటీ ఛైర్మన్‌గా ప్రభాత్ పట్నాయక్ వ్యవహరిస్తున్నారు. ఈ మేరకు మంగళవారం నాడిక్కడ ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా (పిసిఐ)లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కిసాన్‌సభ ఉపాధ్యక్షులు హన్నన్‌మొల్లా, సిఐటియు ప్రధానకార్యదర్శి తపన్‌సేన్, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధానకార్యదర్శి బి వెంకట్‌తో కలిసి ఆయన మాట్లాడారు. కనీస మద్దతు ధర ఇవ్వకుంటే రైతులు వ్యవసాయాన్ని కొనసాగించే పరిస్థితులు ఉండవని ప్రభాత్ పట్నాయక్ ఈ సందర్భంగా హెచ్చరించారు. దేశంలో సాగు భూములన్నీ నిర్వీర్యమవుతాయని, దాని ప్రభావం భారత్‌తో పాటు పలు ఆఫ్రికన్ దేశాల ఆహార భద్రతపైనా తీవ్రంగా ఉంటుందని తెలిపారు. లేబర్ కోడ్‌లు, వ్యవసాయ చట్టాలతో నయా ఉదారవాద విధానాలను క్రూరంగా అమలు చేసేందుకు బిజెపి ప్రయత్నిస్తోందని విమర్శించారు. దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాస్తూ కార్మికులను బానిసలుగా మార్చే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. ఉపాధి హామీకి నిధులు ఇవ్వకుండా నిర్వీర్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోడీ సర్కార్ వినాశకర విధానాలకు కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు శ్రమజీవులంతా బలైపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆధునిక సమాజ నిర్మాణంలో శ్రామికవర్గాలే కీలక పాత్ర పోషిస్తాయన్నారు. దేశ లౌకికవాదాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించడంలో కార్మిక, కర్షక ఐక్య పోరాటం ప్రధాన పాత్ర పోషిస్తోందని ఆయన పేర్కొన్నారు.

ఐదు లక్షల మందితో మహా ప్రదర్శన..

ఎఐకెఎస్ ఉపాధ్యక్షులు హన్నన్ మొల్లా మాట్లాడుతూ ఉత్పత్తి వర్గాలైన కార్మిక, రైతు, వ్యవసాయ కార్మికులు తీవ్ర దోపిడికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే దేశంలో 4 లక్షల మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని, ఎంఎస్‌పి కోసం రైతులు ఎప్పటి నుండో డిమాండ్ చేస్తున్నారని పేర్కొన్నారు. సిఐటియు, ఎఐకెఎస్, ఎఐఎడబ్ల్యుయు సంఘాల ఆధ్వర్యంలో ఐదు లక్షల మంది ఢిల్లీకి తరలివచ్చి మహాప్రదర్శన చేపట్టనున్నారని ఆయన తెలిపారు. దీనికి ముందు కోటి మందికి చేరువయ్యేలా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. దేశవ్యాప్తంగా నాలుగు వందల జిల్లాల్లో ఉమ్మడిగా సభలు నిర్వహించినట్లు తెలిపారు.

ఇవీ ప్రధాన డిమాండ్లు..

కార్మిక, కర్షక ఐక్య పోరాట కవాతు ప్రధాన డిమాండ్లను సిఐటియు ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ వివరించారు. దేశంలో 93 శాతం కార్మికులు అసంఘటిత రంగంలో ఉన్నారని, వారి భద్రత ప్రశ్నార్థకంగా ఉందన్నారు. వారందరికీ ఉపాధి భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కనీస మద్దతు ధరకు చట్టపరమైన రక్షణ కల్పించాలని, లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, విద్యుత్ బిల్లును ఉపసంహరించుకోవాలని, ప్రభుత్వ రంగ ప్రైవేటీకరణకు స్వస్తి పలకాలని, సంపన్ను లపై అదనపు పన్నులు విధించాలన్న ప్రధాన డిమాండ్లతో ఈ ఆందోళన చేపట్టనున్నట్లు తపన్‌సేన్ తెలిపారు. గత ఐదు నెలలుగా దేశవ్యాప్తంగా మోడీ సర్కార్ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రచారం చేస్తున్నామని, క్షేత్రస్థాయిలో ప్రజల వద్దకు ర్యాలీ సందేశం వెళ్తుందని తెలిపారు.

దళితులపై దాడులకు ప్రభుత్వ మద్దతు..

ఎఐఎడబ్ల్యుయు ప్రధాన కార్యదర్శి బి వెంకట్ మాట్లాడుతూ దేశంలో 25 కోట్ల మంది దళితులు ఉన్నారని, వారిపై దాడులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రభుత్వ మద్దతుతో దాడులు జరుగుతున్నాయని అన్నారు. ఏడు శాతం మంది గిరిజనలు ఉన్నారని, వారికి సంబంధించిన అటవీ హక్కుల చట్టాన్ని బిజెపి నిర్వీర్యం చేస్తుందని విమర్శించారు. ఉపాధి హామీకి గతంలో 4 శాతం నిధులు కేటాయిస్తే, ఇప్పుడు 1.3 శాతానికి తగ్గించారని తెలిపారు. పార్లమెంట్‌లో ఎలాంటి చర్చ లేకుండా కేంద్ర ప్రభుత్వం ఆదేశాలిస్తుందని దుయ్యబట్టారు. ప్రజా పంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు వన్ నేషన్, వన్ రేషన్ కార్డు తీసుకొచ్చారని ఆయన విమర్శించారు.

ఎరువుకు 'కులం'.. సమాచార సేకరణకే!

- కేంద్ర మంత్రి భగవంత్ వెల్లడి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఎరువుల కొనుగోలు సమయంలో ఎరువుల విక్రయ కేంద్రాల (పిఓఎస్) వద్ద రైతులు తమ 'కులం' పేరు నమోదు చేయాలని కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన సమాచారం సేకరణకేనని ఎరువులు, రసాయనాల శాఖ మంత్రి భగవంత్ కుబ తెలిపారు. ఈ మేరకు తమిళనాడుకు చెందిన పిఎంకె రాజ్యసభ సభ్యులు అన్బుమణి రాందాస్ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి మంగళవారం లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు. భవిష్యత్తులో కులాల ఆధారంగా రైతులకు ఎరువులపై రాయితీ వర్తింపజేసే ఆలోచన ఏమైనా ఉందా? అని ఎంపి ప్రశ్నించగా అటువంటి యోచన పరిగణనలో లేదని కేంద్ర మంత్రి తెలిపారు.

10,302 ఎస్‌సి, ఎస్‌టి బ్యాక్‌లాగ్ పోస్టులు ఖాళీ

ప్రభుత్వ రంగ సంస్థల్లో 10,302 ఎస్‌సి, ఎస్‌టి బ్యాక్‌లాగ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరి తెలిపారు. రాజ్యసభలో ఒక ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2023 జనవరి 1 నాటికి ప్రభుత్వ రంగ సంస్థల్లో 5,768 ఎస్‌సి బ్యాక్‌లాగ్ పోస్టులు, 4,534 ఎస్‌టి బ్యాక్‌లాగ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

లోక్‌సభలో జమ్ముకాశ్మీర్ బడ్జెట్

నిరసనల మధ్యే నిమిషంలో ఆమోదం



న్యూఢిల్లీ : జమ్ముకాశ్మీర్ స్వయం ప్రతిపత్తిని రద్దు చేసి కేంద్ర పాలిత ప్రాంతాలుగా ముక్కలు చేసిన అనంతరం అక్కడ ఎన్నికలేవీ నిర్వహించకుండా కేంద్రమే పాలన సాగిస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి చెందిన జమ్ముకాశ్మీర్ బడ్జెట్‌ను మంగళవారం లోక్‌సభ ఆమోదించింది. రూ. 1.185 లక్షల కోట్లతో రూపొందించిన ఈ బడ్జెట్‌పై ఎటువంటి చర్చకు ఆస్కారం లేకుండా మూజువాణీ ఓటుతో ఆమోదించారు. మంగళవారం మధ్యాహ్నం 2 గంటల తరువాత సమావేశమైన సభలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తరుపున ఆ శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి ఈ బడ్జెట్‌కు సంబంధించిన బిల్లును ప్రతిపాదించారు. అయితే దేశాన్ని సంక్షోభంలోకి నెడుతున్న అదానీ అక్రమాలపైనా, ధరల పెరుగుదల, నిరుద్యోగం తదితర ప్రజా సమస్యలపై చర్చకు అనుమతించకపోవడంతో ప్రతిపక్షాల సభ్యులు ఒకవైపు ఆందోళన చేస్తుండగానే ఈ బిల్లును ప్రతిపాదించారు. అదానీ బాగోతంపై జెపిసి వేయాలని ప్రతిపక్షాల సభ్యులు నినాదాలు హోరెత్తిస్తుండగానే..ఒకే ఒక నిమిషంలో అదికూడా మూజువాణి ఓటుతో జమ్ముకాశ్మీర్ బడ్జెట్‌ను ఆమోదించారు.

వ్యూహాత్మక భాగస్వామ్యంతో ముందుకు

రష్యా ప్రధాని మిషుస్తిన్‌తో భేటీలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్

మాస్కో: చైనా అధ్యక్షుడు సీ జిన్‌పింగ్ రష్యా ప్రధాని మిఖాయిల్ మిషుస్తిన్‌తో మంగళవారం భేటీ అయ్యారు. ఆ తరువాత ఇరు దేశాల ఉన్నత స్థాయి ప్రతినిధి బృందాలు ఈ ఇరువురి నేతల సారథ్యంలో సమావేశమయ్యాయి. సమావేశమయ్యాయి. మిషుస్తిన్‌తో జరిపిన భేటీలో జిన్‌పింగ్ మాట్లాడుతూ, వాణిజ్యం, పెట్టుబడులు, సప్లయి చైన్, మెగా ప్రాజెక్టులు, ఇంధనం, హై-టెక్ ఏరియాల్లో రష్యాతో సహకారాన్ని పెంపొందించుకునేందుకు చైనా సిద్ధంగా ఉందన్నారు. చైనా, రష్యా రెండూ అతి పెద్ద ఇరుగుపొరుగు దేశాలని, ఇవి పరస్పరం గౌరవించుకుంటూ సమగ్ర వ్యూహాత్మక భాగస్వాములుగా సమన్వయంతో ముందుకు సాగుతాయని అన్నారు. ఇరు దేశాల సంబంధాలు ఆరోగ్యకరంగా, నిలకడగా అభివృద్ధి చెందుతున్నట్లు జిన్‌పింగ్ చెప్పారు. చైనా, రష్యా సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం, సమన్వయంతో సమిష్టిగా ముందుకు సాగుతాయని అన్నారు. ఇరు దేశాల ప్రధానులు ఎప్పటికప్పుడు చర్చించుకుంటూ, కమ్యూనికేషన్ చానెళ్లను సంస్థాగతం చేస్తూ ద్వైపాక్షిక సంబంధాలను మరింత ఉన్నత స్థితికి తీసుకెళ్తాయని అన్నారు. 'బెల్ట్ అండ్ రోడ్ ఫోరమ్ ఫర్ ఇంటర్నేషనల్ కో-ఆపరేషన్' మూడవ వార్షిక సమావేశాలకు రావాల్సిందిగా రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను తాను ఆహ్వానించానని జిన్‌పింగ్ తెలిపారు. ఈ ఫోరమ్ మొదటి రెండు వార్షికోత్సవాలకు పుతిన్ హాజరైన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. చైనా-రష్యా మధ్య వారధిగా బెల్ట్ అండ్ రోడ్ ముఖ్యమైన పాత్ర పోషిస్తోందని ఆయన అన్నారు. రష్యా ప్రధానితో జిన్‌పింగ్ జరిపిన చర్చల్లో ఉక్రెయిన్‌తో సహా పలు కీలకమైన అంశాలు ప్రస్తావనకు వచ్చినట్లు ఉన్నత స్థాయి వర్గాలు వెల్లడించాయి.

అంతకుముందు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లదిమిర్ జెలెన్‌స్కీతో ఫోన్‌లో సంభాషించినట్లు ఉక్రెయిన్ ఉప ప్రధాని ఇరినా వీరేష్‌చుక్ తెలిపారు. ఇటాలియన్ వార్తా పత్రిక 'కొరీరే డెల్లా సెరా' తో వీరేష్‌చుక్ మాట్లాడుతూ, ఈ ఇరువురి నేతల మధ్య సంభాషణలు ఒక ముఖ్యమైన పరిణామమని వ్యాఖ్యానిం చారు. రష్యా, ఉక్రెయిన్ మధ్య ఘర్షణ తరువాత సీ జిన్‌పింగ్ జెలెన్‌స్కీతో ఎన్నడూ మాట్లా డలేదని గత వారం వాల్‌స్ట్రీట్ జర్నల్ పేర్కొంది. .జిన్‌పింగ్ రష్యా పర్యటన నుంచి తిరిగి వచ్చిన తరువాతే చైనా, ఉక్రెయిన్ నేతల మధ్య వర్చువల్ సమావేశం ఉండొచ్చని పేరు తెలపడానికి ఇష్టపడని ఓ ఉన్నతాధికారి తెలిపారు. చైనా నేత జిన్‌పింగ్ సోమవారం మాస్కోకు చేరుకున్న తరువాత రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో దాదాపు అయిదున్నర గంటల సేపు ముఖాముఖి చర్చలు జరిపారు. ఉక్రెయిన్ యుద్ధంపై చైనా వైఖరిని రష్యన్ వార్తాపత్రికలో రాసిన వ్యాసంలో జిన్‌పింగ్ వివరించారు. ఈ సంక్షోభానికి సంబంధించి చైనా వాస్తవికమైన, నిష్పాక్షికమైన దృక్పథంతో వ్యవహరిస్తుందని జిన్‌పింగ్ పేర్కొన్నారు. రష్యా, ఉక్రెయిన్ మధ్య తిరిగి సయోధ్య కుదిర్చేందుకు శాంతియుత చర్చలే మార్గమని చైనా నేత ఉద్ఘాటించారు. ఐక్యరాజ్యసమితి నియమావళి నిర్దేశిస్తున్న సూత్రాల ఆధారంగా ఈ సంక్షోభాన్ని పరిష్కరించుకోవాలని చైనా నేత స్పష్టం చేశారు.



రష్యా-చైనాలను కలుపుతూ హేలాంగ్జియాంగ్ నదిపై నిర్మించిన మొదటి హైవే బ్రిడ్జి. 2019 డిసెంబరు2న తీసిన ఫొటో ఇది

చైనాకు అతిపెద్ద చమురు సరఫరాదారుగా రష్యా

చైనాకు రష్యా అతి పెద్ద చమురు సరఫరాదారుగా నిలిచింది. 2023 సంవత్సరం మొదటి రెండు మాసాల్లో రష్యా నుంచి ముడి చమురు దిగుమతులను చైనా బాగా పెంచింది. దీంతో ఇంతవరకు చైనాకు అతిపెద్ద చమురు సరఫరాదారుగా ఉన్న సౌదీ అరేబియా స్థానాన్ని ఇప్పుడు రష్యా ఆక్రమించిందని రాయిటర్స్ వార్తా సంస్థ తెలియజేసింది.జనవరి-ఫిబ్రవరి మధ్య రష్యా నుంచి కోటి 56 లక్షల టన్నుల ముడి చమురును చైనా కొనుగోలు చేసింది. అంటే రోజుకు 19.4 లక్షల బ్యారెళ్ల చమురు చైనా దిగుమతి చేసుకుంటుందన్నమాట. అమెరికా, ఇతర పశ్చిమ దేశాలు రష్యాకు వ్యతిరేకంగా ఆంక్షలు, జి-7 దేశాల పరిమితులు విధించడంతో ఆసియాలో కొత్త మిత్రుల కోసం రష్యా అన్వేషణ ప్రారంభించింది. చైనాతో వాణిజ్యం నెరపుతున్న ప్రధానమైన 20 దేశాల్లో రష్యా అగ్రగామిగా నిలిచింది.

ఇరాక్‌పై దాడికి 20ఏళ్లు!

- అమెరికా యుద్ధ నేరాలకు శిక్ష ఏదీ ?

బాగ్దాద్ : ఇరాక్‌పై అమెరికా దండెత్తి 20ఏళ్ళు గడిచినా ఇప్పటికీ ఇరాక్‌కు, ప్రజలకు న్యాయం జరగనే లేదు. అన్యాయంగా సాగిన ఆనాటి యుద్ధం సృష్టించిన బాధను చాలామంది అనుభవిస్తూనే వున్నారు. ఎనిమిదేళ్లపాటు సాగిన ఈ యుద్ధంలో 2లక్షల మందికి పైగా పౌరులు మరణించారు. 90లక్షల మంది నిర్వాసితులయ్యారు. దేశ మౌలిక సదుపాయాల్లో చాలా భాగం ధ్వంసమైంది. ఫలితంగా దాడికి ముందు సంపన్న దేశంగా వున్న ఇరాక్ నేడు నిరుపేదగా మారింది. రాజకీయ అస్థిరత, ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఇప్పటికీ దారిద్ర్యంలో కొట్టుమిట్టాడుతూనే వుంది. సామూహిక విధ్వంసక ఆయుధాలు వున్నాయన్న పేరుతో దాడికి దిగిన అమెరికా ఈనాటి వరకు ఆధారాలు చూపలేకపోయింది. ఈ ఒక్క కారణంపైనే అమెరికా, ఇరాక్‌కు, అంతర్జాతీయ సమాజానికి జవాబు చెప్పాల్సిన అవసరం వుంది. అయినా కానీ ఈనాటి వరకు ఆ దురాక్రమణ దాడికి, ఆ దేశంలో పెద్ద ఎత్తున సాగించిన విధ్వంసానికి, ఇరాకీలపై అమెరికా బలగాలు పాల్పడిన నేరాలకు అమెరికా ఎలాంటి క్షమాపణ చెప్పలేదు. అసలు ఇరాక్‌పై దాడి చేయాలని ఆనాడు నిర్ణయం తీసుకున్న వారిపై ఎలాంటి అభియోగాలు మోపలేదు. వారిని ఇప్పటివరకు శిక్షించే ఆలోచన కూడా చేయలేదు. అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు దీనిపై పూర్తిగా కళ్లు, చెవులు మూసుకుంది. ఇరాక్‌లో పౌరులపై హేయమైన యుద్ధ నేరాలకు పాల్పడిన వారు, వాటిని ప్రోత్సహించిన వారిని ప్రాసిక్యూట్ చేయలేదు. దీంతో వారు ఇలాంటి నేరాలకు మళ్ళీ మళ్ళీ పాల్పడుతున్నారు. అమెరికా తన ఆధిపత్య ధోరణులను కొనసాగించినంత కాలమూ ప్రపంచం ప్రశాంతంగా మనజాలదు.

శ్రీలంకకు 300 కోట్ల డాలర్ల ఐఎంఎఫ్ రుణం

న్యూయార్క్ : శ్రీలంకకు 300 కోట్ల డాలర్ల విలువైన ఎక్స్‌టెండెండ్ ఫండ్ ఫెసిలిటీ (ఇఎఫ్‌ఎఫ్)ను అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) ఆమోదించింది. దీంతో, రుణాల ఊబిలో కూరుకుపోయి, ఆర్థిక మాంద్యం నుండి కోలుకోవడానికి పోరాడుతున్న శ్రీలంకకు మరిన్ని రుణాలు అందడానికి అవకాశం ఏర్పడింది. సూక్ష్మ ఆర్థిక సుస్థిరతను పునరుద్ధరించడం, రుణ సుస్థిరత, ఆర్థిక స్థిరత్వానికి రక్షణ కల్పించడం, వ్యవస్థాగత సంస్కరణలను పెంపొందించడం ఇఎఫ్‌ఎఫ్ కార్యక్రమ లక్ష్యాలని ఐఎంఎఫ్ పేర్కొంది. శ్రీలంకతో ఐఎంఎఫ్ కుదుర్చుకున్న 17వ ఒప్పందం ఇది. అవినీతిని కీలకమైన సమస్యగా గుర్తిస్తూ, శ్రీలంక పాలనా సామర్థ్యాన్ని, అవినీతి నిరోధక వ్యవస్థ పనితీరును అంచనా వేయడం ఆరంభించినట్లు ఐఎంఎఫ్ అధికారులు మంగళవారం తెలిపారు. ఇటువంటి ప్రక్రియ చేపట్టడం ఆసియాలోనే ప్రథమం.

ఉరి శిక్ష అమానుషం !

- ప్రత్యామ్నాయాలపై సుప్రీం మల్లగుల్లాలు
- కమిటీ ఏర్పాటుకు సుముఖత



న్యూఢిల్లీ : ఉరి తీయడం ద్వారా మరణ శిక్షను అమలు చేయడం సముచితమా కాదా అని నిర్ధారించడానికి నిపుణుల కమిటీని ఏర్పాటు చేసేందుకు సుప్రీం కోర్టు మంగళవారం సుముఖత వ్యక్తం చేసింది. సుదీర్ఘ సమయం బాధ, నొప్పి వుండే ఉరి శిక్ష అమలును రద్దు చేయాలని, ఆ స్థానంలో నిముషాల వ్యవధిలో మరణం సంభవించేలా ప్రాణాంతకమైన ఇంజక్షన్‌ను ఇవ్వడం, కాల్చడం, విద్యుద్ఘాతం, గ్యాస్ చాంబర్‌లో పెట్టడం వంటి ఇతర రకాల శిక్షలను విధించే అవకాశాన్ని పరిశీలించాలని కోరుతూ దాఖలైన పిల్‌ను ప్రధాన న్యాయమూర్తి డి.వై.చంద్రచూడ్, జస్టిస్ పి.ఎస్.నరసింహాలతో కూడిన బెంచ్ విచారించింది.

న్యాయవాది రిషి మల్హోత్రా ఈ సందర్భంగా తన వాదనలు వినిపిస్తూ, ఉరిశిక్ష అమలు సమయంలో పరువును కోల్పోతారని, కానీ మరణ సమయంలో కూడా పరువు ముఖ్యమని అన్నారు. దోషికి శిక్షను అమలు చేసే సమయంలో సుదీర్ఘ సమయం బాధ పడేలా వుండరాదని, పైగా మరణ సమయంలో దేనినీ పరువుతో పోల్చలేమని అన్నారు. ఈ సందర్భంగా ఇతర దేశాల్లో అమలవుతున్న మరణశిక్షలను ఆయన వివరించారు. అమెరికాలోని 36 రాష్ట్రాల్లో ఇప్పటికే ఉరిశిక్షను రద్దుచేశారన్నారు. ఈ శిక్ష అమల్లో గల క్రూరత్వాన్ని విశదీకరిస్తూ, కొన్ని సందర్భాల్లో రెండు రోజుల పాటు కూడా ఈ శిక్ష అమలు కొనసాగుతునే వుంటుందన్నారు.

మన సాయుధ బలగాల చట్టంలో కాల్చడం లేదా ఉరి తీయడమనే రెండు అవకాశాలు వున్నాయి. కానీ ఈ నిబంధనలు మన సిఆర్‌పిసి నిబంధనల్లో లేవు. ఉరి తీయడం ద్వారా మరణశిక్షను అమలు చేయడమనేది అంత త్వరగా జరగదని, పైగా ఇది అమానవీయమని అన్నారు. డాక్టర్ వచ్చి మరణించాడా లేదా అని తేల్చేవరకు అలా 30 నిముషాల పాటు మృతదేహాన్ని వేలాడదీయడమనేది అత్యంత అమానుషమని అన్నారు. తన వాదనలకు మద్దతుగా బచ్చన్ సింగ్ వర్సెస్ పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వం కేసులో జస్టిస్ పి.ఎన్ భగవతి అసమ్మతి తీర్పును ఉదహరించారు.

ప్రత్యామ్నాయ పద్ధతులపై మల్లగుల్లాలు

మల్హోత్రా వాదనలు విన్న అనంతరం, ప్రత్యామ్నాయ పద్ధతులపై బెంచ్ దృష్టి సారించింది. "ఇక్కడ పరువు ప్రశ్న తలెత్తదు. అలాగే కనీస మాత్రపు నొప్పి, బాధ అనే ప్రశ్న కూడా రాదు. నిలిచే ప్రశ్నల్లా ఒక్కటే సైన్స్ మనకు ఏం చెబుతోంది? ప్రాణాంతక ఇంజక్షన్లు ఇవ్వచ్చా? అంటే లేదని సమాధానం వస్తోంది. అమెరికాలో కూడా ఇలా ఇంజక్షన్ ఇవ్వడం సరికాదని భావించారు. అని జస్టిస్ నరసింహా పేర్కొన్నారు. ఆ చర్చలో చంద్రచూడ్ పాల్గొంటూ, దీనిపై అమెరికన్ మేగజైన్లు కూడా సవివరమైన కథనాలు ఇచ్చాయన్నారు. ఆ ఇంజక్షన్ల వల్ల కూడా మరణం బాధాకరంగానే వుంటుందని, అది కూడా మానవీయం ఎంతమాత్రమూ కాదని తేల్చారన్నారు. ఇక కాల్చడమనేది అత్యంత ఆటవికమని కొట్టిపారేశారు. ఈ పద్ధతినే పాటించడమని మనం చట్టసభకు చెప్పలేం. కానీ ఇది మరికొంత మానవీయంగా వుంటుందని వాదించగలం. ఇంజక్షన్ విషయంలో కూడా ఏ రసాయనాలు వాడతారు, ఏం పరిశోధన జరిగింది అనే వాదనలు వున్నాయని అన్నారు. దీనిపై మరింత మెరుగైన ఆలోచనతో మళ్లీ హాజరవుతానని అటార్నీ జనరల్ తెలిపారు. మరణ శిక్షను అమలుచేసేందుకు మరింత మానవీయ మార్గాలు ఏమి వున్నాయనే దానిపై పరిశీలించాలని అటార్నీ జనరల్‌ను చంద్రచూడ్ కోరారు. ఉరి తీయడం వల్ల కలిగే ప్రభావం, నొప్పి, బాధ, ఎంత సమయం పడుతుంది, ఇంకా సమర్థవంతంగా అమలు చేయడానికి గల అవకాశాలు వంటి పలు అంశాలపై సవివరమైన నివేదిక, డేటాతో న్యాయ స్థానానికి రావాల్సిందిగా అటార్నీని కోరారు. మే చివరికి ఈ అంశంపై విచారణను వాయిదా వేశారు.

అఖిలపక్ష సమావేశానికి హాజరైంది బిజెపి, వైసిపి, టిడిపిలే !

ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంటు సమావేశాలు సజావుగా నిర్వహించేందుకు రాజ్యసభ సభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ అఖిలపక్ష సమావేశం నిర్వహించగా కేవలం మూడు పార్టీలే హాజరుకావడం విశేషం. మంగళవారం ఉదయం 11.30 గంటలకు జరిగిన ఈ సమావేశానికి అధికార బిజెపితో పాటు కేవలం వైసిపి, టిడిపి సభాపక్ష నాయకులు మాత్రమే హాజరు కావడం విశేషం. పార్లమెంటులో అదానీ అక్రమాలు, అధిక ధరలు, ఇతర ప్రజా సమస్యలపై చర్చకు ప్రతిపక్షాలు పట్టుబడుతుంటే ప్రభుత్వం కావాలనే అటంకాలు సృష్టించి సభా సమయాన్ని వృధా చేస్తోందని, అందుకు నిరసనగానే ప్రతిపక్షాల సభాపక్ష నాయకులు ఈ అఖిలపక్ష భేటీకి ముఖం చాటేసినట్లు కనిపిస్తోంది. కాంగ్రెస్, టిఎంసి, డిఎంకె, ఆప్, బిజెడి, ఆర్‌జెడి, సిపిఎం, సిపిఐ, జెడియు, అన్నాడిఎంకె, ఎన్‌సిపి, ఎస్‌పి, శివసేన (ఠాక్రే), బిఆర్‌ఎస్, ఎజిపి పార్టీల నాయకులు భేటీలో పాల్గొనలేదు.

కేంద్ర మంత్రులతో మోడీ భేటీ

ప్రధాని నరేంద్ర మోడీ మంగళవారం కీలక శాఖలకు సంబంధించిన కేంద్ర మంత్రులతో సమావేశమయ్యారు. పార్లమెంటు బడ్జెట్ సమావేశాల రెండో దశలో అనుసరించవలసిన వ్యూహంపై ఆయన చర్చించారు. ఉభయ సభల సమావేశాలు ప్రారంభమవ్వడానికి ముందు వీరి భేటీ జరిగింది.

రైతుపై రుణభారం ఏపిలోనే అధికం

ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో రైతులపై అత్యధిక రుణభారం ఉన్న రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో నిలిచింది. ప్రతి రైతుపై సగటున రూ.2,45,554.00 అప్పు ఉన్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి భగవత్ ఖరాడి వెల్లడించారు. రాజ్యసభలో ఒక ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమధానం ఇచ్చారు. అలాగే ప్రతి రైతుపై అప్పు విషయంలో దేశంలో ఐదో స్థానంలో తెలంగాణ నిలిచింది. తెలంగాణలో సగటున ప్రతి రైతుపై రూ.1,52,113 అప్పు ఉన్నట్లు కేంద్రమంత్రి తెలిపారు.

ప్యాకేజీ ఇచ్చాం..

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాకు బదులుగా ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్‌రాయ్ తెలిపారు. లోక్‌సభలో వైసిపి ఎంపిలు లావు శ్రీకృష్ణదేవరాయలు, బాలశౌరి అడిగిన ప్రశ్నకు నిత్యానంద లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. 2015 నుంచి 2018 వరకు ఇఎపి పథకాలకు తీసుకున్న రుణాలపై వడ్డీని కూడా చెల్లించామని, అందుకోసం రూ.15.81 కోట్లు విడుదల చేశామని వెల్లడించారు.

ఏపికి తెలంగాణ విద్యుత్ బకాయి రూ.6.6 వేల కోట్లు

తెలంగాణకు 2014 జూన్ 2 నుంచి 2017 జూన్ 10 వరకు విద్యుత్ సరఫరా చేసినందుకు ఆ రాష్ట్రం తమకు రూ.6,627.86 కోట్లు (2021 ఏప్రిల్ 30 నాటికి) చెల్లించాల్సి ఉందని ఆంధ్రప్రదేశ్ తెలిపిందని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి తెలిపారు. టిడిపి ఎంపి కనకమేడల రవీంద్రకుమార్ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానమిచ్చారు. విద్యుత్ సరఫరా చేసినందుకు గానూ తెలంగాణ ఆంధ్రప్రదేశ్‌కు (2022 జులై 31 నాటికి) అసలు రూ.3,441, 78 కోట్లు, ఆలస్యం చేసినందుకు సర్‌చార్జి కింద రూ.3,315.14 కోట్లు (మొత్తంగా రూ.6,756 92 కోట్లు) చెల్లించాల్సి ఉందని కేంద్ర విద్యుత్ శాఖ ఉత్తర్వులు ఇచ్చిందని ఆయన పేర్కొన్నారు.

దళితులపై దాడులు, నేరాలు.. 1,89,945 కేసులు నమోదు

- అట్రాసిటీ చట్టం అమలు బాధ్యత రాష్ట్రాలదే : కేంద్రం

న్యూఢిల్లీ : 2018-2021 మధ్యకాలంలో దళితులపై జరిగిన దాడులు, నేరాలకు సంబంధించి 1,89,945 కేసులు నమోదయ్యాయని మంగళవారం పార్లమెంట్‌లో కేంద్రం వెల్లడించింది. పోలీసు, శాంతిభద్రతలు పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని అంశమని, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని సమర్థవంతంగా అమలుజేయటంపై రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు కేంద్రం తరచూ మార్గదర్శకాలు, సూచనలు జారీచేస్తోందని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి అజయ్ కుమార్ మిశ్రా చెప్పారు. 2018 నుంచి ఇప్పటివరకూ దళితులపై జరిగిన దాడులు, నేరాల గణాంకాల్ని తెలపాలని, దాడి ఘటనలు, కేసులను పర్యవేక్షించే యంత్రాంగమేదైనా ఉందా? అని బిఎస్‌పి ఎంపీ గిరీష్ చంద్ర ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు సమాధానంగా అజయ్‌కుమార్ మిశ్రా పై సమాచారాన్ని విడుదల చేశారు.

దళితులపై జరుగుతున్న నేరాలు, ఘోరాల సమాచారాన్ని ఎన్‌సిఆర్‌బి విడుదల చేస్తోందన్నారు. ఇందులో పొందుపర్చిన సమాచారాన్నే ఆయన తన సమాధానంలో ప్రస్తావించారు. గత రెండేళ్లలో న్యూఢిల్లీలో ప్రజాప్రతినిధులపై జరిగిన దాడుల అంశాన్ని ఎఐఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ లేవనెత్తారు. కేంద్ర సహాయమంత్రి నిత్యానందరాయ్ స్పందిస్తూ.. "ప్రజాప్రతినిధులపై దాడులకు సంబంధించి ఢిల్లీ పోలీసులు నాలుగు కేసులు నమోదుచేశారు. 16మందిని అరెస్టు చేశారు. రెండు కేసుల్లో ఛార్జ్‌షీట్ దాఖలైంది. ఇలాంటి దాడులు జరగకుండా పోలీసు అధికారులు తమ ప్రాంతంలో నిఘా ఉంచాలని ఆదేశించా"మని చెప్పారు.



ఉగాది పండుగ



ఒక పాఠశాల ఉపాధ్యాయిని తన విద్యార్థులతో ఇలా అన్నది : పిల్లలూ.. ఉగాది పండుగ వస్తుంది కదా! దాని గురించి మీరు చెప్పాలి. మీ తాతయ్య నాన్నమ్మలనో, అమ్మానాన్నలనో అడిగి తెలుసుకోండి. రేపు వచ్చి, మీ సొంత మాటల్లో చెప్పండి. చక్కగా చెప్పిన వాళ్లకు నేనొక మంచి బహుమతి ఇస్తాను." అంది.

పిల్లలందరూ అలాగేనని తలలూపారు. క్లాసులో రవి చురుకైనవాడు. పాఠశాల విడిచి పెట్టాక రవి ఇంటికి చేరుకొని అమ్మ దగ్గరకు వెళ్ళాడు. రవి వెనకాలే వాళ్ల నాన్నమ్మ కూడా వారి దగ్గరకు వచ్చింది. అమ్మను ఉగాది పండుగ గురించి చెప్పాలని గోముగా అడిగాడు. తాను పనిలో ఉన్నానని, నాన్నమ్మను అడగమని పురమాయించింది అమ్మ.

రవి నాన్నమ్మను అడిగాడు. నాన్నమ్మ ఇలా చెపిపంది : 'ఉగాది తెలుగు ప్రజలకు ముఖ్యమైన పండుగ. ఉగాదినే తెలుగు సంవత్సరాది, యుగాది అని అంటారు. ఎందుకంటే, తెలుగు సంవత్సరం ఉగాదితోనే ప్రారంభమవుతుంది కాబట్టి. శిశిర రుతువు ఆకురాల్చు కాలం. శిశిరం తరువాత వసంతం వస్తుంది. చెట్లు చిగురించి ప్రకృతి అంతా పచ్చదనంతో శోభాయమానంగా ఉంటుంది. ఈ కొత్త సంవత్సరాన్ని తెలుగు ప్రజలందరూ ఆనందంతో జరుపుకుంటారు. ఉగాది పచ్చడి చేస్తారు. దానిలో తీపి, పులుపు, ఉప్పు, కారం, చేదు, వగరు అనే ఆరురుచులూ ఉంటాయి. ఈ షడ్రుచులు కష్టసుఖాలకు ప్రతీకగా నిలుస్తాయి.' అని చెప్పింది.

మరుసటి రోజు రవి బడికి హుషారుగా బయలుదేరాడు. ఉపాధ్యాయిని అడగగానే ... నాన్నమ్మ చెప్పిన ఉగాది పండుగ విశిష్టతను పూసగుచ్చినట్లు చెప్పాడు. మరి కొంతమంది విద్యార్థులు కూడా చెప్పారు. కానీ రవి చెప్పిన విధానం నచ్చడంతో టీచర్ రవికే ప్రధమ బహుమతి ఇచ్చారు. ఆ బహుమతిని తీసుకొని సరాసరి నాన్నమ్మ చేతిలో పెట్టాడు. అది చూసి నాన్నమ్మ, రవిని ముద్దులతో ముంచెత్తింది.

- గంధవరపు పల్లవి కలాం,
9వ తరగతి, జి. ప. ఉన్నత పాఠశాల,
బొద్దాం, విజయనగరం జిల్లా,
9391814366.

ఉగాది పచ్చడి



కోయిల కమ్మగ కూసింది
వసంత ఋతువు వచ్చింది
ఫాల్గుణ మాసం వెళ్ళింది
ఉగాది పండుగ వచ్చింది

అమ్మ వేపపూత తెచ్చింది
మామిడి పిందెలు కోసింది
చెరకు తీపిని వేసింది
మిరియపు కారం చల్లింది

చింతపండును పిండింది
ఉప్పును బాగా కలిపింది
షడ్రుచుల పచ్చడి చేసింది
ఇంటిల్లిపాదికి పంచింది

మనం తినే ఆరు రుచులు
మనిషి జీవిత సుఖదుఃఖాలు
ఎదురయ్యే ఎగుడుదిగుడులు
మంచి చెడ్డల ప్రతిబింబాలు
తినే ఒక్కొక్క రుచికి
ఒక్కో ఆరోగ్య సూత్రం..!

- ఆవుల చక్రపాణి యాదవ్
99633 50973

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com




చిగురింతల సందోహం.. ఉగాది సందేశం ...

తెలుగు వారి సంవత్సరాది ఉగాది. ఇది పూర్తిగా ప్రకృతి సంబంధిత పండగ. అనంతంగా సాగే కాల ప్రవాహంలో చెట్ల ఆకు విడుపు ... కాలానికి ఒక ఆటవిడుపు. మోడు వారిన చెట్టూ చేమా మళ్లీ కొత్తగా, కొంగొత్తగా చివురించి... ఉత్పత్తికి సమాయత్తం కావడం నూతనారంభానికి సంకేతం. ప్రకృతి సూత్రాలను జీవితానికి అన్వయించే సందర్భం ... ఉగాది పర్వదినం! 'శిశిరంలో వాడినా, ఓడినా వసంతం నాటికి కొంగొత్తగా చివుళ్లెత్తే చైతన్యమే జీవితం' అని చాటే ప్రకృతి సందేశం!

శిశిరంలో ఆకులన్నీ రాలిపోతాయి. చూస్తుండగానే చెట్లు మోడువారిపోతాయి. కొమ్మల మధ్యలోంచి చూస్తే- అంతా శూన్యమే కనిపిస్తుంది. చూపునిండా వెలితి మేఘాలు ఆవరిస్తాయి. కింద రాలిపడిన ఆకులు ఎండిపోయి- గాలివాటుకు ఎటెటో చెల్లాచెదురైపోతాయి. అన్నాళ్లూ కళకళలాడిన చెట్టు వెలవెలపోయినందుకు కలవరపడిపోదు. విలవిల్లాడదు. బోరుమని విలపించదు. నిరాశను కౌగలించుకోదు. నీరసాన్ని నెత్తికెత్తికోదు. రాలిన ఆకుల స్థానే కొత్త చివుళ్లను మొలకెత్తటానికి సమాయత్తమవుతుంది. ఎండలు దండిగా దండెత్తుతున్నా సరే... భూమి పొరల్లోంచి చెమ్మను నెమ్మది నెమ్మదిగా సంగ్రహించి... లేలేత చివుళ్లకు ప్రాణధారగా అందిస్తుంది. అలా అందిన శక్తిని నింపుకొని లేలేత ఆకులు సరికొత్తగా పరవశిస్తాయి. జీవకళతో పరిమళిస్తాయి. మోడువారిన చెట్టు నిండా హరితవర్ణపు పతాకాల్లా ఆకులు రెపరెపలాడతాయి. గుబురు కిరీటాలను ధరించిన ధీరశిఖరంలా చెట్టు నిండుగా, కనువిందుగా కనిపిస్తుంది. అలాంటి గుబురు కొమ్మల్లో దాక్కొని దాక్కొని కోయిల కుహూకుహూ రావాలు చేస్తుంది. అదొక ప్రకృతి సందోహం! 'అంతా అయిపోయింది' అన్న చోట- 'ఇంకా ఎంతో ఉంది' అని చాటి చెప్పే సందర్భం ఈ వసంతం. శూన్యం ఆవరించింది అనుకున్నప్పుడు - అనంతంగా ఆశలు మోహరించే సంకేతం ఈ ఉగాది.

ఆకులు రాలిన చోట...

ఉగాది అచ్చమైన, స్వచ్ఛమైన ప్రకృతి పండగ. తొట్టతొలి కాలంలో ఇప్పుడు ఉన్నన్ని తంతులూ తతంగాలూ లేని పల్లెవాసుల వేడుక. శిశిరమంతా చలిగాలుల వెల్లువ. చైతన్యం సుప్తావస్థలోకి ముడుచుకుపోయే వాతావరణం. పొద్దు వాలగానే చలిపులి దాడి చేస్తుంటే - ఎవరి ముసుగులోకి వాళ్లు దూరిపోయి దాక్కొనే పరిస్థితి! చుట్టూ ఉన్న పరిసరాలు కూడా నిశ్శబ్దాన్ని ఆవహించి, స్తబ్ధుగా నిద్రపోతాయి. వసంతం వచ్చేసరికి అలాంటి వాతావరణం మాయమై - పచ్చని ఆకుల రెపరెపలతో ప్రకృతి గొంతు విప్పుతుంది. మామిడికాయల గుత్తులు, వేపపూల సొగసులూ, చింతబొట్టల కణకణ ధ్వనులూ, చురుగ్గా వీచే చిరుగాలుల అల్లర్లూ ... పరిసరాలకు పరవశం కలిగిస్తాయి. జనావళి మది మూలల్లో సంతోష సరాగాలను తట్టి తట్టి లేపుతాయి. ఆ ఆనందపు సందోహం ఆవరించటం వల్లే- కోయిళ్లు గొంతెత్తుతాయి. కవులు ప్రతిస్పందించి, కవిత్వంగా ప్రతిధ్వనిస్తారు. ఆకులు రాలిన చోట.. ప్రకృతి వసంతగీతం పాడుతుంది.



సేద్యానికి శుభారంభం!

ప్రకృతిలో 'కొత్తొ'చ్చినట్టు కనిపించే సహజ సందడిని ఒక్కోచోట ఒక్కోలా జరుపుకుంటారు. మనది వ్యవసాయ ప్రధానమైన సమాజం కాబట్టి - ఇక్కడి పర్వదినంలో వ్యవసాయ సంబంధ పద్ధతులే కనిపిస్తాయి. ఉగాదిని ఒక కాలమానంగా పెట్టుకొని - వ్యవసాయ ఆరంభానికి రైతులు సన్నద్ధమవుతారు. కొత్తగా కాడినో, మేడినో తయారు చేయించటం; పలుపో, కాడితాళ్లో సిద్ధం చేయడం, పొలాల్లోకి గెత్తం తోలటం, మళ్లలో సాళ్లు వేయటం.. వంటి పనులు చేపడతారు. ఇదంతా వ్యవసాయ పనుల్లోకి ట్రాక్టర్లు రాకముందు సాగిన సాంప్రదాయం. ఇప్పుడు పరిస్థితి మారింది. అయినా, వ్యవసాయ ఆరంభానికి అవసరమైన ఏదో ఒక ప్రక్రియను చేపట్టటం ఆనవాయితీగానే ఉంది. భూమి కౌలు, తనఖా వంటి ఒప్పందాలు ఈ కొత్తామావాస్య కాలంలోనే కుదుర్చుకుంటారు.

పచ్చడిలో జీవిత పరమార్థం!

ఉగాది అనగానే గుర్తొచ్చేది ఆరు రుచుల పచ్చడి. తీపి, చేదు, పులుపు, కారం, ఉప్పు, వగరు. ఇన్ని రుచులు కలగలిసిన తయారీ ఇది తప్ప ఇంకేదీ మనం చవిచూడం. పచనం లేకుండానే ప్రకృతిలో దొరికిన దినుసులను యథాతథంగా వాడడం కూడా ఇందులో ప్రత్యేకం. జీవితంలో కష్టాలూ సుఖాలూ సంతోషాలూ విషాదాలూ కలగలిసి ఉంటాయని ఈ పచ్చడి పరమార్థంగా పెద్దలు చెబుతారు. దీనిని 'జీవితం అంటే ఇంతే' అన్న వేదాంత అర్థంలో కాక - 'జీవితం అంటే ఇవి కూడా' అన్న వ్యవహారిక అర్థంలో తీసుకోవాలి. కష్టకాలంలో కొట్లాడి, పోరాడి దానిని అధిగమించాలి. దుఃఖ సమయంలో దానిలో మునిగి, వైరాగ్య గీతాలు పాడుకోకుండా - దాన్నుంచి బయటపడే దారి కోసం అన్వేషించాలి. సుఖసంతోషాలు ఉన్నప్పుడూ అంతే! అవే శాశ్వతమూ సౌఖ్యమూ అన్నట్టు ప్రవర్తించకూడదు. జీవితమంటే - శిశిరంలాంటి ప్రతికూలతతో పోరాడి.. వసంతం వంటి చైతన్యంలోకి ప్రయాణించటం. ముడుచుకున్న ముసుగులోంచి ప్రభవించి.. కొమ్మల్లోని కోయిల పాటలా ప్రవహించటం. అర్థం చేసుకుంటే - ఉగాది తాత్పర్యం ఇదే! పచ్చడి పరమార్థమూ ఇంతే!!

పర్యావరణ హననం వద్దు

ఇప్పుడు మనం చాలా చిత్రమైన సందర్భాల్లో ఉన్నాం. చెట్లను నరుక్కుంటూ - వసంతం కోసం ఎదురుచూస్తున్నాం. కాంక్రీటు అరణ్యాలు నిర్మించుకుంటూ - కోకిల పాట కోసం చెవులొగ్గుతున్నాం. పర్యావరణాన్ని ధ్వంసం చేస్తూ - పచ్చడిలోని ప్రకృతి పరమార్థం గురించి పరవశిస్తున్నాం. వ్యవసాయాన్ని పాడె ఎక్కిస్తూ - రైతే రాజు అని కబుర్లు చెప్పుకుంటున్నాం. ఇక్కడ మనం అంటే మనమే అని కాదు. మన మౌనాన్ని మద్దతుగా చేసుకొని- మౌలిక వనరులను, పద్ధతులను మింగేస్తున్న ఘనుల గురించే ఈ మాట. ప్రకృతి వనరులను వ్యాపార పరమార్థంగా స్వాహా చేస్తున్న శక్తులూ యుక్తులూ ఈ కాలంలో బాగా పెరిగాయి. ఫలితంగా నదులు కాలుష్యం.. చెట్టు చేమలు అదృశ్యం. పంటపొలాల్లో భవనాల నిర్మాణం.. ఎక్కిన కొమ్మనే నరుక్కుంటున్న తెలివి తక్కువ వ్యవహారం. ఈ పర్యావరణ హననం మీద మనం గట్టిగా పట్టించుకోవాలి. లేకుంటే - భవిష్యత్తులో వేపచెట్టును ఇంటర్నెట్లో వెతుక్కోవాల్సి ఉంటుంది. కోయిల పాటను కంప్యూటర్లోంచి వినాల్సి ఉంటుంది.

పంచాంగం చెప్పని భవిష్యత్తు

ఉగాది పూట మనం తెలుగు భాష గురించి ఘనంగా మాట్లాడుకుంటాం. తెలుగు సంస్కృతి గురించి గొప్పగా కీర్తించుకుంటాం. ఇది మాత్రమే సరిపోదు ఇప్పుడు. అవసరమైన దానిని నిలబెట్టుకోవటం కోసం నిరంతరం ఆలోచించాలి. పరిష్కార మార్గాలు అన్వేషించాలి. ప్రకృతికి, మనిషికి దూరం పెరగకూడదు. ఎంత పెరిగితే అంత అనర్థం. అలాంటి అనర్థాలకు తావు లేని ప్రతిరోజూ వసంతాల ఉగాది అవుతుంది. పర్యావరణాన్ని హరించే ధోరణులు దారుణంగా పెచ్చుపెరిగితే - ఉగాది కూడా శిశిరంలోనిశీతల చీకటి రాత్రిలాగానే మిగులుతుంది.

మనకు ఏది కావాలో ఏ పంచాంగమూ చెప్పదు.

మనకు మనమే చెప్పుకోవాలి :

'ప్రకృతిని కాపాడుకుంటాం..
మంచి భవిష్యత్తును
నిర్మించుకుంటాం.' అని.

- శాంతిమిత్ర





'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' సాంగ్

అనుష్కా, నవీన్ పోలిశెట్టి కాంబోలో వస్తున్న సినిమా 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి'. ఇప్పటికే విడుదల చేసిన టైటిల్, ఫస్ట్ లుక్ సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. ఈ మూవీ నుంచి మొదటి పాటను విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఎంఎస్ఎంపి పేరుతో వాట్సాప్ ఛాటింగ్ ద్వారా పాట విడుదల చేస్తున్నట్లు ఓ వీడియోను విడుదల చేశారు. 'నోనోనో ...' అంటూ సాగే మొదటి సాంగ్‌ను ఉగాది పండగ సందర్భంగా లాంఛ్ చేయనున్నట్టు మేకర్స్ ప్రకటించారు. కామెడీ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ చిత్రానికి పి మహేశ్ బాబు దర్శకత్వం వహిస్తున్నాడు. యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై తెరకెక్కుతుంది.



నేను ఆరోగ్యంగానే ఉన్నా..

టాలీవుడ్ నటుడు కోట శ్రీనివాసరావు గురించి సోషల్ మీడియాలో పుకార్లు షికారు చేస్తున్నాయి. కోట శ్రీనివాసరావు అస్వస్థతకు గురయ్యారని, ఆసుపత్రిలో చేరారని కొందరు నెటిజన్లు ప్రచారం చేస్తున్నారు. చాలా మంది ఈ వార్తలను విశ్వసించారు. ఈ నటుడు కోలుకోవాలని ప్రార్థించారు. అయితే ఈ వార్తలపై కోట శ్రీనివాసరావు స్పందించారు. ఈ విషయంపై క్లారిటీ ఇస్తూ 'నేను పూర్తి ఆరోగ్యంగా ఉన్నాను. తప్పుడు వార్తలను నమ్మవద్దు. ఇలాంటి ప్రచారాలే గుండెపోటు తెప్పిస్తాయి. ఈ వార్తలను ప్రచారం చేసే వారిపై చర్యలు తీసుకోవాలి. ఉగాది సంబరాల్లో మునిగివున్న నాకు ఉదయం నుంచి అనేక ఫోను కాల్స్ రావడం చాలా ఆందోళన కలిగించింది. ఏకంగా పది మంది పోలీసులు భద్రత కోసం నా ఇంటికి వచ్చారు. డబ్బు సంపాదించడానికి ఎన్నో మార్గాలుంటాయి. ఇలాంటి తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దు' అంటూ ఓ వీడియో విడుదల చేశారు.

రవితేజ వద్ద అసిస్టెంటుగా ...



మాస్ మహారాజా రవితేజ చిత్రం 'రావణాసుర'. సుధీర్ వర్మ దర్శకత్వం వహించిన ఈ చిత్రం యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతోంది. అభిషేక్ పిక్చర్స్, ఆర్ టీ టీమ్‌వర్క్స్‌పై అభిషేక్ నామా, రవితేజ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఏప్రిల్ 7న విడుదల కాబోతున్న నేపథ్యంలో ఈ చిత్రంలోని హీరోయిన్స్‌లో ఒకరైన ఫరియా అబ్దుల్లా మాట్లాడారు. 'ఇందులో రవితేజ సీనియర్ లాయర్. ఆయన దగ్గర అసిస్టెంట్‌గా చేస్తాను. నా పాత్రలో చాలా షేడ్స్ ఉంటాయి. కోర్టు సీన్స్ తక్కువే. ప్రొఫెషన్‌పరంగా నా పాత్ర కీలకమైంది. మ్యారీడ్ వుమెన్ పాత్ర కాబట్టి బాడీ లాంగ్వేజ్ కూడా కొంచెం పరిణితతో ఉంటుంది. ఇందులో ఫ్లాప్ బ్యాక్‌లో వచ్చే బ్రేకప్ సాంగ్‌లో నటించాను. రవితేజతో పని చేయడం నెక్ట్స్ లెవల్ ఎక్స్ పీరియన్స్. నటుడిగానే కాదు వ్యక్తిగా కూడా ఆయన చాలా స్ఫూర్తిదాయకం. ఈ కథను రైటర్ శ్రీకాంత్ చెప్పారు. విన్నప్పుడు చాలా ఎక్సయిటింగ్ గా అనిపించింది. సుధీర్ వర్మ చాలా క్లారిటీ వున్న దర్శకులు. ఆయనతో వర్క్ చేయడం చాలా మంచి ఎక్స్ పీరియన్స్' అని చెప్పింది.



పిఎస్-2 నుంచి 'ఆగనందే..'

దర్శకుడు మణిరత్నం చిత్రం 'పొన్నియిన్ సెల్వన్-2' ఏప్రిల్ 28న విడుదల కానుంది. ఈ పాన్ ఇండియా మూవీ ప్రమోషన్స్ ప్రారంభించారు మేకర్స్. ఈ నేపథ్యంలోనే మొదటగా 'ఆగనందే' పాట వీడియోను విడుదల చేశారు. రెహమాన్ కంపోజ్ చేసిన ట్యూన్‌కి అనంత శ్రీరామ్ రాసిన లిరిక్స్ అండ్ శక్తి శ్రీ గోపాలన్ వాయిస్ కూడా కలిసి మరింత స్పెషల్‌గా మార్చాయి. ఈ సాంగ్ యుట్యూబ్‌లో ట్రెండ్ అవుతోంది. మణిరత్నం, రెహమాన్ కలిసి లండన్‌లోని ఆబీ స్టూడియోస్‌లో చిత్రంలో సౌండ్ డిజైన్‌లో కొన్ని మార్పులు చేస్తున్నారు.

పబ్లిసిటీ ఇన్‌ఛార్జ్ ప్రమోద్ కుమార్ కన్నుమూత



సీనియర్ పబ్లిసిటీ ఇన్‌ఛార్జ్ వీరమాచనేని ప్రమోద్ కుమార్ (87) విజయవాడలో మంగళవారం కన్నుమూశారు. 38 సంవత్సరాల సినీ ప్రస్థానంలో ఆయన 300లకు పైగా చిత్రాలకు పబ్లిసిటీ ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరించారు. అందులో 31 సినిమాలు శతదినోత్సవం జరుపుకున్నాయి. కొన్ని చిత్రాలలో ఆయన అతిథి పాత్రలు పోషించారు. మోహన్ బాబు 'దొంగ పోలీస్'తో పాటు 'గరం మసాలా' చిత్రాన్ని మిత్రులతో కలిసి నిర్మించారు. 'సుబ్బయ్య గారి మేడ' పేరుతో ఓ నవల రాశారు. తన సినిమా అనుభవాలను 'తెర వెనుక తెలుగు సినిమా' పేరుతో గ్రంథస్థం చేశారు. ఇది రాష్ట్ర ప్రభుత్వ నంది పురస్కారానికి ఎంపికైంది. ప్రమోద్ కుమార్‌కు ఓ కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఫైనల్‌కు ఢిల్లీ క్యాపిటల్స్

25న ఎలిమినేటర్‌లో ముంబయి - యుపి ఢీ
ముగిసిన లీగ్ పోటీలు

ముంబయి: మహిళల ప్రీమియర్‌లీగ్ (డబ్ల్యుపిఎల్) ఫైనల్లోకి ఢిల్లీ క్యాపిటల్స్ ప్రవేశించింది. మంగళవారం జరిగిన చివరి లీగ్ మ్యాచ్ లో ఢిల్లీ జట్టు 5వికెట్ల తేడాతో యుపి వారియర్స్‌పై గెలిచి 12పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. మరో మ్యాచ్‌లో ముంబయి జట్టు తన చివరి లీగ్ మ్యాచ్‌లో బెంగళూరుపై గెలిచినా.. రన్ రేట్‌లో వెనుకబడి రెండోస్థానానికే పరిమితమైంది.

డివై పాటిల్ వేదికగా మంగళవారం జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో ముంబయి ఇండియన్స్ మహిళల జట్టు 4వికెట్ల తేడాతో రాయల్ ఛాలెంజర్స్ మహిళలపై విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి 125పరుగులు చేసింది. స్మృతి మంధాన (24), ఎలీసా పెర్రీ(29), రీచా ఘోష్(29) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించారు. ముంబయి బౌలర్లు అమేలియా కెర్‌కు మూడు, స్కీవర్ బ్రంట్, వాంగ్‌కు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో ముంబయి జట్టు 16.3 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 129పరుగులు చేసి గెలిచింది. మాథ్యూస్(24), యస్టికా భాటియా(30)కి తోడు అమేలియా కెర్(31నాటౌట్) బ్యాటింగ్‌లో రాణించారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అమేలియా కెర్‌కు లభించింది. దీంతో ముంబయి జట్టు 8 మ్యాచుల్లో ఆరో విజయాన్ని సొంతం చేసుకుంది.

ఇక బ్రాబౌర్న్ వేదికగా జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన యుపి జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 138పరుగులు చేయగా.. ఛేదనలో ఢిల్లీ జట్టు 17.5ఓవర్ల లో 5వికెట్లు 142 పరుగులు చేసి గెలిచింది. కెప్టెన్ లానింగ్(39), కాప్(34), కాప్సే(34నాటౌట్) బ్యాటింగ్‌లో రాణించారు. శుక్రవారం(25న) జరిగే ఎలిమినేటర్ మ్యాచ్‌లో ముంబయి-యుపి జట్ల మధ్య జరగనుంది. ఆ మ్యాచ్‌లో గెలిచిన జట్టు 27న జరిగే ఫైనల్లో ఢిల్లీతో తలపడనుంది.



పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	టై	ఫ.తే	పా	నె.రన్‌రేట్
ఢిల్లీ క్యాపిటల్స్	8	6	2	0	0	12	+1.856
ముంబయి ఇండియన్స్	8	6	2	0	0	12	+1.711
యుపి వారియర్స్	8	4	5	0	0	8	-0.200
ఛాలెంజర్స్ బెంగళూరు	8	2	6	0	0	4	-1.137
గుజరాత్ జెయింట్స్	8	2	6	0	0	4	-2.220

సిరీస్ కొట్టేదెవరో..?

భారత్-ఆస్ట్రేలియా చివరి వన్డే నేడు

మధ్యాహ్నం 1.30గం॥ల నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో



చెన్నై: వన్డే సిరీస్ ట్రోఫీ ఇరుజట్లను ఊరిస్తోంది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా ఇప్పటివరకు జరిగిన తొలి రెండు వన్డేల్లో ఇరుజట్లు ఒక్కో మ్యాచ్‌ను గెలిచి 1-1తో సమంగా ఉన్నాయి. ముంబయి వేదికగా జరిగిన తొలి వన్డేల్లో టీమిండియా 5వికెట్ల తేడాతో ఆసీస్‌ను ఓడిస్తే.. విశాఖ వేదికగా జరిగిన రెండో వన్డేలో ఆస్ట్రేలియా ఏకంగా 10వికెట్ల తేడాతో టీమిండియా చిత్తుచేసింది. ఈ క్రమంలో నిర్ణయాత్మక మూడో, చివరి వన్డే చెన్నైలోని చిదంబరం స్టేడియంలో జరగనుంది. ఈ మైదానంలో కూడా బ్యాటర్స్ హవా కొనసాగనుంది. విశాఖ వేదికగా జరిగిన వన్డేలో ఆస్ట్రేలియా పేసర్ స్టార్క్ దెబ్బకు టీమిండియా బ్యాటర్స్ పెవీలియన్‌కు క్యూ కట్టారు. ఈ క్రమంలో టీమిండియా నిర్దేశించిన 118పరుగుల లక్ష్యాన్ని ఆస్ట్రేలియా కేవలం 11 ఓవర్లలోనే వికెట్ కోల్పోకుండా ఛేదించి వన్డే సిరీస్ రేసులో నిలిచింది. టెస్ట్ సిరీస్‌ను 2-1తో గెలిచిన టీమిండియా వన్డే సిరీస్‌ను కాపాడుకోవాలంటే ఈ మ్యాచ్‌లో తప్పనిసరిగా గెలవాల్సిన పరిస్థితి.

జట్లు(అంచనా)..

ఇండియా: రోహిత్(కెప్టెన్), శుభ్‌మన్, కోహ్లి, సూర్యకుమార్/సుందర్, కేఎల్ రాహుల్(వికెట్ కీపర్), హార్దిక్, జడేజా, అక్షర్, కుల్దీప్, సిరాజ్, షమీ.

ఆస్ట్రేలియా: స్టీవ్ స్మిత్(కెప్టెన్), హెడ్, మిఛెల్ మార్ష్, లబూషేన్, క్యారీ(వికెట్ కీపర్), గ్రీన్, స్టాయినీస్, అబట్, ఎల్లీస్, స్టార్క్, జంపా.



రాయ్‌బరేలీ స్టేడియంకు రాణి రాంపాల్ పేరు

హాకీ చరిత్రలో తొలిసారి

లక్నో: భారత మహిళల హాకీజట్టు కెప్టెన్ రాణి రాంపాల్‌కు అరుదైన గౌరవం దక్కింది. రాయ్‌బరేలీలోని ఎంసిఎఫ్ హాకీ స్టేడియం పేరును 'రాణిస్ గర్ల్స్ హాకీ టర్ఫ్'గా మార్పు చేసింది. ఆ స్టేడియంను రాణి రాంపాల్ మంగళవారం ప్రారంభించింది. ఆ ఫొటోలను రాణి సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. హాకీ క్రీడకు తాను చేసిన సేవలకు గుర్తింపుగా ఓ స్టేడియంకు తన పేరును జోడించడం సంతోషించదగ్గ పరిణామమని, ఇది యువ క్రీడాకారిణులకు ప్రేరణగా నిలుస్తుందని ట్విట్టర్‌లో పేర్కొంది. హాకీ క్రీడా చరిత్రలో ఓ స్టేడియంకు మహిళా హాకీ ప్లేయర్ పేరును నామకరణం చేయడం చరిత్రలో ఇదే తొలిసారి.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68